


సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12

సంచిక: 124

గురువారం 25-7-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




**పతకాలు ఖాయం**

థాయ్‌లాండ్ ఓపెన్‌లో సెమీస్‌కు తెలంగాణ బాక్సర్లు నిఖత్, హుసాముద్దీన్ - స్పోర్ట్స్‌లో



**టైటాన్స్ హ్యాట్రిక్ ఓటమి**

ప్రొ కబడ్డీ లీగ్‌లో మూడో మ్యాచ్‌లోనూ ఓడిన తెలుగు టైటాన్స్ - స్పోర్ట్స్‌లో



## పాక్‌లో 40 వేల మంది ఉగ్రవాదులు

- పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ సంచలన ప్రకటన
- 15 ఏళ్లుగా పాక్ పాలకులు నిజాలు చెప్పలేదని వ్యాఖ్య
- యూఎస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పీస్ సదస్సులో వెల్లడి

- వివరాలు 5లో

## మతవిద్వేష దాడుల్ని ఆపండి

**మోదీకి 49 మంది ప్రముఖుల లేఖ**

- ముస్లిం, దళిత, మైనారిటీలపై దాడులను నిరోధించండి
- మూక హత్యలకు యావజ్జీవం విధించాలని డిమాండ్
- జైశ్రీరామ్ పదం యుద్ధ నినాదంగా మారిందని ఆవేదన
- నేరాలకు మతం రంగు పులమొద్దు: కేంద్ర మంత్రి నఖ్వీ

- వివరాలు 5లో












కాలం అదును తప్పింది. నేల పదును తప్పింది. వర్షం మొండికేయడంతో మొలకలు ఎండిపోయి చెలక చిన్నబోయింది. తడారిన పొలాలు ఎడారిలా మారాయి. వర్షాభావం కారణంగా సాగుబడి అటకెక్కింది. దీంతో రానున్న రోజుల్లో తిండి గింజకోసం తిప్పలు తప్పేట్లు లేవు. ఆహారధాన్యాలు మరీ ముఖ్యంగా వరి సాగు అత్యంత దారుణస్థితికి పడిపోయింది. ఖరీఫ్ పంటల సాగు నిరాశాజనకంగా మారింది. సీజన్ మొదలై 2 నెలలవుతున్నా.. వానదేవుడు కరుణించకపోవడంతో 33 జిల్లాలకుగాను 28 జిల్లాల్లో వర్షాభావం నెలకొంది. ఖమ్మం జిల్లాలోనైతే ఏకంగా కరువు ఛాయలు నెలకొన్నాయి.



# దుక్కుల్లేని పల్లెలు పట్నం దిక్కుకు

**ఊళ్లె బత్కలేక.. పట్నం వొచ్చిన..**

రెండెకరాల చెలక ఉంది. వానల్లేక, ఊళ్లో బత్కలేక వలస వచ్చిన. గచ్చిబౌలి అంజయ్య నగర్‌లో భార్యతో కలసి ఉంటున్న. చిన్న కొడుకు అనారోగ్యంతో ఇంట్లోనే ఉంటుండు. ఆపరేషన్ చేయించినం. మందులకు పైసలు పంపిస్తున్నం. డిగ్రీ చేసిన పెద్ద కొడుకు జొమాటోలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తుండు.

*– బి.శ్రీనివాస్. పాడిపల్లి, నారాయణపేట్*

**అడ్డా మీద గంటల తరబడి...**

నా కూతురు డిగ్రీ, కొడుకు పది చదువుతున్నరు. ఊర్లో కూలి పనుల్లేవ్. రెండ్నెల్ల క్రితం అంజయ్యనగర్‌కు వచ్చి భార్యతో కలసి కూలీకి వెళుతున్న. ఇద్దరికీ రోజూ కూలి దొరికితే వెయ్యి రూపాయలు వస్తయి. ఒక్కోరోజు ఒక్కరికే కూలి దొరుకుతుంది. పని కోసం అడ్డాపై నిలబడి గంటల తరబడి ఎదురుచూస్తున్నం.

*– ఉప్పరి నారాయణ. గోపన్‌పల్లి, దేవరకద్ర*

## లోటు వర్షపాతంతో కదలని నాగలి.. భారీగా తగ్గిన సాగు..

### ఖరీఫ్‌లో ఆహారధాన్యాల సాగు 44 శాతమే..

### రాష్ట్రంలో 448 మండలాల్లో వర్షాభావం

### 10 రోజుల్లో వర్షాలు పడకుంటే సాగైన పంటల్లో బతికేది 30 శాతమే



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా 37% లోటు వర్షాపాతం నమోదవడంతో ఈసారి ఖరీఫ్ గట్టెక్కుతుందా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే.. ఈసారి తిండి గింజలకూ కరువు తప్పదని రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్‌లో సాధారణ పంటల సాగు విస్తీర్ణం 1.08 కోట్ల ఎకరాలు కాగా, ఇప్పటివరకు కేవలం 68.62 లక్షల (63%) ఎకరాల్లోనే పంటలు సాగయ్యాయి. అందులో ఆహారధాన్యాల సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోయింది. ఖరీఫ్ ఆహారధాన్యాల సాధారణ సాగు విస్తీర్ణం 48.25 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు కేవలం 21.05 లక్షల ఎకరాల్లోనే సాగు కావడం ఆందోళన కలిగిస్తుంది. అంటే కావాల్సిన దానిలో 44 శాతానికే పరిమితమైంది. అందులో కీలకమైన వరి సాధారణ సాగు విస్తీర్ణం 24.11 లక్షల ఎకరాలు కాగా, కేవలం 5.32 లక్షల (22%) ఎకరాల్లోనే నాట్లు పడ్డాయి. ఇక మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 12.52 లక్షల ఎకరాలు కాగా, కేవలం 7.30 లక్షల (58%) ఎకరాల్లోనే సాగు చేస్తున్నారు. పప్పుధాన్యాల సాధారణ సాగు విస్తీర్ణం 10.37 లక్షల ఎకరాలు కాగా, కేవలం 7.56 లక్షల (73%) ఎకరాల్లోనే సాగయ్యాయి. వరి సహా ఇతరత్రా ఆహారధాన్యాలు పండకపోతే తినడానికీ కష్టమయ్యే పరిస్థితి ఏర్పడనుంది. సన్నచిన్నకారు రైతులైతే తీవ్ర ఇబ్బందుల్లో పడతారు. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఒక్క పత్తి సాగు మాత్రమే అత్యధికంగా సాగైంది. పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 43.12 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 39.69 లక్షల (92%) ఎకరాల్లో సాగైంది. అయితే అనేకచోట్ల వర్షాలు లేక భూమిలోనే పత్తి మాడిపోతోంది. కొన్ని మొలకలు వచ్చినా వర్షాలు లేక అవి ఎండిపోతున్నాయని రైతులు అంటున్నారు.

**16 జిల్లాల్లో సగటు కంటే తక్కువే**

రాష్ట్రంలో ఖరీఫ్ పంటల సాగు సగటు విస్తీర్ణం 63% కాగా, 16 జిల్లాల్లో అంతకంటే తక్కువగా సాగు కావడం గమనార్హం. రంగారెడ్డి, మేడ్చల్, నిజామాబాద్, మెదక్, సిద్దిపేట, వనపర్తి, గద్వాల, సూర్యాపేట, యాదాద్రి, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, ములుగు,

మిగతా 2వ పేజీలో ▶

## పల్లె రైతు.. పట్నం కూలీ

### వ్యవసాయ పనుల్లేక భారీగా వలస

### హైదరాబాద్‌లో ఏ పని దొరికినా రెడీ

### రాజధానిలో అడ్డాలన్నీ రైతు, కూలీలతో కిటకిట



సాక్షి, హైదరాబాద్: పల్లె దిగాలుగా పట్నం బాట పట్టింది. కూలి అడ్డాల్లో పనుల కోసం తండ్లాడుతోంది. రైతులు, వ్యవసాయ కూలీలు వలస వచ్చినా పట్నంలోనూ చేతినిండా పనుల్లేవు. ఖరీఫ్ సీజన్ మొదలై రెండు నెలలవుతున్నా ఇరవై మూడు జిల్లాల్లో వర్షాలజాడలేదు. తీవ్ర వర్షాభావంతో వ్యవసాయ పనులు ముందుకు సాగడంలేదు. దిక్కుతోచని స్థితిలో రైతులు, వ్యవసాయ కూలీలు హైదరాబాద్‌కు చేరుతున్నారు. ఫలితంగా నగరంలో ఏ కూలి అడ్డా చూసినా రైతులు, వ్యవసాయ కూలీలతో కిటకిటలాడుతోంది. వారంతా భవన నిర్మాణ కార్మికులు, సెక్యూరిటీ గార్డులు, హోటళ్లలో సర్వర్లుగా చేరిపోతున్నారు. వర్షాలు వచ్చి పొలం పనులు ముందుకు సాగే వరకు తమకు కష్టాలు తప్పవని, పిల్లల చదువులు, ఇతర ఖర్చుల కోసమైనా ఊరును వదిలిరాక తప్పలేదని కన్నీటిపర్యంతమవుతున్నారు. అయితే, తాజాగా వలస వచ్చిన రైతు కూలీల్లో అత్యధికులు భవన నిర్మాణ కార్మికులుగా, కాస్త రాయటం, చదవటం వచ్చిన వారు సెక్యూరిటీగార్డులుగా, స్టోర్ కీపర్లుగా పనులకు కుదిరిపోతున్నారు. మహబూబాబాద్ జిల్లా ఎర్రకుంట పరిధిలోని సురేష్‌నగర్ ఊరుకుఊరే నగరానికి వచ్చేసింది. ఈ ఊరిజనమంతా అశోక్‌నగర్‌లోని విక్టోరియా కేఫ్ అడ్డాపై కూలి పనుల కోసం

మిగతా 2వ పేజీలో ▶

## 'ఉగ్ర' బిల్లుకు లోక్‌సభ ఆమోదం

- వ్యక్తులను టెర్రరిస్టులుగా ప్రకటించే అధికారం ప్రభుత్వానికిస్తూ బిల్లులో ప్రతిపాదన
- ఉగ్రవాదాన్ని పెకలించేందుకు ఈ సవరణలు అవసరమే: చర్చలో అమిత్ షా
- ఓటింగ్‌కు ఒవైసీ పట్టుబట్టడంతో హైడ్రామా

- వివరాలు 5లో



## అసెంబ్లీ భవనాలు సరిపోవట్లేదా?

- సరిపోతే కొత్త భవన నిర్మాణం ఎందుకు?
- ఎర్రమంజిల్ భవనం కూల్చివేతకు అనుమతి ఉందా?
- నేటి విచారణలో వివరణ ఇవ్వండి
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుతం ఉన్న శాసనసభ భవనాలు సరిపోతున్నాయో లేదో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తెలంగాణ శాసనసభ్యుల సంఖ్య 119 మాత్రమే కాబట్టి (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 294 మంది ఉండేవారు) ఇప్పుడున్న భవనం ఎందుకు సరిపోవడం లేదో వివరించాలని సూచించింది. ఇప్పటి అసెంబ్లీ భవనం సరిపోతున్నప్పుడు కొత్త భవన నిర్మాణం అవసరం ఎందుకో కూడా తెలియజేయాలని పేర్కొంది. ఎర్రమంజిల్ భవనాన్ని కూల్చి రాష్ట్ర చట్టసభల భవన సముదాయాన్ని నిర్మించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై బుధవారం కూడా హైకోర్టులో వాదనలు కొనసాగాయి. కొత్తగా అసెంబ్లీ భవనాలు నిర్మించాలనే నిర్ణయానికి అనుగుణంగా

మిగతా 2వ పేజీలో ▶


## మిషన్ కాకతీయకు అంతర్జాతీయ గుర్తింపు

- ఇండోనేసియా సదస్సులో ప్రజెంటేషన్ కోసం రాష్ట్రానికి ఆహ్వానం
- నీటిపారుదలశాఖకు డబ్ల్యూఐఎఫ్3 సంస్థ లేఖ




సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో చెరువుల పునరుద్ధరణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న మిషన్ కాకతీయ పథకానికి అంతర్జాతీయ గుర్తింపు లభించింది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఇండోనేసియాలోని బాలిలో జరగనున్న అంతర్జాతీయ సదస్సులో ఈ పథకంపై ప్రజెంటేషన్ ఇచ్చేందుకు రావాల్సిందిగా థర్డ్ వరల్డ్ ఇరిగేషన్ ఫోరం (డబ్ల్యూఐఎఫ్3) ప్రతినిధి విజయ్. కె. లబ్సేత్వార్ నుంచి ఇరిగేషన్ శాఖకు లేఖ అందింది. ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజీ సంస్థ (ఐసీఐడీ) ఆధ్వర్యంలో ఈ సదస్సు జరగనుంది. మిషన్ కాకతీయపై సీఎం ఓఎస్డీ శ్రీధర్ దేశ్‌పాండే, చిన్న నీటివనరుల ఎస్‌ఈ కె.శ్యాంసుందర్‌లు రాసిన సాంకేతిక పత్రం ఈ సదస్సులో సమర్పించేందుకు ఆమోదం పొందింది. అలాగే ఆన్ ఆఫ్ పద్ధతి ద్వారా నాగార్జున సాగర్ ప్రాజెక్టు పరిధిలో నీటి నిర్వహణ అభివృద్ధి గురించి, ఎస్సారెస్పీలో నీటి సమర్థ వినియోగం గురించి రాసిన సాంకేతిక పత్రాలు కూడా సదస్సు ఆమోదం పొందాయి. ఈ మేరకు ఈ మూడు అంశాలపై ఇరిగేషన్ అధికారులు సదస్సుకు హాజరై ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఈ మూడు సాంకేతిక పత్రాలు రాసిన అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి, ఇరిగేషన్ ఈఎన్‌సీ మురళీధర్, అడ్మిన్ ఈఎన్‌సీ బి.నాగేందర్‌రావులు అభినందించారు.

## చెప్పేటోళ్లేరి..?



- వైద్య విద్యాసంవత్సరం ముంచుకొస్తున్నా భర్తీకాని అధ్యాపకుల పోస్టులు.. వచ్చేనెల నుంచి ఎంబీబీఎస్ క్లాసులు
- ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో దాదాపు 2 వేల పోస్టులు ఖాళీ
- నియామకాల బోర్డు జీవో వచ్చి 10 నెలలైనా అమలు శూన్యం
- నల్లగొండ, సూర్యాపేట కొత్త కాలేజీల్లో పరిస్థితి ఘోరం

- వివరాలు 14లో




# రైతన్నే కమిషన్ చైర్మన్

**సాక్షి, హైదరాబాద్:** చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, చేతివృత్తుల వారిని వడ్డీ వ్యాపారుల వేధింపుల నుంచి రక్షించేందుకు ఏర్పాటు చేయనున్న రుణ విమోచన కమిషన్ చైర్మన్‌గా రిటైర్డు హైకోర్టు జడ్జికి బదులు రైతు లేదా వ్యవసాయ రంగ నిపుణుడిని నియమించేందుకు వీలుగా రుణ విమోచన కమిషన్ చట్టానికి రాష్ట్ర ప్రభుత్వం సవరణ జరిపింది. ఈ మేరకు గెజిట్ ప్రచురణకు ఆదేశిస్తూ రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర శాసనసభ, గవర్నర్ ఆమోదం తర్వాత గెజిట్ ప్రకటన జారీ చేయడంతో ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వచ్చింది.

## వైద్య అధ్యాపకుల రిటైర్మెంట్ వయసు పెంపు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలు, దంత వైద్య కళాశాలల్లో పనిచేసే అధ్యాపకుల పదవీ విరమణ వయస్సును 58 నుంచి 65 ఏళ్లకు పెంచినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్ర శాసనసభ, గవర్నర్ ఆమోదించిన నేపథ్యంలో గెజిట్ ప్రకటన జారీకి ఆదేశిస్తూ రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

## గుర్తింపు లేని కాలేజీల్లో చేరొద్దు: పాపిరెడ్డి



**సాక్షి, హైదరాబాద్:** విద్యార్థులు యూనివర్శిటీ అనుబంధ గుర్తింపు లేని ఇంజనీరింగ్ కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటా కింద చేరవద్దని ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డి తెలిపారు. కాలేజీల్లో అడ్మిషన్ తీసుకునే ముందు ఆయా కళాశాలలకు 2019–20 విద్యా సంవత్సరానికి సంబంధించి వర్సిటీ అనుబంధ గుర్తింపు ఉందా లేదా అని పరిశీలించాలని బుధవారం ఓ ప్రకటనలో సూచించారు. అరోరా గ్రూపునకు సంబంధించి అరోరా ఇంజనీరింగ్ కాలేజ్, ఉప్పల్ (ఏటీఈఆర్), అరోరా ఇంజనీరింగ్ కాలేజ్, ఘట్‌కేసర్ (ఏఎస్‌టీఐ) కాలేజీలకు మాత్రమే 2019–20 సంవత్సరానికి వర్సిటీ అఫ్లియేషన్ ఇచ్చిందని పేర్కొన్నారు. గుర్తింపు లేని కాలేజీలో చేరితే అడ్మిషన్ ఆమోదం చేయబడదని సూచించారు.

## భాషా పండితుల పాదయాత్ర

**సాక్షి, హైదరాబాద్:** భాషా పండితుల పదోన్నతుల కోసం ఆగస్టు 12, 13 తేదీల్లో యాదాద్రి నుంచి హైదరాబాద్‌కు మహాపాదయాత్ర చేపడతామని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు (ఆర్‌యూపీపీ), రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ (ఎస్‌ఎల్‌టీఏ)లు వెల్లడించాయి. ఈ మేరకు ఆర్‌యూపీపీ, ఎస్‌ఎల్‌టీఏలు సంయుక్తంగా బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి జనార్దన్‌రెడ్డి, డీజీపీలకు వినతి పత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన బృందంలో ఆర్‌యూపీపీటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్, కార్యదర్శి నర్సింహులు, ఎస్‌ఎల్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు చక్రవర్తుల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## నేడు వీఆర్వోల భవిష్యత్ కార్యాచరణ

- 27 తర్వాత అనుసరించాల్సిన వ్యూహరచన ఖరారు చర్చ
- వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉపేంద్రరావు

**సాక్షి, హైదరాబాద్:** భవిష్యత్ కార్యాచరణను ఖరారు చేసేందుకు గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్వో) సంఘం గురువారం భేటీ కానుంది. ఈ మేరకు ఉదయం 11 గంటలకు తెలంగాణ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరగనుందని ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గరికె ఉపేంద్రరావు, సుధాకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని జిల్లాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు పాల్గొనే ఈ సమావేశంలో ఈనెల 27 తర్వాత అనుసరించాల్సిన పోరాట కార్యాచరణను ఖరారు చేయనున్నట్లు వెల్లడించారు. రెవెన్యూశాఖ మనుగడ కోసం సాగిస్తున్న పోరాటంలో తమతో కలిసివచ్చే సంఘాలతో ఐక్య ఉద్యమ వ్యూహరచన, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, ప్రజాసంఘాలు, మేధావుల మద్దతు కూడగట్టే అంశంపై చర్చించనున్నట్లు తెలిపారు. రెవెన్యూ వ్యవస్థను రద్దు చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది.

## యాదాద్రి నరసింహుడికి జీసీసీ తేనె

### గిరిజన సంక్షేమశాఖతో దేవాదాయశాఖ ఒప్పందం

**సాక్షి, హైదరాబాద్:** యాదగిరి లక్ష్మీనరసింహస్వామి నిత్య పూజా కార్యక్రమానికి గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ (జీసీసీ) తేనె సరఫరా చేయనుంది. పూజా కార్యక్రమాలతోపాటు స్వామి వారికి ఫలహారాలు, తేనెను కూడా ఇక నుంచి జీసీసీ సరఫరా చేస్తుంది. ఈ మేరకు దేవాదాయశాఖ గిరిజన సంక్షేమశాఖతో ఒప్పందం కుదుర్చుకుంది. నెలకు సగటున 50 కిలోల తేనె అవసరమని గిరిజనశాఖకు సూచించిన దేవాదాయ శాఖ, సరఫరాకు తగిన విధంగా చెల్లింపులు చేయనున్నట్లు తాజా ఉత్తర్వుల్లో పేర్కొంది. నిర్దేశిత కోటాను సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జీసీసీ ఎండీ వి.సర్వేశ్వర్‌రెడ్డి తెలిపారు.

## వ్యవసాయ వర్సిటీలో 30న కౌన్సెలింగ్

**హైదరాబాద్:** ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ యూనివర్సిటీలో బీటెక్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ కోర్సుల్లో ఫార్మర్స్ కోటా సీట్లకు ఈ నెల 30న రాజేంద్రనగర్‌లోని ఎగ్జామినేషన్ సెంటర్‌లో కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ సుధీర్‌కుమార్ తెలిపారు. ఎంపీసీ స్ట్రీమ్ కోర్సులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాజరుకావాలని కోరారు. అగ్రికల్చరల్ ఇంజనీరింగ్‌లో 18 సీట్లు, ఫుడ్ టెక్నాలజీలో 18 సీట్లను ఎంసెట్ ర్యాంకుల ఆధారంగా రిజర్వేషన్ నియమాలకు అనుగుణంగా భర్తీ చేస్తామన్నారు. మెరిట్ లిస్టు, ఫీజుల వివరాలను వర్సిటీ వెబ్‌సైట్ **www.pjtsau.edu.in** లో ఉంచామన్నారు. సీట్లు పొందిన వారు అదే రోజున ఫీజు చెల్లించాలని లేకుంటే సీటు రద్దవుతుందని పేర్కొన్నారు.

## 8 వర్సిటీలకు ఇన్‌చార్జి వీసీల నియామకం

### సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఉత్తర్వులు జారీ చేసిన సీఎంవో

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని ఎనిమిది విశ్వవిద్యాలయాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్లను నియమించింది. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ ఆదేశాల మేరకు సీఎంవో ఈ నియామకాలు చేపట్టినట్లు సీఎం ప్రత్యేక కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి బుధవారం పేర్కొన్నారు. కొత్త వీసీలను నియమించే వరకు వీరే ఇన్‌చార్జి వీసీలుగా కొనసాగుతారన్నారు. కాగా, ఎనిమిది వర్సిటీలకూ ఇన్‌చార్జి వీసీలుగా ఐఏఎస్ అధికారులనే నియమించారు. ఉస్మానియా, మహాత్మాగాంధీ యూనివర్సిటీలకు అరవింద్ కుమార్, తెలుగు, తెలంగాణ వర్సిటీలకు వి.అనిల్ కుమార్, అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీకి సి.పార్థసారథి, జేఎన్టీయూకు జయేశ్ రంజన్, కాకతీయ విశ్వవిద్యాలయానికి డాక్టర్ బి.జనార్దన్ రెడ్డి, పాలమూరు వర్సిటీకి రాహుల్ బొజ్జాను నియమించారు. ప్రస్తుతం రెగ్యులర్ వీసీల నియామకం కోసం ఈనెల 23 వరకు ఉన్నత విద్యాశాఖ దరఖాస్తుల్ని స్వీకరించింది. ఆ పదవుల కోసం దాదాపు 800 దరఖాస్తులు వచ్చాయి. సెర్చ్ కమిటీలు వాటిని పరిశీలించి, త్వరలో ముగ్గురి పేర్లను ప్రభుత్వానికి పంపించనుంది. ప్రభుత్వం వాటిని గవర్నర్ ఆమోదానికి పంపిస్తుంది.

## వాలంతరీలో సర్టిఫికెట్ కోర్సు

**సాక్షి, హైదరాబాద్:** గ్రామీణ యువతను వ్యవసాయ రంగం వైపు ఆకర్షించేందుకు నీరు, భూమి యాజమాన్య శిక్షణ, పరిశోధన సంస్థ (వాలంతరీ) ఆధ్వర్యంలో మూడు నెలల సర్టిఫికెట్ కోర్సు కోసం 18 నుంచి 30 ఏళ్ల వరకు గ్రామీణ యువతనుంచి దరఖాస్తుల్ని ఆహ్వానిస్తోంది. ఆగస్టు 28 నుంచి ప్రారంభించే ఈ కోర్సును పూర్తి చేసేందుకు ఇంటర్, ఐటీఐ లేదా డిప్లొమా చదివిన వారు అర్హులు. దరఖాస్తు వివరాల కోసం **www.tswalamtari.gov.in** లో పొందాలని వాలంతరీ డైరెక్టర్ జనర్ కృష్ణారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు ఫీజు రూ.5వేలని, శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తామని తెలిపారు.

## నేడు, రేపు ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో గురు, శుక్రవారాల్లో ఒకటి, రెండు చోట్ల భారీ వర్షాలు, చాలా చోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. తెలంగాణ దానిని ఆనుకుని ఉన్న రాయలసీమ, ఇంటీరియర్ కర్ణాటక ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని పేర్కొంది. ఉత్తర ఆంధ్ర, దక్షిణ ఒడిశా తీరాలకు దగ్గరలో వాయవ్య బంగాళాఖాతం, పశ్చిమ మధ్య బంగాళాఖాతం ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడటంతో పశ్చిమ బెంగాల్ కోస్తా తీర ప్రాంతాల్లో ఈ నెల 26న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. కాగా, బుధవారం హసన్‌పర్తి (వరంగల్ అర్బన్) 2 సెం.మీ., పినపాక (భద్రాద్రి కొత్తగూడెం) 2 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది.

## పేపర్ చాయ్ తాగాలా? చలో ఆదిలాబాద్





మనం ఇంత వరకు ఇరానీ చాయ్, లెమన్ చాయ్ గురించి విన్నాం.. కానీ ఆదిలాబాద్ జిల్లాలో పేపర్ చాయ్ తయారు చేసి రుచి చూపిస్తున్నాడో హోటల్ యజమాని. ఆదిలాబాద్ రూరల్ మండలం చాందా(టి) గ్రామంలో అన్నుభాయ్ ముప్పై ఏళ్లుగా పేపర్ చాయ్ తయారు చేసి విక్రయిస్తున్నాడు. పేపర్ చాయ్ మస్తుగా ఉంటుందని గ్రామస్తులు చెబుతున్నారు. అయితే.. పేపర్, ఆకు, ఇతర వస్తువుకు ఒక జ్వలన ఉష్ణోగ్రత అనేది ఉంటుందని సిరికొండ మండల సైన్స్ టీచర్ నోముల నవనీత్‌రెడ్డి వివరించారు. ఉదాహరణకు పేపర్‌ను ఓ డొప్పలాగా తయారు చేసి అందులో పాలు, నీరు ఇతరవి (లిక్విడ్) వేసి మంటపై ఉంచితే ఆ లిక్విడ్ అనేది పేపర్‌ను కాలిపోకుండా చల్లార్చుతుంది. పేపర్ డొప్పలో చాయ్ చేయడం కూడా ఇదే కోవలోకి వస్తోందని వివరించారు. పేపర్‌లోని లిక్విడ్ పూర్తిగా ఆవిరైన తర్వాత ఆ పేపర్ సైతం కాలిపోతుందన్నారు.

*– చింతల అరుణ్‌రెడ్డి, సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్*

# దుక్కుల్లేని పల్లెలు



▶ మొదటి పేజీ తరువాయి

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో రాష్ట్ర సగటు కంటే తక్కువ విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి. ములుగు జిల్లాలోనైతే కేవలం 21% మాత్రమే పంటలు సాగయ్యాయి. వనపర్తి జిల్లా 22 శాతానికే పరిమితమైంది. ఒక్క ఆదిలాబాద్ జిల్లాలో మాత్రమే నూటికి 100% పంటలు సాగు కావడం విశేషం.

### 448 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు

రాష్ట్రంలో 589 మండలాలు ఉంటే అందులో 448 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఇందులో 83 మండలాల్లో కరువు ఛాయలు నెలకొన్నాయని సర్కారు నివేదికే చెబుతోంది. అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 31 మండలాలుంటే, అత్యధికంగా 27 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొనడం దారుణం. సూర్యాపేట జిల్లాలో 23 మండలాలుంటే, అన్నీ వర్షాభావంతో కొట్టుమిట్టాడుతున్నాయి. ఖమ్మం జిల్లాలో 21 మండలాలుంటే, ఏకంగా 20 జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. మంచిర్యాల జిల్లాలో 18 మండలాలుంటే, అన్నింటిలోనూ వర్షాభావమే నెలకొంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోనూ 11 మండలాలుంటే, అన్నింటిలోనూ వర్షాభావమే నెలకొంది. మహబూబాబాద్, వరంగల్ రూరల్, ములుగు జిల్లాల్లోని అన్ని మండలాల్లోనూ వర్షాభావమే నెలకొంది. జూన్, జూలై నెలల్లో రాష్ట్రంలో ఇప్పటివరకు సాధారణ వర్షపాతం 317.2 మిల్లీమీటర్లు నమోదు కావాల్సి ఉండగా, ఇప్పటివరకు 200.2 మి.మీ. మాత్రమే నమోదైంది. అంటే 37% లోటు నమోదైంది. దీంతో పంటలు సాగు చేసిన చోటే ఎండిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. మరో వారం పది రోజుల్లో వర్షాలు కురవకపోతే 30 శాతానికి మించి పంటలు చేతికి వచ్చే పరిస్థితి ఉండదని వ్యవసాయ శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు గద్వాల, సిరిసిల్ల జిల్లాల్లో పత్తిపై గులాబీ పురుగు దాడి చేస్తుంది. అలాగే నిజామాబాద్, కామారెడ్డి, సిద్దిపేట, నాగర్‌కర్నూలు, ఖమ్మం, కరీంనగర్, నిర్మల్ జిల్లాల్లో మొక్కజొన్న పంటపై కత్తెర పురుగు దాడి చేస్తుంది. ఒకవైపు వర్షాభావం నెలకొంటే, మరోవైపు ఇలాంటి పురుగుతో పంటలకు పెను నష్టం సంభవిస్తోంది. దీంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. అయితే ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో సాధారణం కంటే అధిక వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం భరోసా ఇస్తుండటంతో ఆశలు చిగురిస్తున్నా, అదును దాటాక వర్షాలు కురిస్తే ప్రయోజనమేంటన్న భావన రైతుల్లో వ్యక్తమవుతోంది.

**రాష్ట్రంలో జూన్ 1 నుంచి - జూలై 24 మధ్య కురవాల్సిన, కురిసిన వర్షం (మిల్లీమీటర్లలో)**

| జిల్లా | కురవాల్సింది | కురిసింది | లోటు (శాతం) |
|---|---|---|---|
| ఆదిలాబాద్ | 463.2 | 290.1 | -37 |
| కొమురంభీం | 445.7 | 349.1 | -22 |
| మంచిర్యాల | 454.5 | 191 | -58 |
| నిర్మల్ | 442.4 | 227.9 | -48 |
| నిజామాబాద్ | 393.6 | 295.7 | -25 |
| జగిత్యాల | 406.2 | 280.0 | -31 |
| పెద్దపల్లి | 425 | 237.4 | -44 |
| జయశంకర్ భూపాలపల్లి | 416.7 | 234.8 | -44 |
| భద్రాద్రి కొత్తగూడెం | 374.8 | 177.6 | -53 |
| మహబూబాబాద్ | 329 | 152.8 | -54 |
| వరంగల్ (రూరల్) | 375 | 196 | -48 |
| వరంగల్ (అర్బన్) | 335.5 | 220.2 | -34 |
| కరీంనగర్ | 335.5 | 229.4 | -32 |
| రాజన్న సిరిసిల్ల | 343.8 | 262.9 | -24 |
| కామారెడ్డి | 360.6 | 300.3 | -17 |
| సంగారెడ్డి | 297.8 | 187.1 | -37 |
| మెదక్ | 335.8 | 241.9 | -28 |
| సిద్దిపేట | 274.8 | 203.3 | -26 |
| జనగామ | 305.9 | 179.9 | -41 |
| యాదాద్రి | 236.7 | 128.1 | -46 |
| మేడ్చల్ | 254.2 | 164.2 | -35 |
| హైదరాబాద్ | 240.3 | 153.1 | -36 |
| రంగారెడ్డి | 213.9 | 163.8 | -23 |
| వికారాబాద్ | 267.4 | 165.2 | -38 |
| మహబూబ్‌నగర్ | 200.9 | 169.6 | -16 |
| జోగులాంబ గద్వాల | 149.4 | 115.6 | -23 |
| వనపర్తి | 182 | 150.4 | -17 |
| నాగర్‌కర్నూలు | 191 | 167.7 | -12 |
| నల్గొండ | 200.3 | 108.4 | -46 |
| సూర్యాపేట | 254.2 | 113.4 | -55 |
| ఖమ్మం | 312 | 123.9 | -60 |
| ములుగు | 470.1 | 244 | -48 |
| నారాయణపేట | 180.7 | 182.4 | +1 |
| సగటు | 317.2 | 200.2 | -37 |

## ఎక్స్‌ప్రెస్ రైళ్లకు భువనగిరిలో హాల్టింగ్ ఇవ్వండి

### కేంద్ర మంత్రిని కోరిన ఎంపీ కోమటిరెడ్డి



**సాక్షి, న్యూఢిల్లీ:** హైదరాబాద్‌లో పనిచేసే ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో నివాసముంటున్న భువనగిరిలో శాతవాహన, పద్మావతి, గోదావరి, మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని కేంద్ర రైల్వే మంత్రి పీయూష్ గోయల్‌ను ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రిని బుధవారం ఢిల్లీలో కలసి వినతి పత్రాన్ని ఇచ్చారు. అలాగే జనగాం, ఆలేరు స్టేషన్లలో కూడా పలు రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాల్సిందిగా కేంద్ర మంత్రిని ఆయన కోరారు. తన విజ్ఞప్తులపై గోయల్ సానుకూలంగా స్పందించారని కోమటిరెడ్డి మీడియాకు తెలిపారు.

## లైంగిక దాడులకు పాల్పడే వారిని ఉరితీయాలి

### కేంద్రాన్ని కోరిన ఎంపీ లింగయ్య యాదవ్



**సాక్షి, న్యూఢిల్లీ:** మహిళలు, బాలికలపై లైంగిక దాడులకు పాల్పడే వారిని బహిరంగంగా ఉరితీయాలని కేంద్ర ప్రభుత్వాన్ని టీఆర్‌ఎస్ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ కోరారు. బుధవారం రాజ్యసభలో పోక్సో చట్టం (సవరణ)–2019 బిల్లుపై జరిగిన చర్చలో ఆయన ప్రసంగిస్తూ.. లైంగిక దాడులకు పాల్పడే వారిని బహిరంగంగా ఉరితీసి అలాంటి చర్యలకు పాల్పడే వారిలో భయం పుట్టించాలని కోరారు. గత ఆరు నెలల్లో దేశంలో 24 వేల లైంగిక దాడులు, అత్యాచార ఘటనలు చోటుచేసుకుంటే అందులో 911 కేసులు మాత్రమే నమోదు చేయడం సిగ్గుచేటన్నారు.

## నకిలీ చిట్‌ఫండ్స్‌పై కఠిన చర్యలు

### కేంద్రాన్ని కోరిన నామా



**సాక్షి, న్యూఢిల్లీ:** నకిలీ చిట్‌ఫండ్స్ సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని, అగ్రిగోల్డ్, సహారా, శారద లాంటి చిట్‌ఫండ్స్ సంస్థల బాధితులను రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో కేంద్రం ఆదుకోవాలని టీఆర్‌ఎస్ లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వరరావు కోరారు. బుధవారం లోక్‌సభలో బ్యానింగ్ ఆఫ్ అన్‌రెగ్యులేటెడ్ డిపాజిట్ స్కీమ్స్–2019 బిల్లుపై జరిగిన చర్చలో నామా ప్రసంగించారు. ఒక్కో రాష్ట్రంలో ఒక్కోరకంగా కొన్ని నకిలీ చిట్‌ఫండ్ సంస్థలు సామాన్య ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించి మోసం చేసి దోచుకుంటున్నాయని అన్నారు. అగ్రిగోల్డ్ చిట్‌ఫండ్స్ వల్ల మోసపోయిన వారిలో తెలుగు రాష్ట్రాల ప్రజలతోపాటు ఆరు రాష్ట్రాల ప్రజలు ఉన్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు.

## రాష్ట్రాల హక్కులను హరించొద్దు

### లోక్‌సభలో ఎంపీ వెంకటేష్ నేత

**సాక్షి, న్యూఢిల్లీ:** చట్టవ్యతిరేక కార్యకలాపాల నియంత్రణ చట్టంలోని సెక్షన్ 25లో తెచ్చిన సవరణ ద్వారా రాష్ట్రాల హక్కులను కేంద్రం హరించరాదని టీఆర్‌ఎస్ ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత పేర్కొన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణ బిల్లుపై బుధవారం లోక్‌సభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. తీవ్రవాదిగా అనుమానితుడైన వ్యక్తిపై దర్యాప్తు జరిపేందుకు, ఆస్తులు జప్తు చేసేందుకు ఇప్పటి వరకు ముందుగా రాష్ట్ర డీజీపీ అనుమతి తీసుకోవాల్సి వచ్చేదని, కానీ ప్రస్తుత బిల్లులో విచారణాధికారి రాష్ట్ర డీజీపీతో సంబంధం లేకుండా కేవలం ఎన్‌ఐఏ డీజీ అనుమతి తీసుకొని దర్యాప్తు ప్రారంభించవచ్చని ప్రతిపాదించారని పేర్కొన్నారు. అయితే రాష్ట్ర డీజీపీ అనుమతి లేకుండా చేయడం అంటే రాష్ట్రాల హక్కులను హరించడమే అవుతుందని, ఇది సమాఖ్య వ్యవస్థ స్ఫూర్తికి వ్యతిరేకమన్నారు. తీవ్రవాద కేసుల్లో దర్యాప్తు అధికారిగా ఇప్పటివరకు డీఎస్పీ ర్యాంకు అధికారి ఉంటే ఇప్పుడు ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారికి బాధ్యతలు అప్పగించడం సబబుగా లేదని ఆయన పేర్కొన్నారు.



## ఏపీ గవర్నర్‌గా విశ్వభూషణ్ ప్రమాణ స్వీకారం

**సాక్షి, అమరావతి:**

ఆంధ్రప్రదేశ్ కొత్త గవర్నర్‌గా విశ్వభూషణ్ హరిచందన్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలోని రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయనతో రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. బుధవారం ఉదయం 11.29 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో కలసి విశ్వభూషణ్ కార్యక్రమ వేదికపైకి వచ్చారు. ఆ వెంటనే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రమణ్యం.. రాష్ట్ర గవర్నర్‌గా విశ్వభూషణ్ హరిచందన్‌ను నియమిస్తూ రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ ఈ నెల 16న జారీ చేసిన ఉత్తర్వును చదివి వినిపించి, ప్రమాణస్వీకారం చేయాల్సిందిగా ఆయన్ను ఆహ్వానించారు. సరిగ్గా 11.30 గంటలకు జస్టిస్ ప్రవీణ్‌కుమార్.. హరిచందన్‌తో పదవీ ప్రమాణం చేయించారు. గవర్నర్ దేవుని సాక్షిగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ సతీమణి సుప్రభ హరిచందన్ కూడా పాల్గొన్నారు.

# పట్నం దిక్కుకు


▶ మొదటి పేజీ తరువాయి

వచ్చి పోయేవారి చుట్టూ చేరి ప్రాధేయపడుతున్న తీరు విస్మయానికి గురిచేస్తోంది. అయితే, తమకు కాలం గడిచేందుకు ఏ పనిచెప్పినా చేస్తామని, అవసరమైతే ఎక్కువ సమయమైనా పనిచేస్తామని రైతులు, కూలీలు నగరవాసులకు ఆఫర్ ఇస్తుండటం విశేషం.

**23 జిల్లాల్లో వానల్లేవు...**

తెలంగాణ జిల్లాల్లో కేవలం ఒక్క నారాయణపేట జిల్లాలోనే సాధారణ సగటుకు మించి వర్షపాతం నమోదైంది. ఏకంగా 23 జిల్లాల్లో దారుణ పరిస్థితులుండగా అందులో ఖమ్మం, మంచిర్యాల, సూర్యాపేట, భద్రాద్రి–కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు, నిర్మల్, వరంగల్, నల్లగొండ, పెద్దపల్లి, భూపాలపల్లి, యాదాద్రి–భువనగిరి జిల్లాల్లో అత్యల్ప వర్షం కురిసింది. రైతులు, కూలీల దైన్యం వారి మాటల్లో...

### వానలు లేక.. పనుల కోసం



మాది బాన్సువాడ, నాకు రెండెకరాల పొలం ఉంది. వర్షాలు పడతాయని ఎంతో ఆశతో వరిపంటకు ఏర్పాట్లు చేసుకున్నాను. వానలు కురుస్తాయని ఎదురు చూశాను. కానీ, వర్షంపడే సూచనలు కనపడలేదు. దీంతో పంటకు చేసుకున్న ఏర్పాట్లు వృథా అయ్యాయి. చేసేది లేక పట్నం వచ్చి కూలీ పనులు చేసుకుంటున్నాను.

*– సంజీవ్, బాన్సువాడ*

### కౌలు రైతుకు కష్టాలే...

పోయినేడాది కౌలు చేస్తే వర్షాల్లేక పంటలు పండలేదు. 10 రోజుల కింద హైదరాబాద్‌కు వచ్చాం. నా భార్య, నేను కూలీ పనులు చేస్తేనే ఇల్లు గడుస్తది. నా కొడుకు పాండు రంగ బీటెక్ చేసినా మూడేళ్లుగా ఉద్యోగం లేక ఖాళీగా ఉన్నడు. కూలీ పనుల కోసం ఇక్కడికొస్తే వారంలో 3 రోజులు ఖాళీగా ఉంటున్నం.

*– సల్లూరి అబ్బాయి, వీరాపురం, భూపాలపల్లి*

### 10 రోజులకు 3 రోజులే పని

మాది మహబూబాబాద్ జిల్లా. నాకు మూడెకరాల పొలం ఉంది. పత్తి, మిర్చి, మొక్కజొన్న, కంది పండించేవాడిని. వర్షాలు కురవకపోవడంతో వలస వచ్చిన. బండమైసమ్మనగర్‌లో భార్యతో ఉంటున్న. ఇంటి కిరాయి రూ.3 వేలు. ఇద్దరు పిల్లలను మా అమ్మ దగ్గర పెట్టి వచ్చినం. అడ్డా మీద 10 రోజులు నిలబడితే మూడ్రోజులే పని దొరికింది. ఇక్కడ కూడా పరిస్థితి చాలా దారుణంగా ఉంది.

*– గుగులోతు రమేశ్, బండ మైసమ్మ నగర్*

# అసెంబ్లీ భవనాలు సరిపోవట్లేదా?

▶ మొదటి పేజీ తరువాయి

ప్లాన్ రూపకల్పన చేశారో లేదో, డిజైన్ రూపొందించిందీ లేనిదీ కూడా గురువారం జరిగే విచారణ సమయంలో తెలియజేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్‌లతో కూడిన ధర్మాసనం ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే, హుడా చట్టం ప్రకారం ఎర్రమంజిల్ భవనాన్ని వారసత్వ భవనాల జాబితా నుంచి తొలగించినా హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్‌లో ఆ నిబంధన కొనసాగుతున్నందున కూల్చివేత విషయమై అనుమతి పొందిందీ లేనిదీ వివరించాలని ఆదేశించింది.

**అమల్లో ఉండేది కొత్త చట్టమే: ఏఏజీ**

పాత చట్టం ప్రకారం ఎర్రమంజిల్ భవనాన్ని వారసత్వ భవనాల జాబితా నుంచి తొలగించినందున ఇప్పుడు కొత్త చట్టమే అమల్లో ఉంటుందని ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్(ఏఏజీ) జె.రామచంద్రరావు వివరించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు వస్తుందనేది ఆశాజనక విషయమని, ఆ ఆలయం జాబితాలో చేరిన తర్వాతే రక్షణ లభిస్తుందని పేర్కొంది. ఇక్కడ కూడా హుడా చట్టం కింద వారసత్వ భవనం కాదని చెబుతున్న ప్రభుత్వం.. హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్ ప్రకారం దాని రక్షణ బాధ్యత ప్రభుత్వానిదే అవుతుందని వ్యాఖ్యానించింది. అయితే, ఒక చట్టాన్ని రద్దు చేసి దాని స్థానంలో మరో చట్టాన్ని రూపొందించినప్పుడు కొత్త చట్టమే అమల్లో ఉంటుందని, ఈ మేరకు సుప్రీంకోర్టు తీర్పులు కూడా ఉన్నాయని అదనపు ఏజీ రామచంద్రరావు బదులిచ్చారు. 1960, 2017 చట్టాలు, 13వ నిబంధనలోని విషయాలన్నీ ఒకే అంశానికి చెందినవని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రస్తుత అసెంబ్లీ భవనం సరిపోతోందో లేదో, హెచ్‌ఎండీఏ చట్టం ప్రకారం కొత్త అసెంబ్లీ భవన నిర్మాణానికి అనుమతి తీసుకున్నారో లేదో గురువారం చెప్పాలని ఆదేశించింది.

## కోర్టుకు మధుసూదనాచారి, వినయ్‌భాస్కర్

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ ఉద్యమ సమయంలో వరంగల్‌లో రైల్ రోకో నిర్వహించి రైళ్ల రాకపోకలకు అంతరాయం కల్గించారనే ఆరోపణల కేసుల్లో అసెంబ్లీ మాజీ స్పీకర్ ఎస్. మధుసూదనాచారి, టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌లు నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. గతంలో ఈ కేసుల్ని కాజీపేట కోర్టులో విచారణ జరిగేవి. వాటిని నాంపల్లి మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టుకు బదిలీ చేయడంతో బుధవారం ఇద్దరు నేతలతోపాటు ఇతరులు కూడా ఆయా కేసుల తరఫున హాజరయ్యారు.

## ఇదం జగత్





కాపలాగా మరో కుక్కను పెట్టుకోవాల్సింది!

# సమ్మెకు సైతం వెనుకాడబోం

## ఆర్టీసీ విలీనంపై ప్రభుత్వానికి టీఎంయూ నేతల హెచ్చరిక

**హైదరాబాద్:** ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతోపాటు కార్మికుల ఇతర డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే ఆర్ఎం ఆఫీసు, బస్‌భవన్‌ల ముట్టడి చేపడతామని ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్(టీఎంయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వత్థామరెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు థామస్‌రెడ్డి అన్నారు. చివరి అస్త్రంగా సమ్మెకు సైతం వెనుకాడబోమని వారు హెచ్చరించారు. విలీనం, ఇతర డిమాండ్ల సాధనకు సంబంధించి టీఎంయూ గ్రేటర్ హైదరాబాద్ జోన్, రంగారెడ్డి రీజియన్‌ల ఆధ్వర్యంలో బుధవారం ఇందిరాపార్కు వద్ద కార్మికులు సామూహిక నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్టీసీని రక్షించాలంటే ప్రభుత్వంలో విలీనం చేయక తప్పదని అన్నారు. ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్టీసీ విలీనంపై నిర్ణయం తీసుకున్నారని గుర్తు చేశారు. దాదాపు 2 వేలకుపైగా డ్రైవర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేయకపోవడంతో పని ఒత్తిడి పెరుగుతుందన్నారు. ఆర్టీసీలోని వివిధ కేటగిరీల్లో ఖాళీగా ఉన్న వేల పోస్టులను భర్తీ చేయాలని పేర్కొన్నారు. డ్రైవర్లు, కండక్టర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. సంస్థకు దాదాపు 13 నెలలుగా ఎండీ లేకపోవడం శోచనీయమన్నారు. కార్మికుల సమస్యలపై మంత్రివర్గ ఉపసంఘం ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం అన్యాయమని వాపోయారు. 2017 ఏప్రిల్ 1 నుంచి రావాల్సిన వేతన సవరణ వెంటనే చేపట్టాలని, గ్యారేజీ కార్మికులపై పెంచిన పనిభారాన్ని తగ్గించాలని, తార్నాక ఆస్పత్రిలో మెరుగైన వైద్య సదుపాయాలను కల్పించాలని కోరారు. సీసీఎస్, పీఎఫ్ ఎస్ఆర్‌బీఎస్ బకాయిలను వెంటనే చెల్లించాలని అన్నారు. అద్దె బస్సులను రద్దు చేసి కొత్త బస్సులు కొనుగోలు చేయాలని తెలిపారు. కారుణ్య నియామకాలు చేపట్టాలని, రిటైర్డ్ కార్మికుల సెటిల్‌మెంట్, సకలజనుల సమ్మె వేతనాలు చెల్లించాలని, మహిళా కండక్టర్లకు మెరుగైన వసతులు కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో టీఎంయూ రాష్ట్ర నేతలు జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు, రీజినల్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
**డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యాలయం : TS, హైదరాబాద్**
RC.No. 30082/N1/2019 | ప్రకటన | తేది: 22.07.2019
2019-2020 బ్యాచ్ విద్యా సంవత్సరానికి జనరల్ నర్సింగ్ మరియు మిడ్‌వైఫరీ కోర్స్ (3 సంవత్సరాలు) లో ప్రవేశం కోసం అర్హత గల అభ్యర్థుల (పురుషులు & మహిళలు) నుండి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరబడుచున్నవి. రాష్ట్రంలోని ప్రభుత్వ మరియు ప్రైవేట్ నర్సింగ్ స్కూళ్ళలో బోధించబడును. ప్రతి విద్యార్థి రూ.200/- రిజిస్ట్రేషన్ రుసుము చెల్లించుటకు ప్రారంభ తేది: 24-07-2019 మరియు ప్రతి విద్యార్థి రూ. 200/- రిజిస్ట్రేషన్ రుసుము చెల్లించుటకు ఆఖరు తేది: 03-08-2019. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల దాఖలు: 24-07-2019 నుండి 31-08-2019 వరకు. ప్రభుత్వనర్సింగ్ స్కూళ్ళ కోసం డౌన్‌లోడ్ చేసుకోబడిన దరఖాస్తుల దాఖలుకు ఆఖరు తేది: 13-08-2019 సా. 5.గం. వరకు. ప్రభుత్వ నర్సింగ్ సంస్థలలో ఎంపిక ప్రక్రియ 26-08-2019 లోగా పూర్తి చేయబడాలి. ప్రైవేట్ నర్సింగ్ సంస్థలలో ఎంపిక ప్రక్రియ 13-09-2019 లోగా పూర్తి చేయబడాలి. 2019-20 విద్యా సంవత్సరానికి తరగతులు 25-09-2019 నుండి ప్రారంభమగును. అన్ని తదుపరి వివరాలు మరియు ఆన్‌లైన్ దరఖాస్తు వెబ్‌సైట్ http://dme.telangana.gov.in లో లభించును.
సం/- డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్
DIPR RO. No. 717-DP/CL/Advt/1/2019-20, Dt: 25.7.2019

**నీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ, తెలంగాణ ప్రభుత్వం**
**నీరు మరియు భూమి యాజమాన్య శిక్షణ మరియు పరిశోధన సంస్థ (వాలంతరి)**
**రాజేంద్రనగర్, హిమాయత్‌నగర్, హైదరాబాద్**
**భూమి మరియు నీటి యాజమాన్యంతో సుస్థిరమైన లాభసాటి వ్యవసాయం**
**(మూడు నెలలు - సర్టిఫికెట్ కోర్సు)**
వాలంతరిలో ఆగస్టు, 2019లో ప్రారంభించనున్న మూడు నెలల సర్టిఫికెట్ కోర్సుకై ఇంటర్/ ఐ.టి.ఐ/ డిప్లొమా చదివిన, 18-30 సం॥లు వయస్సు గల గ్రామీణ యువత నుంచి దరఖాస్తులు కోరబడుచున్నవి. ఈ కోర్సు రుసుము రూ॥5,000/- (తిరిగి ఇవ్వబడదు) ఉచిత భోజనం మరియు వసతి సదుపాయము కలదు. మౌఖికపరీక్ష ద్వారా అభ్యర్థుల ఎంపిక చేయబడును. దరఖాస్తు రుసుము రూ॥500/- Director General, WALAMTARI, Hyderabad పేరు పై డి.డి తీసి దరఖాస్తుతో జత చేసి పంపవలెను. కోర్సు కాలవ్యవధి:- 28 ఆగస్టు, 2019 నుండి 27 నవంబర్, 2019 వరకు, దరఖాస్తు చేసుకోవలసిన ఆఖరు తేది: 16.08.2019. దరఖాస్తు మరియు వివరాలకై www.tswalamtari.cgg.gov.in ను దర్శించగలరు. కోర్సు పూర్తి చేసిన వారు ఆదర్శ రైతుగా లేదా/వ్యవసాయరంగంలో కన్సల్టెంట్స్‌గా స్వయం ఉపాధి పొందవచ్చు. ఈ కోర్సు ఏ కారణం చేత ప్రారంభించుట గాని, నిలిపి వేయుట గాని పూర్తి అధికారములు మహా సంచాలకులు, వాలంతరి గారికి కలిగి వుండును.
సం/- మహా సంచాలకులు, వాలంతరి
DIPR RO. No.720-DP/CL/Advt/1/2019-20, Dt: 24.7.2019

తెలంగాణ ప్రభుత్వం
**తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ**
NIT No.E/9352/TMREIS/2019 | **ఇ-టెండరు నోటీస్** | తేది: 23.07.2019
తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాలలో గల 204 TMR స్కూల్స్ మరియు 12 TMR జూనియర్ కాలేజీలను నిర్వహిస్తున్న TMREI సొసైటీ అన్ని TMR స్కూల్స్/ జూనియర్ కాలేజీలలోని R.O. ప్లాంట్స్‌కు వార్షిక నిర్వహణ కాంట్రాక్ట్ ఏర్పాటు చేయుటకు, కాంపిటెంట్ గవర్నమెంట్ అథారిటీస్/ డిపార్ట్‌మెంట్స్‌చే జారీ చేయబడిన అవసరమైన చెల్లుబాటగు రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్స్/ లైసెన్సెస్ గల ప్రభుత్వ శాఖలకు ఇలాంటి సర్వీసులు అందించడంలో గత మూడు (03) సంవత్సరాల అనుభవం గల, ప్రభుత్వ/ ప్రభుత్వరంగ ఏజెన్సీల నుండి రెండు భాగాల (టెక్నికల్ బిడ్ మరియు ఫైనాన్షియల్ బిడ్)లో ఇ-టెండర్లు కోరుతోంది. దీనికి సంబంధించిన ఇ-టెండరు 25-07-2019 నుండి 21-08-2019 వరకు వెబ్‌సైట్ **https://tender.telangana.gov.in** లో లభించును. ఇ-టెండరు ప్రచురణ: 25-07-2019, ప్రీ-బిడ్ సమావేశం మరియు టెండరు దారులచే శాంపిళ్ళ దాఖలు: 30-07-2019 మ.3.00 గం., టెండర్ల దాఖలుకు చివరి తేది: 16-08-2019 సా.5.00 గం., టెక్నికల్ బిడ్లు తెరచుట : 19-08-2019 మ.3.00 గం., ఫైనాన్షియల్ బిడ్లు తెరచుట : 21-08-2019, మ.3.00 గం.
సం/- సెక్రటరీ, TMREIS
DIPR Ro. No.268-PP/CL/Advt/1/2019-20, Dt: 24.07.2019

# ప్రింటింగ్, స్టేషనరీ విభాగం మూసేయాలి

- ప్రభుత్వానికి లేఖ రాస్తా : కమిషనర్ వీకే సింగ్
- ప్రభుత్వం ఏటా రూ.50 కోట్లు ఖర్చు చేస్తుంటే.. రూ.2 కోట్లే ఆదాయం వస్తోంది
- జైళ్ల శాఖలో పని చేయడం సంతోషాన్నిచ్చింది

హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రింటింగ్, స్టేషనరీ విభాగంలో పెద్దగా పనిలేదని దీనికోసం ప్రభుత్వం ఏటా రూ.50 కోట్లు ఖర్చు చేస్తుంటే దాని వల్ల రూ.2 కోట్ల ఆదాయం సమకూరుతోందని అందుకే దాన్ని మూసివేయాలని ప్రభుత్వానికి లేఖ రాస్తానని ఆ విభాగం కొత్త కమిషనర్ వీకే సింగ్ అన్నారు. తాను జైళ్ల శాఖలో అయిదేళ్లు పని చేశానని, మంచి ఫలితాలు వచ్చాయని



విలేకరులతో మాట్లాడుతున్న వీకే సింగ్

అక్కడ ఉన్న ఉద్యోగుల్లో ఆత్మగౌరవం, ఆత్మ విశ్వాసం కల్పించడం సంతోషంగా ఉందని సింగ్ అన్నారు. బుధవారం మలక్‌పేట అక్బర్ బాగ్‌లోని కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జైళ్ల శాఖలో అనేక మార్పులు తీసుకువచ్చామన్నారు. ముఖ్యంగా ఆనంద ఆశ్రమం ఏర్పాటుతో పాటు, అక్కడ ఉన్న వారికి గౌరవ ప్రదమైన జీవితం ఇవ్వగలిగామన్నారు. జైళ్ల శాఖ నుంచి ప్రింటింగ్ అండ్ స్టేషనరీ శాఖకు అకస్మాతుగా తన బదిలీ జరిగిందన్నారు. ఇది భగవంతుడు ఇచ్చిన ఆశీర్వాదంగా భావిస్తాననీ, ప్రజల కోసం పని చేయడానికి ఇకపై తనకు వ్యక్తిగత సమయం దొరుకుతుందన్నారు. ఏనాడూ తాను పదవుల కోసం పని చేయలేదని, తాను అనుకున్న పోస్ట్ రాలేదని రాజీనామా చేస్తున్నాననే వార్తలు వచ్చాయని, తాను రాజీనామా చేయనని స్పష్టం చేశారు. ప్రింటింగ్ స్టేషనరీ విభాగంలో పనేమీ లేదని, ఈ విభాగం మూసేయాలని ప్రభుత్వానికి లేఖ రాస్తానన్నారు. ఈశాఖకు ఏడాదికి 50 కోట్లు ఖర్చు ఉంటే 2 కోట్లు ఆదాయం మాత్రమే వస్తుందన్నారు. శాఖను లాభాల బాటలో నడపాలంటే ముందుగా ప్రింటింగ్‌లో కొత్త టెక్నాలజీ తీసుకురావాలన్నారు. దశాబ్దాల కాలంగా ప్రింటింగ్ శాఖలో ఉద్యోగాల కేటాయింపు లేదన్నారు.ఇక్కడ నిస్సహాయ స్థితిలో ఉన్న వారి జీవితాల్లో ఉల్లాసం తేవడమే తన ఉద్దేశమన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ బాగుందని, ఇంకా ఈ వ్యవస్థలో మార్పు రావాలన్నారు. జైళ్లలో ఆనంద ఆశ్రమం ఏర్పాటు ద్వారా యాచకుల రహిత నగరం కోసం కృషి చేసి సత్ఫలితాలు సాధించడం సంతృప్తి కలిగించిందన్నారు. రాజకీయాలతో బంగారు తెలంగాణ సాధ్యం కాదని, ప్రజలతోనే సాధ్యమని అందుకోసమే వారితో కలిసి సామాజిక చైతన్య శిబిరాలు చేపడతామన్నారు. తెలంగాణ సమాజంలో కూడా మార్పు తీసుకురావడం కోసం స్వచ్ఛత అభియాన్, హరితహారం కోసం ప్రజల్లోకి వెళ్తానన్నారు. నిజమైన ప్రజాస్వామ్యం కోసం ప్రజలు ముందుకు రావాలన్నారు. తనపై వస్తున్న అవినీతి ఆరోపణలపై హైకోర్టు ద్వారా విచారణ చేయించుకోవచ్చన్నారు.

## రాజేంద్రనగర్‌లో ఐఏఎస్, ఐపీఎస్ అకాడమీ

### గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు

**హైదరాబాద్:** గౌడ, బడుగు, బలహీన వర్గాల వా రి కోసం గౌడ సంఘం ఆధ్వర్యంలో 'ఐఏఎస్, ఐపీఎస్'అకాడమీని ఏర్పాటు చేస్తున్నట్లు గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణరావు గౌడ్ తెలిపారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో ప్రభుత్వం ఇచ్చిన 2 ఎకరాల్లో దీనిని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. దీనిపై స్పీకర్ పద్మారావుగౌడ్, మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీ నర్సయ్యగౌడ్ సీఎం కేసీఆర్‌తో చర్చిస్తున్నట్లు పేర్కొన్నారు.




# ఇంటర్ ఫస్టియర్‌లో 28.29% ఉత్తీర్ణత

- ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదల
- ఈనెల 31 వరకు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు అవకాశం

**సాక్షి, హైదరాబాద్:** ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ప్రథమ సంవత్సర పరీక్షల ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. ఇంటర్ బోర్డు కార్యాలయంలో కార్యదర్శి అశోక్ ఫలితాలను విడుదల చేశారు. గత వార్షిక పరీక్షల్లో ఫెయిలై, ప్రస్తుతం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో 28.29 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇంప్రూవ్‌మెంట్ రాసిన విద్యార్థులను కలుపుకుంటే 64.31 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు మొత్తంగా 3,00,607 మంది విద్యార్థులు హాజరయ్యారు. అందులో గత వార్షిక పరీక్షల్లో ఫెయిలైన వారు 1,49,605 మంది ఉండగా, వారిలో 42,331 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇక ఇంప్రూవ్‌మెంట్‌కు 1,51,002 మంది విద్యార్థులు హాజరై మార్కులను మెరుగు పరుచుకున్నట్లు బోర్డు కార్యదర్శి అశోక్ వెల్లడించారు.

**30 నాటికి మార్కుల జాబితాలు..**


మార్కుల జాబితాలు, మెమోలు సంబంధిత జిల్లా విద్యాధికారులకు పంపించనున్నట్లు అశోక్ తెలిపారు. వాటిని కాలేజీల ప్రిన్సిపాళ్లు ఈనెల 30న తీసుకొని విద్యార్థులకు అందజేయాలన్నారు. విద్యార్థులు ఈనెల 31వ తేదీలోగా రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రీకౌంటింగ్‌కు ఒక్కో సబ్జెక్టుకు రూ. 100, రీవెరిఫికేషన్ కమ్ స్కాన్డ్ కాపీ కోసం ఒక్కో పేపరుకు రూ. 600 చెల్లించాల్సి ఉంటుందని వివరించారు.

# సున్నా మార్కులు ఎందుకు వస్తున్నాయ్!

## టెన్త్, ఇంటర్ చదువులపై అధ్యయనం చేయాలని గవర్నర్ ఆదేశం



**సాక్షి, హైదరాబాద్:** ఇంటర్మీడియట్, పదో తరగతుల్లో విద్యార్థులకు సున్నా మార్కులు ఎందుకు వస్తున్నాయో అధ్యయనం చేయాలని గవర్నర్ నరసింహన్ విద్యాశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఇటీవల గవర్నర్ వద్ద జరిగిన విద్యాశాఖ సమీక్షలో ఆయన ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. దీనిపై విద్యాశాఖ ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) డైరెక్టర్ బి.శేషుకుమారి, ఇంటర్ బోర్డు పరీక్షల నియంత్రణాధికారి అబ్దుల్ కాలిఖ్, మరో అధికారి శ్రీనివాస్‌తో కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ సున్నా మార్కులు వచ్చిన విద్యార్థుల స్థితిగతులపై అధ్యయనాన్ని ప్రారంభించింది. టెన్త్, ఇంటర్‌లో ఏయే విద్యార్థులకు సున్నా మార్కులు వచ్చాయి.. వారి కుటుంబ, ఆర్థిక పరిస్థితులు ఏంటి.. స్కూల్, కాలేజీలకు రెగ్యులర్‌గా వెళ్తున్నారా.. పరీక్షలకు మాత్రమే హాజరవుతున్నారా? అనే కోణాల్లో కమిటీ పరిశీలన జరుపుతోంది. అయితే ప్రాథమికంగా తేలిన అంశాల ప్రకారం గ్రామీణ నిరుపేద విద్యార్థులు స్కూళ్లు, కాలేజీలకు వెళ్లడం లేదని, పరీక్షలకు మాత్రమే హాజరవుతుండటం వల్ల ఏమీ రాయడం లేదని, దీంతో సున్నా మార్కులు వస్తున్నట్లు గుర్తించారు. అయితే దీనిపై మరింత అధ్యయనం చేసేందుకు చర్యలు చేపట్టారు. నెల రోజుల్లో గవర్నర్‌కు నివేదికను అందిస్తారు.









## రెచ్చగొట్టేలా ఉంటే హోంశాఖకు ఫిర్యాదు

### అక్బరుద్దీన్ ప్రసంగంపై బీజేపీ ఆగ్రహం

**సాక్షి, హైదరాబాద్:** ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ తీరు కుక్క తోక వంకరే అన్నట్లుగా ఉందని బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి కృష్ణసాగర్‌రావు పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అక్బరుద్దీన్ ఇటీవల చేసిన వీడియో ప్రసంగాన్ని పరిశీలిస్తున్నామని, అందులో ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలుంటే హోంశాఖకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. ఆదరాబాదరాగా చేసిన మున్సిపల్ బిల్లు రాజ్యాంగ నిబంధనలకు వ్యతిరేకంగా ఉందని కేంద్ర మాజీమంత్రి దత్తాత్రేయ నేతృత్వంలో బీజేపీ నేతలు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. బిల్లును గవర్నర్ వెనకకు పంపినా సీఎం తీరులో ఎలాంటి మార్పు లేదన్నారు. రాజకీయ లబ్ధికోసం ఆర్డినెన్స్ తీసుకొచ్చారని, దానిని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. ఆర్డినెన్స్ ఎప్పుడు చేయాలో కేసీఆర్‌కు తెలియదన్నారు. విస్తృత స్థాయి ప్రజా ప్రయోజనం ఉండి, రెండు సభలు నిర్వహించలేని పరిస్థితిలోగానీ, ఎమర్జెన్సీ సమయంలోగానీ ఆర్డినెన్స్ తీసుకొస్తారన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి రాష్ట్రంలో ఉందా అని ప్రశ్నించారు. ఆ బిల్లులో ప్రజా ప్రయోజనాలు లేవని, టీఆర్ఎస్ లబ్ధి మాత్రమే ఉందన్నారు.ఈ ఆర్డినెన్స్‌ను పాస్ చేయవద్దని గవర్నర్‌కు లేఖ రాస్తామన్నారు. కేబినెట్ భేటీ లేకుండా ఆర్డినెన్స్ ఎలా ఇస్తారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నేతలు ఎస్.కుమార్, సుధాకర్‌శర్మ పాల్గొన్నారు.

## అసెంబ్లీలో చర్చించాకే ఆమోదించాలి: చాడ



**సాక్షి, హైదరాబాద్:** మళ్లీ అసెంబ్లీని సమావేశపరిచి, మున్సిపల్ చట్టంలోని మార్పులపై చర్చించాకే దానిని ఆమోదించాలని సీపీఐ కార్యదర్శి చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం లోతైన అధ్యయనం చేయకుండానే ఈ చట్టాన్ని తీసుకొచ్చిందని విమర్శించారు. బుధవారం మఖ్దూంభవన్‌లో పార్టీ నాయకులు పల్లా వెంకటరెడ్డి, వీఎస్‌బోస్, ఉజ్జిని రత్నాకరరావు, ఈటీ నరసింహలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదరాబాదరాగా ఆర్డినెన్స్ తీసుకురావాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. అధికార వ్యవస్థను కేంద్రీకృతం చేయడం ద్వారా అధికారాన్ని తన గుప్పిట్లో పెట్టుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. కొత్త చట్టం ద్వారా ఎన్నికల సంఘం అధికారాలను కైవసం చేసుకునే ప్రయత్నంతో పాటు ప్రజాప్రతినిధుల అధికారాలకు చెక్ పెట్టిందన్నారు. సర్పంచ్‌ల చెక్ పవర్ విషయంలోనూ గందరగోళం నెలకొందని, హరితహారంలో నాటిన 85 శాతం మొక్కలు బతకకపోతే సర్పంచ్‌లను తొలగిస్తామనడం సరికాదన్నారు.

## ప్రభుత్వాలు కూల్చే ఆట కర్ణాటకతోనే మొదలు

### టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి



**సాక్షి, హైదరాబాద్:** కర్ణాటకలో తమ సంకీర్ణ సర్కారును కూల్చడం ద్వారా బీజేపీ తన నిజస్వరూపాన్ని బయటపెట్టుకుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి విమర్శించారు. బుధవారం గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. కర్ణాటకలో కాంగ్రెస్ ఓడి గెలిస్తే, బీజేపీ గెలిచి ఓడిందని వ్యాఖ్యానించారు. కోట్ల రూపాయలు చేతులు మార్చి ప్రజాస్వామ్యాన్ని కూల్చివేసిన బీజేపీ రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చే ఆట కర్ణాటకతోనే ప్రారంభించిందని, తర్వాత తెలంగాణలోనే పావులు కదుపుతుందని చెప్పారు. మున్సిపల్ బిల్లును గవర్నర్ తిప్పి పంపడమే ఇందుకు సంకేతమని, దీనిపై కేసీఆర్ స్పందించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ చింతమడకకే సీఎం కాదని, వందల కోట్ల రూపాయలు ఆ ఒక్క గ్రామానికే ఎలా ఇస్తారని ప్రశ్నించారు. చింతమడకకు ఏదైనా ప్రాజెక్టు వస్తే అన్ని డబ్బులిచ్చినా తమకు అభ్యంతరం లేదని, వ్యక్తిగత లబ్ధి జరిగేలా ప్రభుత్వ ఖజానాను ఎలా పంచుతారని నిలదీశారు.

## 'విద్యారంగ సమస్యలను పరిష్కరించండి'

**సాక్షి, హైదరాబాద్:** విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీఆర్టీయూ టీఎస్ డిమాండ్ చేసింది. సమస్యలను పరిష్కరించని పక్షంలో వచ్చే నెల 7న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నా నిర్వహిస్తామని పీఆర్టీయూ టీఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావులు తెలిపారు. బుధవారం సచివాలయంలో సీఎస్ ఎస్‌కే జోషికి ధర్నా నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అందులో ఉద్యోగ విరమణ వయసు 61 ఏళ్లకు పెంచాలని, ఏకీకృత సర్వీసు రూల్స్ విషయంలో న్యాయపరమైన చిక్కులను తొలగించి టీచర్లకు పదోన్నతులు కల్పించాలని కోరారు. సీపీఎస్ రద్దుకు ఉన్నత స్థాయి కమిటీని నియమించాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలయ్యేలా ఉత్తర్వులివ్వాలన్నారు. పండిట్, పీఈటీలను అప్‌గ్రేడ్ చేస్తూ వెంటనే జీవోను ఇవ్వాలని కోరారు. కేజీబీవీ టీచర్లకు టైం స్కేలు, మెటర్నరీ సెలవులు మంజూరు చేస్తూ వారికి బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## ఆరోపణలన్నీ అవాస్తవాలే: ఐఎంఎస్ డైరెక్టర్

**సాక్షి, హైదరాబాద్:** ఈఎస్ఐ వ్యవహారంలో కార్మిక సంఘం నాయకుడు బి.గురవయ్య చేసిన ఆరోపణలు విచారణ ప్రక్రియను దారి తప్పించేలా ఉన్నాయని బీమా వైద్య సేవల సంచాలకురాలు సీహెచ్ దేవికారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రికార్డులు ట్యాంపరింగ్ చేశారన్న గురవయ్య ఆరోపణలు అవాస్తవమన్నారు. తనతోపాటు కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి శశాంక్ గోయల్, మరో అధికారిణి నాగలక్ష్మిపై అసత్య ప్రచారం చేసి కేసును పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాడని మండిపడ్డారు. స్టాకు, సర్జికల్ సరుకులు మాయమైన అంశాన్ని ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించిందని తెలిపారు. ప్రభుత్వం విచారణ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా చేపడుతోందని వివరించారు.




బీజేపీ మెంబర్‌షిప్ యాప్‌ను ఆవిష్కరిస్తున్న దత్తాత్రేయ, ఇంద్రాసేనరెడ్డి

## అందుబాటులోకి బీజేపీ మెంబర్‌షిప్ యాప్

### విడుదల చేసిన మాజీ కేంద్ర మంత్రి దత్తాత్రేయ

**సాక్షి, హైదరాబాద్:** బీజేపీ సభ్యత్వ నమోదుకోసం రూపొందించిన మొబైల్ యాప్ అందుబాటులోకి వచ్చింది. ఆ యాప్‌ను బుధవారం కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ ఆవిష్కరించారు. ప్రస్తుతం యాప్ ఆండ్రాయిడ్ మొబైల్‌లలో అందుబాటులో ఉంది. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో యాప్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ రోజు రోజుకూ బలహీన పడుతోందని, ఆ పార్టీలో నాయకత్వలోపం కనపడుతుందన్నారు. కానీ బీజేపీలో ఆ పరిస్థితి లేదన్నారు. సమర్థవంతమైన నాయకత్వం, ప్రజలకు ఉపయోగపడే ఎజెండాతో బీజేపీ ప్రజల ముందుకు వెళ్లిందన్నారు. తెలంగాణలో గతంలో ఉన్న 18 లక్షల సభ్యత్వంతోపాటు కొత్తగా మరో 18 లక్షల సభ్యత్వం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటికే 4.5 లక్షల సభ్యత్వాలు పూర్తి చేశామన్నారు. కేంద్రంలో చక్రం తిప్పాలనుకున్న కేసీఆర్, చంద్రబాబుల కల కలగానే మిగిలిపోయిందన్నారు. కర్ణాటకలో బీజేపీ అధికారంలోకి రావడం శుభపరిణామమన్నారు. మాజీ ఎంపీ వివేక్ అమిత్ షాను కలిసి బీజేపీలో చేరేందుకు సంసిద్ధత వ్యక్తం చేయడం తెలంగాణ బీజేపీకి శుభ పరిణామమని అన్నారు. గ్రామ స్థాయిలో కమిటీలు వేసిన తర్వాత కేంద్ర పథకాలైన ఫసల్ బీమా, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలుచేస్తే బీజేపీ లాభ పడుతుందనే భయంతో కొన్ని కేంద్ర పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని దత్తాత్రేయ విమర్శించారు. ఈ సమావేశంలో బీజేపీ సీనియర్ నేత ఇంద్రసేనారెడ్డి, మెంబర్‌షిప్ ఇన్‌చార్జి ఎం.ధర్మారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సినీ నటి మోనాలిజా చౌదరి బీజేపీలో చేరారు. ఆమెకు దత్తాత్రేయ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



కన్నెపల్లిలో ఆరు మోటార్ల ద్వారా ఎత్తిపోస్తున్న నీరు

# కన్నెపల్లిలో ఆరు మోటార్లతో ఎత్తిపోతలు

**కాళేశ్వరం:** కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంపుహౌస్‌లో ఆరు మోటార్లతో బుధవారం సాయంత్రం నుంచి ఎత్తిపోతలు ప్రారంభమయ్యాయి, మహారాష్ట్రలో వర్షాలు కురుస్తుండటంతో ప్రాణహిత నదికి వరద పోటెత్తుతోంది. దీంతో నీటి లభ్యత ప్రకారం ఈ నెల 6 నుంచి ఒక్కో మోటారుకు వెట్‌రన్ చేస్తూ ఆరు మోటార్లతో ఎత్తిపోతలను అధికారులు ప్రారంభించారు. ఇప్పటికే కన్నెపల్లి నుంచి ప్రాణహిత నీరు సుందిళ్ల బ్యారేజీకి చేరాయి. కన్నెపల్లిలో ఒక్కో మోటార్ 24 గంటల్లో 2,100 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుంది. ఆరు మోటార్లతో 1.5 టీఎంసీల నీరు అన్నారం బ్యారేజీకి గ్రావిటీ కాల్వ ద్వారా ఒక్క రోజుకు చేరనుంది. ఇప్పటికే అన్నారం బ్యారేజీలో 6.9, మేడిగడ్డ బ్యారేజీలో 6.5 టీఎంసీల నీరు నిల్వ ఉండటంతో జలకళ ఉట్టి పడుతోంది. దీంతో వివిధ ప్రాంతాల నుంచి సందర్శకుల తాకిడి పెరిగింది.

# పన్ను వసూళ్లలో భేష్

- దేశంలో ఐదో స్థానంలో తెలుగు రాష్ట్రాలు
- ఏపీ, తెలంగాణ ఇన్‌కంట్యాక్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ శంకరన్



ఆదాయ పన్ను శాఖ 159వ ఆవిర్భావ కార్యక్రమంలో ఏపీ, తెలంగాణ ఇన్‌కంట్యాక్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ శంకరన్, నల్సార్ వర్సిటీ వీసీ ఫైజల్ ముస్తఫా తదితరులు

**సాక్షి, హైదరాబాద్:** ప్రత్యక్ష పన్ను వసూళ్లలో తెలంగాణ, ఏపీ రాష్ట్రాలు దేశంలోనే ఐదో స్థానంలో ఉన్నాయని ఏపీ, తెలంగాణ ఇన్‌కంట్యాక్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ శంకరన్ వెల్లడించారు. ఆదాయ పన్ను శాఖ 159వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శంకరన్ మాట్లాడుతూ, దేశంలో ఆర్థిక వనరులు పెరగాలన్నా.. అభివృద్ధిలో ప్రపంచ దేశాలతో భారత్ పోటీ పడాలన్నా.. నిజాయతీగా పన్నులు చెల్లించాలని ప్రజలకు సూచించారు. దేశంలో ప్రతీ పౌరుడు నిజాయతీగా, సులువుగా పన్నులు చెల్లించేందుకు వీలుగా సాంకేతికతను వాడుకుంటున్నామని చెప్పారు. ఈఫైలింగ్‌కు అపూర్వ స్పందన వస్తోందని తెలిపారు. 2018–19 ఏడాదిలో 6.68 కోట్ల ఈఫైలింగులు రావడమే దీనికి నిదర్శనమని అన్నారు. దీన్ని మరింత సులభతరం చేస్తామని చెప్పారు. ప్రత్యక్ష పన్నుల విషయంలో దేశంలో గణనీయ వృద్ధి నమోదవుతోందని తెలిపారు. 2014–15లో రూ.6.95 లక్షల కోట్లు పన్ను రూపంలో వసూళ్లవగా 2018–19లో అది రూ.11.37 లక్షల కోట్లకు చేరిందని తెలిపారు. రూ.4.41 లక్షల కోట్ల అభివృద్ధితో 63.5 శాతం వృద్ధి రేటు నమోదవ్వడం విశేషమని కొనియాడారు. అదేవిధంగా ఏపీ, తెలంగాణల్లో వృద్ధి రేటు కూడా బాగుందన్నారు. 2014–15లో వృద్ధి రేటు రెండు రాష్ట్రాల నుంచి రూ.31,762 వేల కోట్లు ఉండగా, 2018–19 వరకు అది రూ.52,040 కోట్లకు చేరిందని తెలిపారు. ఐదేళ్లలో 82 శాతం వృద్ధి నమోదు చేయడం రికార్డని కొనియాడారు. దేశంలో ముంబై, చెన్నై, బెంగళూరు, ఢిల్లీ తరువాత తెలుగు రాష్ట్రాలు దేశానికి ఆదాయం ఇవ్వడంలో ఐదో స్థానంలో నిలిచాయని ప్రశంసించారు. ప్రత్యక్ష పన్నుల వసూళ్లు పెరుగుతుండటం దేశానికి శుభసూచకమని అన్నారు. ఐఏఎస్‌కు ఎంపికైన అంధ ఉద్యోగి కట్టా సింహాచలాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ డీజీఐటీ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ ఆర్.కె.పలికల్, డి.జి.ఇన్వెస్టిగేషన్ ఆర్.హెచ్.పాలీవాల్, చీఫ్ కమిషనర్ శ్రీ అతుల్ ప్రణయ్, నల్సార్ యూనివర్సిటీ వీసీ ఫైజల్ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు. అనంతరం పన్ను చెల్లింపులో అగ్రస్థానంలో నిలిచిన పలు కంపెనీలకు అవార్డులు అందజేశారు.

# గుర్తింపు లేని కాలేజీలు.. 1,338

- 361 ప్రైవేటు జూనియర్ కాలేజీలకే అనుబంధ గుర్తింపు
- మిగతా కాలేజీలకు ఇచ్చిన గడువు మరో వారం రోజులే..
- ఆ తర్వాత అఫిలియేషన్లు ఇవ్వబోమంటున్న ఇంటర్ బోర్డు
- అఫిలియేషన్ లభించని వాటిలో 25 శ్రీచైతన్య, 26 నారాయణ కాలేజీలు

**సాక్షి, హైదరాబాద్:** ఇంటర్మీడియట్ కాలేజీల అనుబంధ గుర్తింపులో ఏటా తంతటాలు తప్పడం లేదు. అనుబంధ గుర్తింపు కోసం ఏయే సర్టిఫికెట్లు అందజేయాలన్న విషయం కాలేజీ యాజమాన్యాలకు తెలిసినా పట్టించుకోవడం లేదు. రాష్ట్రంలో నిబంధనల ప్రకారం అత్యధిక ప్రైవేటు జూనియర్ కాలేజీలు వ్యవహరించడం లేదు. బోర్డు ఆదేశాలను పట్టించుకోవడం లేదు. 2019–20 విద్యా సంవత్సరంలో ప్రవేశాలు చేపట్టే కాలేజీల అనుబంధ గుర్తింపు కోసం గతేడాది డిసెంబర్‌లోనే నోటిఫికేషన్ జారీ చేసి, దరఖాస్తులను స్వీకరించినా కాలేజీలన్నీ నిర్దేశిత సర్టిఫికెట్లను అందజేయలేదు. దీంతో రాష్ట్రంలో అనుబంధ గుర్తింపు వ్యవహారం గందరగోళంగా మారింది. ఇప్పటివరకు కూడా వాటిని ఇవ్వకపోవడంతో 1,338 కాలేజీలకు అనుబంధ గుర్తింపు లేకుండా పోయింది. అయితే ఆయా కాలేజీల్లో ఇప్పటికే ప్రవేశాలు పూర్తయ్యాయి. చివరకు విద్యార్థులు భవిష్యత్ పేరుతో అనుబంధ గుర్తింపు పొందేందుకు ఆయా యాజమాన్యాలు చర్యలు వేగవంతం చేశాయి. అందులో 75 కార్పొరేట్ కాలేజీలు ఉండగా, అత్యధికంగా నారాయణ, శ్రీచైతన్య యాజమాన్యాలకు చెందినవే కావటం గమనార్హం. రాష్ట్రంలో ఇంటర్ బోర్డు పరిధిలోని 405 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు కాకుండా పాఠశాల విద్యా శాఖ, సంక్షేమ శాఖల పరిధిలో మరో 558 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉన్నాయి. అందులో ఇప్పటివరకు 492 కాలేజీలకు ఇంటర్ బోర్డు అనుబంధ గుర్తింపు ఇచ్చింది. మరో 66 కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, ఇతర విద్యా సంస్థల గుర్తింపు ప్రాసెస్ కొనసాగుతోంది. ఇక ప్రైవేటు కాలేజీలు 2,155 ఉండగా, వాటిల్లో 1,699 కాలేజీలే అనుబంధ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకున్నాయి. వాటిల్లో 361 కాలేజీలకు షరతులతో కూడిన అనుబంధ గుర్తింపును బోర్డు జారీ చేసింది. వాటిలోనూ ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్లు లేరు. 3 నెలల్లో నియమించుకుంటామన్న షరతుతో వాటికి అనుబంధ గుర్తింపును జారీ చేసింది. మిగతా 1,338 కాలేజీలకు ఇంకా అనుబంధ గుర్తింపును ఇవ్వలేదు.

**కాలేజీల వారీగా వివరాలు..**

| కేటగిరీ | దరఖాస్తులు | గుర్తింపు లభించినవి | గుర్తింపు పొందాల్సినవి |
|---|---|---|---|
| ప్రభుత్వ | 405 | 405 | -- |
| విద్యాశాఖ, సంక్షేమ | 558 | 492 | 66 |
| ప్రైవేటు | 1,699 | 361 | 1,338 |
| మొత్తం | 2,662 | 1,258 | 1,404. |

**గుర్తింపు రాని కార్పొరేట్ విద్యా సంస్థలు..**

| విద్యా సంస్థ | కాలేజీల సంఖ్య |
|---|---|
| శ్రీచైతన్య | 25 |
| నారాయణ | 26 |
| శ్రీగాయత్రి | 8 |
| ఎన్ఆర్ఐ | 4 |
| ఇతర కాలేజీలు | 12 |
| మొత్తం | 75 |

### చివరకు శానిటేషన్ సర్టిఫికెట్లూ లేవు..

రాష్ట్రంలోని ఎక్కువ శాతం ప్రైవేటు కాలేజీలకు రిజిస్టర్ లీజ్ డీడ్, ఫిక్స్‌డ్ డిపాజిట్ రెన్యువల్, స్ట్రక్చరల్ సౌండ్ నెస్, ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్లు, ఆట స్థలాలు లేవు. సరిగ్గా ఫ్యాకల్టీ లేరు. గతేడాది అంతకుముందు ఇచ్చిన అనుబంధ గుర్తింపు ఫీజులను పూర్తిగా చెల్లించలేదు. ఇవే కాదు చివరకు శానిటరీ, హైజీన్ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. ఈ కారణాలతోనే 1,338 కాలేజీలకు ఇంటర్మీడియట్ బోర్డు ఇంకా అనుబంధ గుర్తింపును జారీ చేయలేదు. ఇందులో ముఖ్యంగా ఐదారు ఫ్లోర్లు కలిగిన భవనాల్లో నడుపుతున్న 75 కార్పొరేట్ కాలేజీలు ఉన్నాయి. వాటికి ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్లు లేవు. అందులో శ్రీచైతన్య విద్యా సంస్థలకు చెందినవి 25, నారాయణ విద్యా సంస్థలకు చెందినవి 26, శ్రీగాయత్రి విద్యా సంస్థలకు చెందినవి 8, ఎన్ఆర్ఐ విద్యా సంస్థలకు చెందినవి 4, మరో 12 ఇతర విద్యా సంస్థలకు చెందినవి ఉన్నాయి. పైగా అవన్నీ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోనే ఉన్నట్లు ఇంటర్ బోర్డు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ఆ కాలేజీలు అన్నింటికి అనుబంధ గుర్తింపు లేకపోవడం, విద్యార్థులను ఎలాగూ చేర్చుకున్న నేపథ్యంలో విద్యార్థుల భవిష్యత్ పేరుతో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు సిద్ధం అయ్యాయి.

### మరో వారం సమయం ఇస్తాం: బోర్డు కార్యదర్శి అశోక్

అనుబంధ గుర్తింపు తీసుకోని విద్యా సంస్థలకు మరో వారం గడువు ఇస్తామని ఇంటర్ బోర్డు కార్యదర్శి అశోక్ పేర్కొన్నారు. ఆ తర్వాత అనుబంధ గుర్తింపు ప్రక్రియను నిలిపివేస్తామని వెల్లడించారు. ఇప్పటికే చాలా సమయం ఇచ్చామని తెలిపారు. ఆయా విద్యా సంస్థలన్నీ తమకు కాలేజీలకు సంబంధించిన నిర్దేశిత సర్టిఫికెట్లను అందజేసి అనుబంధ గుర్తింపు పొందాలని సూచించారు. అలా గుర్తింపు పొందని విద్యా సంస్థల విషయంలో ప్రభుత్వంతో చర్చించి తదుపరి చర్యలు చేపడతామని వెల్లడించారు. అందులో 194 కాలేజీలకు అనుబంధంగా హాస్టళ్లు ఉన్నాయని వివరించారు. హాస్టళ్ల గుర్తింపు విషయంలో కేసు కోర్టులో ఉన్నందున ఆ విషయం జోలికి వెళ్లడం లేదని పేర్కొన్నారు.

# కేసీఆర్ పాలన ముస్లింలకు స్వర్ణయుగం

- దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు
- హోం మంత్రి మహమూద్ అలీ, మాజీ మంత్రి హరీశ్‌రావు
- సిద్దిపేటలో హజ్‌హౌస్ ప్రారంభం
- హైదరాబాద్ తర్వాత సిద్దిపేటలో మాత్రమే హజ్‌హౌస్



బుధవారం సిద్దిపేటలో హజ్‌హౌస్‌ను ప్రారంభిస్తున్న మహమూద్ అలీ, హరీశ్‌రావు

**సాక్షి, సిద్దిపేట:** ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన ముస్లిం మైనార్టీలకు స్వర్ణయుగం లాంటిదని, దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ మైనార్టీలకోసం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్‌దే అని హోంశాఖ మంత్రి మహమూద్ అలీ, మాజీ మంత్రి హరీశ్‌రావు కొనియాడారు. సిద్దిపేటలో రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించిన హజ్‌హౌస్‌ను బుధవారం వారు ప్రారంభించారు. హైదరాబాద్ తర్వాత సిద్దిపేటలో మాత్రమే హజ్‌హౌస్‌ను ఏర్పాటు చేయడం గమనార్హం. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. దేశంలో ఎన్నోపార్టీలు ఉన్నాయని, వాటిల్లో టీఆర్ఎస్ ఒక్కటే సెక్యులర్ పార్టీ అని రుజువు చేసిందని మహమూద్ అలీ అన్నారు. సీఎం కేసీఆర్ అన్ని మతాలు, కులాలను సమానంగా చూడటమే కాకుండా సంక్షేమానికి బడ్జెట్ కేటాయించారని పేర్కొన్నారు. గత పాలకులు మాటలు చెప్పి చేతులు దులుపుకున్నారన్నారు. రాష్ట్రంలో ఉన్న వక్ఫ్ భూములు అన్యాక్రాంతం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ భూములన్నింటిన్నీ పరిరక్షిస్తామని చెప్పారు. సీఎం కేసీఆర్ మైనార్టీ విద్యార్థులు చదువుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 204 మైనార్టీ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశారని, కార్పొరేట్‌కు దీటుగా అక్కడ బోధన అందుతోందని చెప్పారు. ఏటా 100 మంది ముస్లిం విద్యార్థులకు సివిల్స్, గ్రూప్–1 వంటి పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తున్నామని, విదేశీ చదువులకోసం ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు.

### గురుకులాలను సద్వినియోగం చేసుకోవాలి: హరీశ్‌రావు

మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో ముస్లిం మైనార్టీలు భాగస్వాములు అన్నారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో మైనార్టీ సోదరులు ముందు వరుసలో ఉన్నారన్నారు. ముస్లిం మైనార్టీల్లో కూడా పేదలు ఉన్నారని, కనీస వసతులు లేక తమ బిడ్డలను చదివించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరి పరిస్థితిని నేరుగా చూసిన ముఖ్యమంత్రి మైనార్టీ బిడ్డలకోసం 204 మైనార్టీ గురుకులాలు ఏర్పాటు చేశారని అన్నారు. ఈ పాఠశాలలను ముస్లిం సోదరులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు మహ్మద్ సలీం, ఫారూక్ హుస్సేన్, రాష్ట్ర హజ్ హౌస్ చైర్మన్ మసిహుల్లాఖాన్, సిద్దిపేట మున్సిపల్ చైర్మన్ రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

# నోటిఫికేషన్ వెలువడే వరకు ఓటర్ల జాబితా సవరణ

- జాబితాలో తప్పులుంటే మున్సిపల్ కమిషనర్లకు ఫిర్యాదులు
- వెల్లడించిన రాష్ట్ర ఎన్నికల కమిషన్..



**సాక్షి, హైదరాబాద్:** మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువరించే వరకు మున్సిపల్ ఓటర్ల జాబితాలను సవరించవచ్చునని రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) వెల్లడించింది. అయితే ముందుగా అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు చేస్తే తదనుగుణంగా మున్సిపల్ ఓటర్ల జాబితాల్లో మార్పులు చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపింది. ఈ మేరకు ఓటర్ల జాబితాలకు మూలమైన అసెంబ్లీ ఓటర్ల జాబితాల్లో మార్పులు చేయాల్సి ఉంటుందని పేర్కొంది. ఓటర్ల జాబితాల్లో పేర్లు చేర్చాలని అనుకునే వారు ఇందుకోసం అవసరమైన ఫాం–6, 7, 8, 8 (ఏ)లను అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ వద్ద సమర్పించాలని స్పష్టంచేసింది. రాజకీయ పార్టీలు, ఓటర్లు, స్వచ్ఛందసంస్థలు, ఆసక్తి ఉన్నవారు వార్డుల వారీగా ప్రచురించిన ఓటర్ల జాబితాలను పరిశీలించి ఏవైనా ఎంట్రీలకు సంబంధించి తప్పులుంటే (మున్సిపల్ సంస్థల పరిధులకు అనుగుణంగా) వాటిపై ఫిర్యాదులు, సలహాలకు సంబంధించిన లేఖలను మున్సిపల్ కమిషనర్లు లేదా రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ల(ఈఆర్‌వోలు)కు సమర్పించాలని సూచించింది. ఈ ఫిర్యాదులు, సూచనలను జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఓటర్ల రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు జాగ్రత్తగా పరిశీలించి పరిష్కరించాలని పేర్కొంది. ఏవైనా మార్పులు, చేర్పులుంటే ప్రజాప్రాతినిధ్య చట్టం, నిబంధనలకు అనుగుణంగా అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల జాబితాలను సరిచేయాలని తెలిపింది. తదనుగుణంగా మున్సిపాలిటీల్లోని ఓటర్ల జాబితాల్లో మార్పులు చేసేందుకు మున్సిపల్ కమిషనర్లకు అవకాశం ఉంటుందని పేర్కొంది. ఈనెల 16న మున్సిపాలిటీలకు సంబంధించి వార్డుల వారీగా ఫొటోలతో కూడిన తుది ఓటర్ల జాబితాను ప్రచురించాక వాటిని ప్రజలకు అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపింది. వీటి ప్రతులను ఇప్పటికే అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు ఉచితంగా అందజేసినట్టు, పరిశీలన కోసం విడి కాపీలు మున్సిపల్ కమిషనర్ల వద్ద అందుబాటులో ఉన్నాయని పేర్కొంది. ఈ జాబితాలను ఎస్ఈసీ వెబ్‌సైట్ tsec.gov.in నుంచి కూడా డౌన్‌లోడ్ చేసుకునేందుకు వీలు కల్పించినట్టు ఎస్ఈసీ తెలిపింది.

# హ్యాపీ బర్త్‌డే కేటీఆర్

- ఘనంగా టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పుట్టినరోజు వేడుకలు
- పలువురు ప్రముఖుల నుంచి వెల్లువెత్తిన శుభాకాంక్షలు
- గిఫ్ట్ ఏ స్మైల్ కింద సేవా కార్యక్రమాలు

**సాక్షి, హైదరాబాద్:** టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పుట్టినరోజు వేడుకలను బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పలు చోట్ల ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమాల్లో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కేటీఆర్ అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పుట్టినరోజు సందర్భంగా కేటీఆర్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. జమ్మూకశ్మీర్ మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పలువురు మంత్రులు, మాజీ మంత్రులు, ఎంపీలు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. సినీపరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు కూడా కేటీఆర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పి, ఆయనతో కలిసి తీయించుకున్న ఫొటోలను ట్యాగ్ చేశారు. తెలంగాణ భవన్‌లో టీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో పలువురు రక్తదానం చేశారు. శాసనసభ ఆవరణలోని టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో కేక్ కట్ చేశారు. హైదరాబాద్‌లోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో వెయ్యి మొక్కలు నాటారు. ఇక బహ్రెయిన్‌లో టీఆర్ఎస్ ఎన్నారై సెల్ ఆధ్వర్యంలో గుదైబియా ఆండాల్స్ గార్డెన్‌లోనూ మొక్కలు నాటి కేటీఆర్ జన్మదిన వేడుకలు జరిపారు.

### గిఫ్ట్ ఏ స్మైల్‌కు అపూర్వ స్పందన..

కేటీఆర్ జన్మదినం సందర్భంగా ఆయన అభిమానులు చేపట్టిన గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమానికి భారీ స్పందన వచ్చింది. కేటీఆర్ అనుచరులు, అభిమానులు, మిత్రులు, సన్నిహితులు తమ వంతుగా ఏదో ఒక మంచి పని చేసి కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. రక్తదానాలు, పుస్తకాలు, సైకిళ్ల వితరణ, హరితహారం, విద్యార్థులకు ఆర్థిక సాయం తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అమెరికన్ కాన్సులేట్ జనరల్ కేథరిన్ హడ్డా కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తన వంతుగా విద్యార్థులకు ఇంగ్లిష్ డిక్షనరీలు పంచారు. వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ ముగ్గురికి ఆర్థిక సహాయం అందజేశారు. తన నియోజకవర్గానికి చెందిన వి.నవ్య అనే పేద విద్యార్థి ఉన్నత చదువుల కోసం, తెలంగాణ ఉద్యమం సందర్భంగా గాయపడిన శివ, రాజులకు రూ.లక్ష చొప్పున సాయం చేశారు.



బసవతారకం ఆస్పత్రి వద్ద జరిగిన అన్నదాన కార్యక్రమంలో భోజనం వడ్డిస్తున్న హిమాన్షు

కాగా, తనకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతిఒక్కరికి, గిఫ్ట్ ఏ స్మైల్ కింద సమాజ సేవ చేసిన అందరికీ కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు.

### సేవా కార్యక్రమాల్లో హిమాన్షు..

తన తండ్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా ఆయన కుమారుడు కల్వకుంట్ల హిమాన్షు పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బంజారాహిల్స్‌లోని బసవతారకం కేన్సర్ ఆసుపత్రి వద్ద అన్నదాన కార్యక్రమంలో పాల్గొని స్వయంగా భోజనాలు వడ్డించారు. రహమత్‌నగర్‌లోని కుమార్ స్కూల్ విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. అంతకుముందు జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి దేవస్థానంలో కేటీఆర్ పేరు మీదుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.



బండరాయిలాంటి ఓ వస్తువును బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నిశితంగా పరిశీలిస్తున్న దృశ్యం ఇది. బిహార్‌లోని మధుబన్ జిల్లాలోని ఓ గ్రామంలో ఆకాశం నుంచి అకస్మాత్తుగా భూమిపై పడిన దీనిని ఉల్కాశకలంగా భావిస్తున్నారు. దాదాపు 15 కేజీల బరువున్న ఈ రాయి భూమిపై పడి 5 అడుగుల గొయ్యిని ఏర్పరిచింది.

# మతవిద్వేష దాడుల్ని ఆపండి!

- ముస్లిం, దళిత, మైనారిటీలపై దాడులను నిరోధించండి
- ప్రధాని మోదీకి 49 మంది ప్రముఖుల లేఖ
- ‘జైశ్రీరామ్’ యుద్ధ నినాదంగా మారిందని ఆవేదన
- నేరాలకు మతం రంగు పులమవద్దన్న మంత్రి నఖ్వీ

**కోల్‌కతా/న్యూఢిల్లీ:** దేశంలో ముస్లింలు, దళితులు, ఇతర మైనారిటీలపై మతం ఆధారంగా జరుగుతున్న మూకహత్యలు, దాడులపై సినీప రిశ్రమతో పాటు వేర్వేరు రంగాలకు చెందిన 49 మంది ప్రముఖులు గళమెత్తారు. ఈ మూకహత్యలను వెంటనే అరికట్టేందుకు ప్రధాని మోదీ చర్యలు తీసుకోవాలని ప్రముఖ దర్శకులు మణిరత్నం, అదూర్ గోపాలకృష్ణన్,



మీడియాతో మాట్లాడుతున్న అపర్ణాసేన్

అనురాగ్ కశ్యప్, శ్యామ్‌బెనగల్ నటీనటులు అపర్ణాసేన్, కొంకణ్‌సేన్ శర్మ, రేవతి, సౌమిత్రో ఛటర్జీ, గాయని శుభా ముగ్దల్, ప్రముఖ చరిత్ర కారుడు రామచంద్రగుహ, సామాజిక కార్యకర్త బినాయక్ సేన్, సామాజికవేత్త ఆశిష్ నంది సహా 49 మంది బహిరంగ లేఖ రాశారు. కోల్‌కతాలో నటి అపర్ణాసేన్ ఈ లేఖను మీడియాకు విడుదల చేశారు. అందులో.. ‘‘మోదీజీ.. మన దేశంలో ఇటీవల చోటుచేసుకుంటున్న దురదృష్టకరమైన సంఘటనలపై మేమంతా కలత చెందుతున్నాం. మనది శాంతికాముక దేశం. కానీ దేశంలో ముస్లింలు, దళితులు, ఇతర మైనారిటీ మతస్తులను చంపేస్తున్నారు. దీన్ని నిలువరించాలి. ఇటీవల నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్బీ) గణాంకాలు చూసి విస్తుపోయాం. ఎందుకంటే ఒక్క 2016లోనే దళితులపై 840 దాడి ఘటనలు నమోదయ్యాయి. 9 ఏళ్లలో మతవిద్వేష దాడులు అమాంతం పెరిగిపోగా, అందులో 62 శాతం మంది బాధితులు ముస్లింలే. 2009, జనవరి 1 నుంచి 2018 అక్టోబర్ 29 వరకూ దేశవ్యాప్తంగా 254 మత విద్వేష ఘటనలు నమోదు కాగా, వీటిలో 91 మంది చనిపోయారు. ఈ విద్వేషదాడుల్లో 90 శాతం 2014, మే తర్వాతే(మోదీ వచ్చాకే) నమోదయ్యాయి.
ఈ నేరాల్లో శిక్షలు పడుతున్న కేసులు గణనీయంగా తగ్గిపోవడం ఇంకా దారుణం. మోదీజీ.. మీరు పార్లమెంటులో ఈ మూకహత్యలను ఖండించారు. కానీ అది మాత్రమే సరిపోదు. హత్య కేసుల్లో పెరోల్ లేకుండా జీవితఖైదు పడుతున్నప్పుడు అంతకంటే దారుణమైన మూకహత్యలకు అదే శిక్ష ఎందుకు వర్తించదు? ఇలాంటి ఘటనల్లో దోషులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? ఏ దేశంలో కూడా ప్రజలు భయంతో బతకకూడదు. మెజారిటీ ప్రజలు శ్రీరాముడిని ఆరాధిస్తారు. కానీ, ‘జై శ్రీరామ్’ రెచ్చగొట్టే యుద్ధ నినాదంగా మారిపోయింది. ఆయన పేరుతో హత్యలు చేయడానికి ఇది మధ్యయుగం కాదు. ప్రధానిగా ఈ దుశ్చర్యలను నిలువరించాలి. మతవిద్వేష దాడులతో శ్రీరాముడి పేరును అపవిత్రం చేయడం ఆపండి. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించిన వారిని దేశద్రోహులుగా, జాతివ్యతిరేకులుగా, అర్బన్ నక్సల్స్‌గా ముద్రవేయడం సరికాదు. అధికార పార్టీని విమర్శిస్తే దేశాన్ని వ్యతిరేకించినట్లు కాదు. ప్రజలు తమ అభిప్రాయాలను వెల్లడించే హక్కును రాజ్యాంగం కల్పిస్తోంది. ఎక్కడైతే భిన్నాభిప్రాయాన్ని, అసమ్మతిని వినిపించేందుకు అవకాశముంటుందో అదే బలమైన దేశంగా రూపుదిద్దుకుంటుంది’’ అని లేఖలో పేర్కొన్నారు.

## అందరూ సురక్షితమే: నఖ్వీ

భారత్‌లో ముస్లింలు దళితులు సహా మైనారిటీలంతా సురక్షితంగా ఉన్నారని కేంద్ర మైనారిటీ శాఖ మంత్రి ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ తెలిపారు. మూకహత్యలు, మతవిద్వేష దాడుల్ని అరికట్టాలని 49 మంది దర్శకులు, నటులు, ఇతర కళాకారులు ప్రధాని మోదీకి రాసిన లేఖను ఆయన తప్పుపట్టారు. నేరాలకు మతం రంగు పులమడం సరికాదని వ్యాఖ్యానించారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎలాంటి మతఘర్షణలు చోటు చేసుకోలేదని గుర్తుచేశారు. ‘‘2014 ఎన్నికల తర్వాత ‘అవార్డు వాపసీ’ పేరుతో ఇలాంటి కార్యక్రమాన్నే మనమంతా చూశాం. ఇది దానికి పార్ట్–2 మాత్రమే. విద్వేష నేరాలు, మూకహత్యలను అరికట్టడానికి ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకుంటున్నాయి. కానీ తమనుతాము మానవ హక్కుల పరిరక్షకులుగా, లౌకికవాదానికి కస్టోడియన్లుగా చెప్పుకునే కొందరు ఈ నేరాలకు మతం రంగుపులిమే ప్రయత్నం చేస్తున్నారు’’ అని నఖ్వీ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ‘ఉగ్ర’ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**వ్యక్తులను టెర్రరిస్టులుగా ప్రకటించే అధికారం ప్రభుత్వానికిస్తూ బిల్లులో ప్రతిపాదన**

- ఉగ్రవాదాన్ని పెకలించేందుకు ఈ సవరణలు అవసరమే: చర్చలో అమిత్ షా
- ఓటింగ్‌కు ఒవైసీ పట్టుబట్టడంతో హైడ్రామా



లోక్‌సభలో మాట్లాడుతున్న హోం మంత్రి అమిత్ షా

**న్యూఢిల్లీ:** ఉగ్రవాద కార్యకలాపాలతో సంబంధం ఉన్న వ్యక్తులను ఉగ్రవాదులుగా నిర్ధారించేలా చట్టానికి సవరణలు చేసేందుకు ప్రభుత్వం తెచ్చిన బిల్లును లోక్‌సభ బుధవారం ఆమోదించింది. ఈ సవరణలపై ప్రతిపక్షాలు వ్యతిరేకత వ్యక్తం చేయగా, ప్రభుత్వ నిర్ణయాన్ని హోం మంత్రి అమిత్ షా గట్టిగా సమర్థించారు. ఉగ్రవాదుల కన్నా దర్యాప్తు సంస్థలు నాలుగడుగులు ముందుండాలంటే ఈ సవరణలు కచ్చితంగా అవసరమేనని ఆయన పేర్కొన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (సవరణ బిల్లు)–2019పై లోక్‌సభలో జరిగిన చర్చలో అమిత్ షా మాట్లాడారు. ఈ బిల్లుపై ఓటింగ్‌లో పాల్గొనకుండా ప్రతిపక్ష కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ సభ్యులంతా బయటకు వెళ్లిపోవడంపై అమిత్ షా స్పందిస్తూ ‘మీ ఓటు బ్యాంకును కాపాడుకోడానికి మీరు ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నారు. అందుకే ఓటింగ్‌కు దూరంగా వెళ్లిపోతున్నారు. దీనికి మేం ఏం చేయగలం?’ అన్నారు. సవరణ బిల్లుకు ప్రతిపక్ష సభ్యులు ప్రతిపాదించిన సవరణలు వీగిపోయాయి. ఈ చట్టంతో సమాఖ్య వ్యవస్థను నాశనం చేస్తున్నారని కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం అనడంపై అమిత్ షా స్పందిస్తూ ‘సమాఖ్య స్ఫూర్తి దెబ్బతింటోందని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. అయితే ఈ చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టాన్ని 1967లో నాటి ప్రధాని ఇందిర ప్రభుత్వమే తెచ్చింది. అంటే సమాఖ్య స్ఫూర్తి కాంగ్రెస్ వల్లే, ఆనాడే దెబ్బతిన్నది’ అంటూ ఎదురుదాడి చేశారు. ఈ చట్టానికి తెచ్చిన సవరణలను, చట్టాన్ని తాము దుర్వినియోగం చేయబోమనీ, కేవలం ఉగ్రవాదాన్ని వేళ్లతో సహా పెకలించేందుకే దీనిని ఉపయోగిస్తామని ఆయన తెలిపారు. అలాగే కొంతమంది వ్యక్తులు సిద్ధాంతాల పేరుతో పట్టణ మావోయిజాన్ని ప్రోత్సహిస్తున్నారనీ, అలాంటి వారిపై ప్రభుత్వం ఎంతమాత్రమూ దయ చూపదని అమిత్ షా స్పష్టం చేశారు.

**ఒవైసీ ఒత్తిడితో నాటకీయ పరిణామాలు**

సవరణ బిల్లును ఆమోదించడానికి ఓటింగ్ జరపాలంటూ ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పట్టుబట్టడంతో సభలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ప్రభుత్వం తెచ్చిన సవరణలను వ్యతిరేకిస్తూ అప్పటికే వివిధ ప్రతిపక్ష పార్టీలు బయటకు వెళ్లిపోయాయి. ప్రతిపక్ష సభ్యుల్లో చాలా తక్కువ మంది మాత్రమే ఉన్నారు. ఇలాంటి సమయంలోనూ బిల్లును ఆమోదించడానికి ముందు ఓటింగ్ నిర్వహించాలని ఒవైసీ డిమాండ్ చేశారు. దీంతో ఆయన అనవసరంగా సభా సమయాన్ని వృథా చేస్తున్నారంటూ ఇతర సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఒవైసీ దూకుడుగా సమాధానమిస్తూ ‘ఓటింగ్ కోరడం నా హక్కు. అభ్యంతరం తెలపడానికి, అడ్డుకోవడానికి మీరెవరు?’ అని అన్నారు. దీంతో స్పీకర్ ఓం బిర్లా ఈ బిల్లుపై ఓటింగ్ నిర్వహించారు. 287 మంది సభ్యులు బిల్లుకు అనుకూలంగా ఓటేయగా, 8 మంది వ్యతిరేకించారు. ప్రతిపక్ష సభ్యులు ప్రతిపాదించిన సవరణలపై కూడా ఓటింగ్ నిర్వహించాలని ఒవైసీ పట్టుబట్టగా..నిబంధనలను ప్రస్తావిస్తూ సభ్యులను నిల్చోబెట్టి సమర్థిస్తున్న వారెంత మంది, వ్యతిరేకిస్తున్న వారెంత మంది అని స్పీకర్ లెక్కించారు. అనంతరం బిల్లు ఆమోదం పొందింది. అనంతరం ఒవైసీ మాట్లాడుతూ ‘నేను ప్రభుత్వం మొత్తాన్నీ నిల్చొనేలా చేశాను’ అని వ్యాఖ్యానించగా, ఆర్థిక శాఖ సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్ ‘ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నిలబడేందుకు మేం సిద్ధమే. ఇప్పుడూ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నిల్చున్నాం’ అని అన్నారు.

## నేడు లోక్‌సభకు ట్రిపుల్ తలాక్ బిల్లు

లోక్‌సభలో గురువారం ఆమోదించాల్సిన బిల్లుల జాబితాలో వివాదాస్పద ట్రిపుల్ తలాక్ బిల్లును కూడా కేంద్రం చేర్చింది. ఆ సమయంలో కచ్చితంగా సభలో ఉండాలంటూ తమ ఎంపీలకు అధికార బీజేపీ ఇప్పటికే విప్ కూడా జారీ చేసింది. ఉన్నట్టుండి, ఏకకాలంలో ముమ్మారు తలాక్ చెప్పి భార్యలకు విడాకులిచ్చే ముస్లిం పురుషులను జైలుకు పంపేలా ఈ బిల్లులో నిబంధనలు ఉన్నాయి. కాంగ్రెస్, డీఎంకే, తృణమూల్ కాంగ్రెస్ తదితర ప్రతిపక్ష పార్టీలన్నీ ఈ బిల్లును పరిశీలన కోసం పార్లమెంటరీ కమిటీకి పంపాల్సిందేనని పట్టుబడుతున్నాయి. దీంతో తనకున్న భారీ సంఖ్యబలంతో లోక్‌సభలో కేంద్రం ఈ బిల్లును ఆమోదింపజేసుకున్నా, రాజ్యసభలో మాత్రం ప్రభుత్వానికి తిప్పలు తప్పేలా లేవు.

## సవరణ బిల్లులో ఏముంది?

‘ఉగ్రవాద, వినాశక కార్యకలాపాల నిరోధక చట్టం’ (టాడా), ‘ఉగ్రవాద నిరోధక చట్టం’ (పోటా)లకు మార్పులు చేస్తూ ఈ ‘చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (సవరణ)’ బిల్లులను కేంద్రం తెచ్చింది. ఈ సవరణలు ఏం చెబుతున్నాయంటే..

- ఉగ్రవాదానికి పాల్పడిన లేదా ఉగ్ర కార్యకలాపాల్లో పాల్గొన్న, ఉగ్రవాద హింసాకాండకు ఏర్పాట్లు చేసిన, ఉగ్రవాదాన్ని ప్రోత్సహించిన, ఉగ్రవాదానికి ఇతరత్రా సహకారం అందించిన వ్యక్తులు, సంస్థలను ఈ చట్టం కింద ఉగ్రవాదులుగా లేదా ఉగ్రవాద సంస్థలుగా కేంద్రం ప్రకటించవచ్చు.
- ప్రస్తుత చట్టం ప్రకారం ఉగ్రవాద కేసులను దర్యాప్తు చేసే అధికారి.. నిందితుల ఆస్తులను జప్తు చేయాలంటే ముందుగా పోలీసు డైరెక్టర్ జనరల్ (డీజీపీ) అనుమతి తీసుకోవలసి ఉంది. తాజా సవరణల ప్రకారం.. కేసులను జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అధికారి దర్యాప్తు చేస్తున్న పక్షంలో ఆస్తుల జప్తుకోసం డీజీపీ అనుమతి కాకుండా, ఎన్ఐఏ డీజీ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అదే కేసులను పోలీసులే దర్యాప్తు చేస్తుంటే డీజీపీ అనుమతి అవసరం.
- ప్రస్తుత చట్టం ప్రకారం ఉగ్రవాద కేసులను డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ), అసిస్టెంట్ పోలీసు కమిషనర్ (ఏసీపీ), పై స్థాయి అధికారులు మాత్రమే దర్యాప్తు చేయాలి. తాజా సవరణల ప్రకారం ఎన్ఐఏలోని ఇన్‌స్పెక్టర్ లేదా ఆ పై స్థాయి అధికారులు కూడా దర్యాప్తు చేపట్టవచ్చు.
- ప్రస్తుత చట్టానికి అనుబంధంగా తొమ్మిది అంతర్జాతీయ ఒప్పందాలు ఉన్నాయి. ఆ ఒప్పందాల పరిధిలోకి వచ్చే కార్యకలాపాలను ఉగ్రవాద చర్యలుగా నిర్ణయిస్తున్నారు. ప్రస్తుత సవరణ కింద ఆ ఒప్పందాలతో పాటుమరో ఒప్పందాన్ని(ఇంటర్నేషనల్ కన్వెన్షన్ ఫర్ సప్రెషన్ ఆఫ్ యాక్ట్స్ ఆఫ్ న్యూక్లియర్ టెర్రరిజం–2005) కూడా చేర్చారు. ఇక నుంచి ఈ పది ఒప్పందాల పరిధిలోకి వచ్చే కార్యకలాపాలను ఉగ్రవాద కార్యకలాపాలుగా పేర్కొంటారు.

## పార్లమెంటు సమాచారం



- ఈవీఎంల ట్యాంపరింగ్ అసాధ్యమని న్యాయశాఖ మంత్రి రవి శంకర్‌ప్రసాద్ లోక్‌సభలో తెలిపారు. న్యాయ శాఖ పరిధిలోని టెక్నికల్ ఎక్స్‌పర్ట్ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వరంగ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మాత్రమే వీటిని తయారుచేస్తున్నాయని స్పష్టం చేశారు.
- పశ్చిమ బెంగాల్ పేరును ‘బంగ్లా’గా మార్చేందుకు రాజ్యాంగానికి సవరణ చేసే ప్రతిపాదన ఏదీ లేదని హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ రాజ్యసభలో చెప్పారు. రాష్ట్రాల పేర్లు మార్చాలంటే రాజ్యాంగ సవరణ అవసరమని ఆయన అన్నారు. బంగ్లా పేరు బంగ్లాదేశ్‌కు దగ్గరగా ఉన్నందున, పేరు మార్చడాన్ని కేంద్రం తిరస్కరిస్తోందన్నారు.
- కశ్మీర్ యువత ఉగ్రవాదంవైపు వెళ్లడం 40 శాతం తగ్గిందని హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి రాజ్యసభలో వెల్లడించారు. సరిహద్దు చొరబాట్లు 43 శాతం, ఉగ్ర చర్యలు 28 శాతం తగ్గాయన్నారు. యూపీఏ –2లో పోలిస్తే మావోయిస్టుల దాడులు 43 శాతం తగ్గాయని వెల్లడించారు.
- మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి, సంఘపరివార్ నేత శ్యామా ప్రసాద్ ముఖర్జీ, దీన్ దయాళ్ ఉపాధ్యాయ్‌ల మృతిపై ప్రత్యేక విచారణ జరిపే ఆలోచనేదీ లేదని మంత్రి కిషన్‌రెడ్డి రాజ్యసభలో తెలిపారు.
- భారత్‌తో సరిహద్దు పంచుకుంటున్న చైనా, నేపాల్, భూటాన్ సరిహద్దుల్లో కంచె నిర్మించే ప్రతిపాదనేమీ లేదని హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ రాజ్యసభలో తెలిపారు. భద్రతా చర్యలు పక్కాగా తీసుకుంటుండడంతో సరిహద్దు చొరబాట్లు పూర్తిగా తగ్గిపోయాయన్నారు. ఇండో–పాక్ సరిహద్దులో 2069 కిలోమీటర్లకుగాను 2004 కిలోమీటర్ల కంచె పూర్తయిందన్నారు. ఇండో–బంగ్లా సరిహద్దులో 3326 కిలోమీటర్లకుగాను 2803 కిలోమీటర్ల కంచె పూర్తయిందని వెల్లడించారు.
- మూడేళ్లలో ఇస్రో వాణిజ్య విభాగం ద్వారా 239 శాటిలైట్లను ప్రయోగించి, రూ. 6,289 కోట్లు ఆర్జించినట్లు ప్రధానమంత్రి కార్యాలయంలో సహాయమంత్రి జితేంద్ర సింగ్ లోక్‌సభలో తెలిపారు.
- భారత స్వతంత్ర సమరయోధుడు నేతాజీకి సంబంధించి తమ వద్ద ఎలాంటి సమాచారం లేదని రష్యా వెల్లడించినట్లు విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి మురళీధరన్ లోక్‌సభలో తెలిపారు. 2014 నుంచి ఈ విషయమై రష్యాను అడుగుతూనే ఉన్నామని ఆయన తెలిపారు.
- విదేశాల్లో ఉంటున్న భారతీయుల సమస్యలను తీర్చడానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్ జైశంకర్ లోక్‌సభలో తెలిపారు. విదేశాల్లో ఉంటున్న భారతీయులు 2015 ఫిబ్రవరి నుంచి 2019 జూలై 18 వరకు 50,605 సమస్యలను నమోదు చేసుకోగా 44,360 సమస్యలను (దాదాపు 90 శాతం) తీర్చామన్నారు. అందులో 36,805 సమస్యలు గల్ఫ్ దేశాల నుంచే వచ్చాయన్నారు. ఎమ్ఏడీఏడీ పోర్టల్ ద్వారా సమస్యలను నమోదు చేయవచ్చన్నారు.

## తెలుగుసహా 9 భాషల్లోకి ‘సుప్రీం’ తీర్పులు

**న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టు తీర్పులు దేశంలోని తొమ్మిది ప్రాంతీయ భాషల్లోకి అనువాదమవుతున్నాయని, వాటిని కోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తున్నామని న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పులను ప్రాంతీయ భాషల్లోకి అనువదించడంలో కృత్రిమ మేధస్సును ఉపయోగించేందుకు యోచిస్తున్నామని, దానికోసం ఒక కమిటీని ఏర్పాటు చేశామని లోక్‌సభలో చెప్పారు. ‘సుప్రీంకోర్టు తీర్పులు ప్రస్తుతం, తొమ్మిది స్థానిక భాషలలోకి అనువదిస్తున్నాం. అస్సామీ, బెంగాలీ, హిందీ, కన్నడ, మరాఠీ, ఒడియా, తమిళం, తెలుగు, ఉర్దూ భాషల్లో వెబ్ సైట్‌లోకి అప్‌లోడ్ చేస్తున్నాం’ అని చెప్పారు.

## నాకూ వేధింపులు తప్పలేదు!: ఎంపీ డెరెక్



**న్యూఢిల్లీ:** ‘అప్పుడు నాకు 13 ఏళ్లు. కోల్‌కతాలో టెన్నిస్ ప్రాక్టీస్‌కు వెళ్లి తిరిగి వస్తున్నా. నిక్కర్, టీ షర్ట్ వేసుకుని ఉన్నా. ఇంటికి వెళ్లేందుకు చాలా రద్దీగా ఉన్న బస్ ఎక్కాను. ఎవరో తెలీదు. కానీ నన్ను ఆ రద్దీలో నన్ను లైంగికంగా వేధించారు. కొన్నేళ్ల తరువాత ఒక సందర్భంలో మా ఇంట్లో చెప్పాను’.. ఈ వ్యాఖ్యలు చేసింది తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ, ప్రఖ్యాత క్విజ్ మాస్టర్ డెరెక్ ఓ బ్రెయిన్. పోక్సో (లైంగిక వేధింపుల నుంచి చిన్నారులను రక్షించే చట్ట సవరణ) బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన రాజ్యసభలో ఈ బాధాకర విషయాన్ని గుర్తు చేసుకున్నారు. పిల్లలపై దారుణంగా లైంగిక నేరానికి పాల్పడినవారికి మరణ శిక్ష విధించేలా ప్రతిపాదన ఉన్న ఈ బిల్లుకు డెరెక్ మద్దతు తెలిపారు.
**లోక్‌సభకు బిల్లు:** పిల్లలపై తీవ్రమైన లైంగిక నేరాలకు మరణ శిక్ష, మైనర్లపై లైంగిక నేరాలకు ఇతర తీవ్రస్థాయి శిక్షలకు అవకాశం కల్పించేలా ఈ బిల్లులో ప్రతిపాదనలున్నాయి. చర్చకు సమాధానమిస్తూ పోక్సో సంబంధిత 1.66 కోట్ల పెండింగ్ కేసుల విచారణకు 1023 ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తున్నట్లు మహిళ, శిశు అభివృద్ధి శాఖ మంత్రి స్మృతి ఇరానీ తెలిపారు.

## లైంగిక వేధింపులపై మంత్రుల కమిటీ

**న్యూఢిల్లీ:** పనిచేసే చోట మహిళలపై లైంగిక వేధింపులను నిరోధించేందుకు మంత్రుల కమిటీని కేంద్రం పునర్నియమించింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆధ్వర్యంలోని ఈ మంత్రుల కమిటీ పనిచేసే చోట మహిళలపై లైంగిక వేధింపులను నిరోధించేందుకు, అవసరమైన సలహాలు, సూచనలతో పటిష్ట చట్టాలను రూపొందించేందుకు కృషి చేస్తుందని ప్రభుత్వం వెల్లడించింది. కమిటీలో మంత్రులు నిర్మలా సీతారామన్, రమేశ్ పోఖ్రియాల్ ‘నిశాంక్’, స్మృతి ఇరానీ సభ్యులుగా ఉంటారు.

## పిడుగులు పడి 23 మంది మృతి

**పట్నా/రాంచీ:** బిహార్, జార్ఖండ్‌లలో పిడుగుపాటు వల్ల 24 గంటల్లోనే 23 మంది మృతి చెందారు. మంగళవారం ఔరంగాబాద్, తూర్పు చంపారన్, భాగల్పూర్ జిల్లాల్లో పిడుగులు పడి 13 మంది మృతి చెందారు. జార్ఖండ్‌లోని జమ్తారా, రాంగర్హ్, పాకూర్ జిల్లాల్లో కూడా పిడుగుల కారణంగా 10 మంది మృతి చెందారని పోలీసులు వెల్లడించారు.

## 24 గంటల్లో కూల్చేస్తాం!

**భోపాల్:** మధ్యప్రదేశ్ ప్రతిపక్ష నేత, బీజేపీ ఎమ్మెల్యే గోపాల్ భార్గవ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీలో నంబర్ 1(ప్రధాని మోదీ) నంబర్ 2( అమిత్ షా)లు ఆదేశిస్తే 24 గంటల్లోపే కమల్‌నాథ్ నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కారు కూలిపోతుందని అసెంబ్లీలో ప్రకటించారు. దీంతో కమల్‌నాథ్ తీవ్రంగా స్పందిస్తూ..‘ బీజేపీ ఇప్పుడు అవిశ్వాసతీర్మానం పెడతానంటే ఎదుర్కొనేందుకు నేను సిద్ధమే. మా ఎమ్మెల్యేలెవరూ అమ్ముడుబోరు’ అని అన్నారు.

# మాజీ ప్రధానుల కోసం మ్యూజియం

- తమ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని మోదీ వెల్లడి
- కొందరు ప్రధానులను ఓ వర్గం కావాలని తక్కువ చేసిందని మండిపాటు



**న్యూఢిల్లీ:** దేశ మాజీ ప్రధానులందరి సమగ్ర సమాచారంతో తమ ప్రభుత్వం ఓ భారీ మ్యూజియంను ఏర్పాటు చేయనుందని ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ప్రకటించారు. రాజకీయ అంటరానితనాన్ని రూపుమాపేలా కొత్త రాజకీయ సంస్కృతిని తాము తీసుకొస్తామని ఆయన అన్నారు. మాజీ ప్రధాని చంద్రశేఖర్‌పై రాజ్యసభ డెప్యూటీ చైర్మన్ హరివంశ్ రాసిన ఓ పుస్తకాన్ని మోదీ ఢిల్లీలో ఆవిష్కరించారు. అక్కడ మాట్లాడుతూ ‘ఓ కుటుంబానికి చెందిన మాజీ ప్రధానమంత్రుల జ్ఞాపకాలు తప్ప మిగిలిన ప్రధానుల వివరాలు ఏ మాత్రం లేకుండా చెరిపేసేందుకు ఓ వర్గం రాజకీయ నాయకులు ప్రయత్నించారు. చంద్రశేఖర్ నాడు దేశవ్యాప్తంగా పాదయాత్ర చేపడితే, దానికి వ్యాపారవేత్తలు డబ్బులిచ్చారని ఆ వర్గం రాజకీయ నాయకులు ఆరోపణలు చేసి ఆయన ప్రతిష్ట దిగజార్చాలని చూశారని మోదీ గుర్తుచేశారు. ఇలాగే బీఆర్. అంబేడ్కర్, సర్దార్ పటేల్, లాల్ బహదూర్ శాస్త్రి, మొరార్జీ దేశాయ్ తదితర అనేక మంది గొప్ప నేతల ప్రతిష్టను మసకబార్చేందుకు కూడా స్వాతంత్ర్యానంతరం కుటిల ప్రయత్నాలు జరిగాయని మోదీ అన్నారు. ఈనాటి యువతరంలో లాల్ బహదూర్ శాస్త్రి లాంటి గొప్ప వ్యక్తుల గురించి ఎంత మందికి తెలుసని ఆయన ప్రశ్నించారు. ‘వాళ్లంతా మొదట ప్రజల మెదళ్ల నుంచి అదృశ్యమయ్యారు. ఇది చెప్పడానికి నాకు బాధాకరంగా ఉండొచ్చు కానీ ఓ వర్గం రాజకీయ నేతలే అలా చేశారు. కానీ మీ అందరి ఆశీస్సులతో మాజీ ప్రధానులందరికీ కలిపి ఓ పెద్ద మ్యూజియంను నిర్మించాలని నేను నిర్ణయించాను. ఆనాటి నుంచి ఇటీవలి ఐకే గుజ్రాల్, దేవె గౌడ, మన్మోహన్ సింగ్‌ల వరకు.. ప్రతి ఒక్కరూ ఈ దేశాభివృద్ధికి కృషి చేశారు. వారి సేవలను మనం గుర్తించాలి. గౌరవించాలి’ అని మోదీ పేర్కొన్నారు. గుజరాత్‌కు చెందిన మహాత్మా గాంధీ, సర్దార్ పటేల్‌ను కాదని జవహర్‌లాల్ నెహ్రూను తొలి ప్రధానిగా నియమించిన విషయాన్ని మోదీ హాస్యంతో చెప్పారు. ఈ కార్యక్రమానికి ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కాంగ్రెస్ నేతనేత గులాం నబీ ఆజాద్ హాజరయ్యారు.

# హై‘కమాండ్’ కోసం ఎదురుచూపులు

- ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమన్న కర్ణాటక బీజేపీ చీఫ్ యడ్యూరప్ప
- బీజేపీ అధిష్టానం ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నట్లు వెల్లడి



**బెంగళూరు/న్యూఢిల్లీ:** కర్ణాటకలో ప్రత్యామ్నాయ ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని కర్ణాటక బీజేపీ చీఫ్, ప్రతిపక్ష నేత బీఎస్ యడ్యూరప్ప తెలిపారు. అయితే ఈ విషయంలో బీజేపీ హైకమాండ్ ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నట్లు వెల్లడించారు. బెంగళూరులోని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆరెస్సెస్) ప్రధాన కార్యాలయం ‘కేశవ కృప’లో బుధవారం సంఘ్ పెద్దలను కలుసుకున్న అనంతరం యడ్యూరప్ప మీడియాతో మాట్లాడారు. ‘నేను ఢిల్లీ నుంచి ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నా. ఎప్పుడు అవసరమైనా నేను బీజేపీ శాసనసభా పక్షాన్ని సమావేశపర్చి ప్రభుత్వ ఏర్పాటు కోసం గవర్నర్‌ను కలుసుకోగలను. కానీ ఇందుకోసం పార్టీ హైకమాండ్ నుంచి తొలుత స్పష్టత రావాలి’ అని తెలిపారు. కర్ణాటక అసెంబ్లీలో మంగళవారం జరిగిన విశ్వాసపరీక్షకు అనుకూలంగా 99 మంది ఎమ్మెల్యేలు మద్దతు తెలపగా, 105 మంది బీజేపీ ఎమ్మెల్యేలు వ్యతిరేకించారు. దీంతో విశ్వాసతీర్మానం వీగిపోయి సీఎం కుమారస్వామి ప్రభుత్వం కుప్పకూలిపోయిన సంగతి తెలిసిందే.

**ఆరెస్సెస్ ఆశీర్వాదం వల్లే..**

ఆరెస్సెస్ పెద్దల ఆశీర్వాదం, సహకారం కారణంగానే తాను తాలూకా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి నేతగా, ముఖ్యమంత్రిగా ఎదిగానని యడ్యూరప్ప తెలిపారు. ‘తదుపరి కార్యాచరణను చేపట్టేముందు ఆరెస్సెస్ పెద్దల ఆశీస్సులు తీసుకునేందుకే ఇక్కడకు వచ్చాను. విశ్వాసపరీక్ష సందర్భంగా మా ఎమ్మెల్యేలు బలంగా, ఐకమత్యంతో నిలిచారు. మాకు రాబోయే కాలంలో కీలకమైన పరీక్షలు ఎదురుకానున్నాయి. ఇలాంటి పరిస్థితులన్నింటిని దీటుగా ఎదుర్కొని ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తాం’ అని వెల్లడించారు. మరోవైపు విశ్వాసపరీక్షకు డుమ్మా కొట్టిన 17 మంది రెబెల్ ఎమ్మెల్యేల రాజీనామాల విషయంలో స్పీకర్ రమేశ్ కుమార్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనని బీజేపీ అధిష్టానం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. దీనిపై స్పష్టత వచ్చాకే కర్ణాటకలో ప్రభుత్వ ఏర్పాటు విషయంలో ముందుకెళ్లాలని భావిస్తోంది. కాగా, ముంబైలో ఆందోళన చెందుతున్న రెబెల్ ఎమ్మెల్యేలకు సర్ది చెప్పేందుకు బీజేపీ నేతలు అశ్వంత్ నారాయణ్, ఆర్.అశోక ముంబైకి బయలుదేరి వెళ్లారు.

**ఢిల్లీ నుంచి ప్రత్యేక దూత..**

కర్ణాటకలో నాటకీయ పరిణామాల మధ్య సంకీర్ణ ప్రభుత్వం కూలిపోయిన నేపథ్యంలో బీజేపీ అధిష్టానం పలు జాగ్రత్తలు తీసుకుంటోంది. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియను సాఫీగా జరిగేలా చూసేందుకు త్వరలోనే ప్రత్యేక పరిశీలకుడిని పంపనుంది. కర్ణాటకలో విశ్వాసపరీక్షకు మొత్తం 17 మంది అధికార కూటమి సభ్యులు గైర్హాజరయ్యారు. ఈ నేపథ్యంలో వీరిపై స్పీకర్ చర్యలు తీసుకునే వరకూ వేచిఉండాలన్న ధోరణితోనే బీజేపీ అధిష్టానం ఉన్నట్లు సమాచారం. ఒకవేళ స్పీకర్ సుప్రీంకోర్టుకెళ్లిన 15 మంది రెబెల్స్ రాజీనామాలను ఆమోదించి లేదా అనర్హత వేటేస్తే అసెంబ్లీలో సభ్యుల సంఖ్య 210కి, కాంగ్రెస్–జేడీఎస్ కూటమి బలం(బీఎస్పీ ఎమ్మెల్యేతో కలుపుకుని) 103కు చేరుకుంటుంది. అప్పుడు ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మేజిక్ ఫిగర్ 106కు తగ్గుతుంది. దీంతో 107 ఎమ్మెల్యేల మద్దతున్న బీజేపీ కూటమి(బీజేపీ 105, ఇద్దరు స్వతంత్రులు) ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు మార్గం సుగమమౌతుంది. అయితే స్వతంత్రుల దయాదాక్షిణ్యాలపై బీజేపీ ప్రభుత్వం మనుగడ సాగించాల్సి ఉంటుంది.

# పాక్‌లో 40 వేల మంది ఉగ్రవాదులు!

- పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ సంచలన ప్రకటన
- 15 ఏళ్లుగా పాక్ పాలకులు నిజాలు చెప్పలేదని వ్యాఖ్య
- యూఎస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పీస్ సదస్సులో వెల్లడి



**వాషింగ్టన్:** అమెరికాలో పర్యటిస్తున్న పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పాకిస్తాన్‌లో ప్రస్తుతం 30,000 నుంచి 40,000 మంది ఉగ్రవాదులు ఉన్నారని ప్రకటించారు. వీరంతా ఆఫ్గనిస్తాన్, కశ్మీర్‌లో పోరాడినవాళ్లేనని తెలిపారు. యూఎస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పీస్ సంస్థ వాషింగ్టన్‌లో నిర్వహించిన సదస్సులో ఇమ్రాన్ మాట్లాడుతూ..‘నేను అధికారంలోకి వచ్చేవరకూ ఉగ్రవాదులపై చర్యలు తీసుకునే ధైర్యం అప్పటి ప్రభుత్వాలకు లేకపోయింది. పాకిస్తాన్‌లో ఉగ్రజాడ లేకుండా చేసేందుకే ఉగ్రవాద సంస్థల నుంచి ఆయుధాలు, విద్యాసంస్థలు, అంబులెన్సులు, ఆసుపత్రులు సహా ఆస్తులను తమ ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది’ అని చెప్పారు.

**అమెరికాకు నిజాలు చెప్పలేదు..**

అగ్రరాజ్యం ప్రకటించిన ‘ఉగ్రవాదంపై పోరాటం’లో పాక్ పాల్గొంటోందని ఇమ్రాన్ తెలిపారు. ‘సెప్టెంబర్ 11 ఉగ్రదాడులతో మాకెలాంటి సంబంధం లేదు. అల్‌కాయిదా అఫ్గానిస్తాన్‌లో ఉంది. కానీ ఎప్పుడైనా అనుకోని ఘటన జరిగితే, దానికి పాకిస్తానే బలవుతుంది. ఇందుకు మా గత ప్రభుత్వాలే కారణం. క్షేత్రస్థాయిలో వాస్తవాలను అమెరికాకు మా ప్రభుత్వాలు చెప్పలేదు. ప్రస్తుతం 40 ఉగ్రవాద సంస్థలు పాక్‌లో పనిచేస్తున్నాయి. ఈ పర్యటనలో అధ్యక్షుడు ట్రంప్, ఇతర నేతలతో జరిగిన భేటీ చాలా కీలకమైంది. అఫ్గాన్ శాంతిచర్చల్లో మేం ఏం చేయగలమో ట్రంప్‌కు చెప్పా. నేను తాలిబన్లను కలుసుకుని శాంతి చర్చలకు ఒప్పించేందుకు ప్రయత్నిస్తా’ అని వెల్లడించారు.

**ఇరాన్‌లో వేలుపెట్టొద్దు..**

ఇరాక్ తరహాలో ఇరాన్ విషయంలో దుస్సాహసానికి పాల్పడవద్దని ట్రంప్‌ను ఇమ్రాన్ హెచ్చరించారు. ‘ఇరాన్ విషయంలో నా ఆందోళన ఏంటంటే.. చాలాదేశాలు అమెరికా–ఇరాన్ యుద్ధం పర్యావసానాలను ఆలోచించడం లేదు. ఇది 2003లో ఇరాక్ యుద్ధం కంటే చాలా దారుణంగా ఉండబోతోంది. దీనివల్ల ప్రపంచ వ్యాప్తంగా ఉగ్రవాదం బుసలు కొడుతుంది’ అని ఇమ్రాన్ చెప్పారు. మరోవైపు ఇమ్రాన్ అమెరికా పర్యటన నేపథ్యంలో పాక్‌లో మానవ హక్కుల ఉల్లంఘనను వ్యతిరేకిస్తూ బలోచ్ ప్రాంతవాసులు, ముహాజిర్లు ఆందోళనకు దిగారు.

# ట్రంప్‌తో భేటీలో కశ్మీర్ ప్రస్తావనే లేదు

- కశ్మీర్ వివాదంలో మధ్యవర్తిత్వానికి అవకాశం లేదు
- లోక్‌సభలో స్పష్టం చేసిన రాజ్‌నాథ్ సింగ్



**న్యూఢిల్లీ:** జపాన్‌లో జరిగిన జీ–20 సమావేశాల సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని మోదీ భేటీ అయినప్పుడు కశ్మీర్ ప్రస్తావనే రాలేదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ బుధవారం లోక్‌సభలో స్పష్టం చేశారు. కశ్మీర్ వివాదంపై భారత్, పాక్‌ల మధ్యలోకి మూడో దేశం మధ్యవర్తిత్వం కుదరదని ఆయన తెలిపారు. కశ్మీర్ వివాదంలో మధ్యవర్తిత్వం చేయాల్సిందిగా మోదీ తనను కోరారంటూ సోమవారం ట్రంప్ చెప్పడంతో దేశంలో రాజకీయ దుమారం రేగడం తెలిసిందే. ఈ విషయంపై స్వయంగా మోదీనే సమాధానం చెప్పాలని ప్రతిపక్ష కాంగ్రెస్, డీఎంకే తదితర పార్టీలు డిమాండ్ చేస్తూ బుధవారం లోక్‌సభలో ఆందోళనలు చేపట్టాయి. దీంతో ఆ విషయంపై చర్చించేందుకు స్పీకర్ ఓం బిర్లా సమయం ఇచ్చారు. ప్రతిపక్ష సభ్యులు మాట్లాడిన అనంతరం, వారికి సమాధానం చెప్పేందుకు లోక్‌సభ ఉప నాయకుడు రాజ్‌నాథ్ సింగ్ లేచిన వెంటనే విపక్షం మళ్లీ ఆందోళనకు సిద్ధమైంది. మోదీనే వచ్చి రెండు సభల్లోనూ సమాధానం చెప్పాలంటూ సభ నుంచి వాకౌట్ చేశారు. అనంతరం రాజ్‌నాథ్ మాట్లాడుతూ కశ్మీర్ దేశానికి గర్వకారణమనీ, ఈ విషయంలో మధ్యవర్తిత్వానికి అవకాశమే లేదని చెప్పారు. ట్రంప్‌తో భేటీలో మోదీ అస్సలు కశ్మీర్ గురించి మాట్లాడిందే లేదనీ, ఇక మధ్యవర్తిత్వం ప్రస్తావన ఎక్కడినుంచి వస్తుందని ఆయన ప్రశ్నించారు.

సాక్షి

గురువారం, జూలై, 25

# ప్రజాతీర్పే పరిష్కారం

'ఇంకెన్నాళ్లు...?' అని అందరి చేతా పదే పదే అనిపించుకున్నాక, మూడు వారాలపాటు కాలయాపన చేశాక కర్ణాటకలో కాంగ్రెస్‌–జేడీఎస్ కూటమి ప్రభుత్వం అధికారం నుంచి తప్పుకుంది. అక్కడి రాజకీయ పరిణామాలతో విసుగు చెందిన జనం ఊపిరిపీల్చుకునేంతలోనే మధ్యప్రదేశ్‌లో కుర్చీలాట మొదలైంది. ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని 24 గంటల్లో కూల్చేస్తామని బీజేపీ ప్రకటించగా, ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలను తమకు అనుకూలంగా మలుచుకుని ముఖ్యమంత్రి కమల్‌నాథ్ ఈ సవాలుకు జవాబిచ్చారు. ఆ రాష్ట్రంలోని రాజకీయం మరెన్ని మలుపులు తిరుగుతుందో రానున్న రోజుల్లో చూడాల్సి ఉంది. కర్ణాటక రాజకీయ చదరంగంలో అటు అధికార పక్షమూ, ఇటు విపక్షమూ రెండూ సాధారణ ప్రజానీకానికి ఏవగింపు కలిగించాయి. నిరుడు మే నెలలో కూటమి ప్రభుత్వం ఏర్పడిననాటినుంచి దినదిన గండంగానే బతుకీడుస్తోంది. 104మంది ఎమ్మెల్యేలతో అతి పెద్ద పార్టీగా అవతరించిన బీజేపీ... యడ్యూరప్ప సారథ్యంలో సర్కారు ఏర్పరిచినా అది మూణ్ణాళ్ల ముచ్చటే అయింది. అటుపై 116మంది బలం ఉన్న కాంగ్రెస్‌–జేడీఎస్ కూటమి డీకే కుమారస్వామి నేతృత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కానీ కూటమి ప్రభుత్వానికి పాలనపై దృష్టి పెట్టే అవకాశమే కలగలేదు. స్వీయ రక్షణే దాని ఏకైక ఎజెండాగా మారింది. కూటమి సర్కారును కూల్చడానికి ఎప్పుడు అవకాశం దొరుకుతుందా అని స్వల్పకాలం ఏలిన యడ్యూరప్ప కాచుక్కూర్చోగా... కేవలం 37 స్థానాలు మాత్రమే గెల్చుకున్న కుమారస్వామి అందలం ఎక్కడాన్ని కాంగ్రెస్‌కు చెందిన మాజీ ముఖ్యమంత్రి సిద్దరామయ్య జీర్ణించుకోలేకపోయారు. వెలుపలి నుంచి యడ్యూరప్ప, లోపలినుంచి సిద్దరామయ్య ఇలా రగిలిపోతుంటే కుమారస్వామి భరోసాతో ఉండటం ఎలా సాధ్యం? అందుకే ఆయన రాజీనామా చేసి పోతానని అనేకసార్లు బెదిరించారు. ఒక సందర్భంలో కంటతడి పెట్టారు. ఎవరినీ సంతృప్తిపరచలేక, సముదాయించలేక అయోమయానికి లోనయ్యారు. అయినా సిద్దరామయ్యను అదుపు చేయడంలో కాంగ్రెస్ విఫలమైంది. ఆయన్ను ఏదోవిధంగా సముదాయించినా ఆ పార్టీలో ఇతరేతర వర్గాలున్నాయి. వాటి డిమాండ్లు వాటికున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో సైతం కూటమి ప్రభుత్వం 14 నెలలు అధికారంలో కొనసాగడం నిజంగా వింతే.

ఇప్పుడు యడ్యూరప్ప వెంటనే ముఖ్యమంత్రి పీఠం అధిష్టిస్తారో, లేదో చూడాల్సి ఉంది. సభకు గైర్హాజరైన 17మంది కాంగ్రెస్, జేడీఎస్ సభ్యుల వ్యవహారం ఏ మలుపుతిరుగుతుందో కూడా ఆసక్తికరమే. అయితే యడ్యూరప్ప ఏర్పరిచే ప్రభుత్వమైనా సుస్థిరంగా ఉంటుందన్న గ్యారెంటీ లేదు. ఇప్పుడు పదవులు దక్కని కాంగ్రెస్, జేడీఎస్ ఎమ్మెల్యేలు చేసినట్టే, రేపు బీజేపీ ఎమ్మెల్యేలు ప్రవర్తించరని చెప్పలేం. 2008లో అధికారంలోకి వచ్చాక బీజేపీలో చెలరేగిన అంతర్గత కుమ్ములాటలు ఎవరూ మరిచిపోరు. తొలుత యడ్యూరప్ప, ఆ తర్వాత సదానంద గౌడ, అటుపై జగదీశ్ శెట్టార్‌లకు అధికార పగ్గాలు అప్పగించినా అసంతృప్తి సద్దుమణగలేదు. పార్టీలో ముఠా తగాదాలు ముదిరిపోగా అధిష్టానం నిస్సహాయంగా మిగిలిపోయింది. చివరకు 2013లో దారుణంగా ఓటమి పాలయింది. ఇప్పుడు కొత్తగా వచ్చిచేరే కాంగ్రెస్, జేడీఎస్ సభ్యుల అండతో ఏర్పడబోయే ప్రభుత్వం ఎన్నాళ్లు మనుగడ సాగించగలదో చూడాలి. అధికారం కోల్పోయిన కాంగ్రెస్, జేడీఎస్‌లకు ప్రభుత్వాన్ని పడగొట్టే స్థాయిలో వనరులు లేవు. కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఉండగా అదంత సులభమూ కాదు. కాంగ్రెస్, జేడీఎస్‌లు ఇప్పుడున్న ఎమ్మెల్యేలను కాపాడుకోగలిగితే అదే గొప్ప అనుకోవాలి. అసలు ఆ రెండూ ఇప్పుడున్నట్టే మిత్రపక్షాలుగా కొనసాగుతాయన్న నమ్మకం ఎవరికీ లేదు. అయితే బీజేపీ తెరవెనక ఉండి ఆడించిన రాజకీయ క్రీడ వల్ల తాము అధికారం కోల్పోయామని ప్రజల ముందు ఏకరువు పెట్టి సానుభూతి సంపాదించుకోవడానికి వాటికి అవకాశం ఉంటుంది. రెండూ కలిసి నడిస్తేనే ఇదంతా సాధ్యం.

తగినంత మెజారిటీతో ఏర్పడిన ప్రభుత్వాలు ఫిరాయింపుల వల్ల కూలిపోవడం విచారించదగ్గ విషయమే. కానీ దేశంలో వామపక్షాలు, వైఎస్సార్ కాంగ్రెస్ తప్ప ఏ పార్టీ కూడా ఫిరాయింపుల విషయంలో సూత్రబద్ధమైన వైఖరితో లేవు. ఫిరాయింపుల వల్ల బలైనప్పుడు ఒకలా, వాటివల్ల లబ్ధి పొందే పరిస్థితులున్నప్పుడు మరొకలా మాట్లాడటం ఆ పార్టీలకు అలవాటైపోయింది. సాగినన్నాళ్లు కాంగ్రెస్ ఫిరాయింపులను ప్రోత్సహించింది. ప్రభుత్వాలను పడగొట్టింది. గతంలో కాంగ్రెస్‌ను తప్పుబట్టిన బీజేపీ ఇప్పుడు అధికారం అందుకున్నాక తానూ ఆ మార్గాన్నే అనుసరిస్తోంది. ఫిరాయింపుల నిరోధక చట్టం ఆచరణలో పనికిమాలినదని రుజువయ్యాక కూడా కేంద్రంలో అధికారం చలాయించిన ఏ పక్షమూ దాన్ని సరిచేయడానికి పూనుకోలేదు. అలా చేయనివారే నష్టపోయినప్పుడల్లా అన్యాయం జరిగిందని శోకాలు పెడుతున్నారు. తాము అధికారంలోకొచ్చినప్పుడు మళ్లీ ఆ ఫిరాయింపులనే ప్రోత్సహించి, వాటితోనే మనుగడ సాగిస్తున్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకునే హక్కు స్పీకర్ పరిధి నుంచి తొలగించి ఎన్నికల సంఘానికి కట్టబెడితే ఈ సమస్య సులభంగా పరిష్కారమవుతుంది. కానీ అది ముందుమునుపూ ఏం సమస్యలు తెచ్చిపెడుతుందోనన్న భయంతో అలాంటి సవరణకు ఏ ప్రభుత్వమూ సిద్ధపడదు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని పది కాలాలపాటు నిలబెడదామని, విలువలతో కూడిన రాజకీయాలకు కట్టుబడి ఉందామని పార్టీలు భావించనంతకాలమూ పరిస్థితులు ఇలాగే ఉంటాయి. ఫిరాయింపుల్ని, వాటిని ప్రోత్సహించే పార్టీలనూ ప్రజలు ఏవగించుకుంటే పార్టీలు పంథా మార్చుకోక తప్పని స్థితి ఏర్పడుతుంది. అంతవరకూ ఈ రాజకీయ సంతలు, బేరసారాలు కొనసాగక తప్పదు. కర్ణాటకలో ఇప్పుడున్న రాజకీయ అస్థిరత సమసిపోవాలన్నా, అనైతిక రాజకీయాలకు కళ్లెం పడాలన్నా కొత్తగా ప్రజల తీర్పు కోరడమే శ్రేయస్కరం. అయితే అందుకు ఎన్ని పార్టీలు సిద్ధపడతాయన్నది ప్రశ్నార్థకమే.

# అసెంబ్లీ సాక్షిగా బాబుకు శృంగభంగం

విశ్లేషణ



డాక్టర్ ఏపీ విఠల్

**ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ చరిత్రలో ఎన్నడూ లేనంత ఘోర పరాజయానికి గురై కేవలం 23 మంది ఎమ్మెల్యేలతో శాసనసభలో అడుగుపెట్టిన చంద్రబాబుకు అక్కడ ఎదురవుతున్న అవమానాలు చూస్తే చేసుకున్నవాళ్లకు చేసుకున్నంత అనిపించకమానదు. చివరకు అచ్చయ్య, బుచ్చయ్య, రామయ్య వంటి ముగ్గురు టీడీపీ ఎమ్మెల్యేలు మాత్రమే బాబు వాదనకు సమర్థనగా నిలబడుతున్న పరిస్థితి. సూటిగా బుగ్గన, అంబటి వంటి నేతలు వాగ్బాణాలు సంధిస్తే, వాటికీ చంద్రబాబే బదులివ్వాల్సి వస్తోంది. టీడీపీ నేతలెవ్వరూ బాబు తరపున నోరు విప్పరు. ప్రజల్లో, పార్టీలో కూడా అభాసుపాలై తెలముఖం వేస్తున్న బాబుకు ప్రస్తుత దీనస్థితి స్వయంకృతాపరాధమే.**

ఇటీవల ఏపీ శాసనసభలో, ప్రతిపక్ష నేతగా ఉంటున్న చంద్రబాబు గారిని చూస్తే నిజంగానే నాకు పాపం అనిపిస్తున్నది. 70 ఏళ్ల వయస్సులో ఎన్నికల్లో తన పార్టీ తరపున మరే నేతా పడనంత శ్రమ ఆయన అనుభవించాడు. తన చూపుడు వేలు చూపించి ''ఏం తమాషా అనుకుంటున్నారా? మీ అంతు చూస్తాను, అసలు మిమ్మల్ని ఇంత దూరం రానిచ్చిన వాళ్లెవరు?'' అని ముఖం కందగడ్డ చేసుకుని... తమ గోడ వెళ్లబోసుకునేందుకు వచ్చిన అంగన్‌వాడీ మహిళలను మత్స్య పరిశ్రమ కార్మికులను, నాయీ బ్రాహ్మణులను, ఇలా నోట్లో తడిలేని జనంపై హూంకారాలు, ఘీంకారాలు చేయడం చంద్రబాబు అధికార నైజం. కానీ గతంలో కేవలం రెండు వేళ్లు కదిలిస్తూ వేదికపై కదిలే చంద్రబాబు మొన్న ఎన్నికల ప్రచార సభల్లో వేదిక నాలుగు మూలలకు వెళ్లి, జపాన్ వారి మాదిరి వంగివంగి జనానికి దణ్ణాలు పెట్టడం చూస్తుంటే ఈయనకు ఏం ఖర్మం వచ్చింది అనిపించింది. అంతేనా? ''నా మాటపై విశ్వాసంతో, అర్ధరాత్రి దాటినా, అక్కచెల్లెమ్మలు ఓటింగులో పాల్గొన్నారు. కనుక మా పార్టీ గెలవడం నూటికి వెయ్యిపాళ్లు ఖాయం'' అంటూ ప్రగల్భాలు పలికారు చంద్రబాబు. కానీ ఆ ఓటరు దేవుళ్లు మాత్రం ఆయన పార్టీకి చరిత్రలో గతంలో ఎన్నడూ ఎరుగనంతటి ఘోర పరాజయాన్ని కట్టబెట్టారు. ఇప్పుడు ఆయనకూ ఆయన వెన్నుపోటు పార్టీ వారికి చివరకు పాతాళం కూడా పైనే ఉన్నట్లుగా ఉంది పరిస్థితి.

ఇంత జరిగిన తర్వాతైనా చంద్రబాబు, తన బదులు అచ్చెన్నాయుడినో బుచ్చయ్య చౌదరినో ప్రతిపక్ష నేతగా ఎంపిక చేసి, తాను పక్కన కూర్చోవలసింది అనిపిస్తోంది. ''కనీసం తన పుత్రరత్నం గెల్చి ఉన్నట్లయితే–అతణ్ణి అయినా నమ్మి ఆ ప్రతిపక్ష నేత హోదా ఇచ్చేవారేమో గానీ, బాబుగారు తననీడను తానే నమ్మనివాడు కదా.. ఈ అచ్చయ్యగారిని, బుచ్చయ్యగారిని నమ్ముతాడటండీ మీ పిచ్చిగానీ!'' అని పక్కన ఉన్న నా మిత్రుడొకరు అన్నారు. ''ఏమయ్యా ఎన్నయినా చెప్పు, ఆయన అలా గుడ్లప్పగించి ప్రతిపక్ష నేత స్థానం నుంచి అలా జాలిగా, బేలగా, వక్రంగా చూస్తుంటే నేను ఆయన్ని అసలు చూడలేకపోతున్నాను'' అని అన్నాను. చివరకు నా రాజకీయ అనుభవం అంత లేదు నీ వయస్సు అని కూడా స్వయంగా తానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఉద్దేశించి, స్వోత్కర్షకు పరాకాష్టగా శాసనసభ సాక్షిగా బాబు చెప్పుకోవలసి వచ్చింది అంటే ఆ వెన్నుపోటు పార్టీ దీనావస్థ తేటతెల్లమవుతుంది. కనీసం, చంద్రబాబు బదులు మరో పార్టీ శాసనసభ్యుడెవరైనా తమ నేత రాజకీయ అనుభవాన్ని పొగిడేందుకు సిద్ధంగా లేరా? హతవిధీ!

అయినా చంద్రబాబు గారిదేమి జాతకమో.. ఆయన హాయిగా నవ్వగా ఎప్పుడైనా చూశామా మనం! అశేష ప్రజల ప్రేమాభిమానాలు పొందిన దివంగత సీఎం వైఎస్సార్ కూడా చంద్రబాబుతో శాసనసభలోనే 'కాస్త నవ్వవయ్యా అలా ముఖం మాడ్చుకు కూర్చోకుండా' అని అంతటితో ఆగకుండా, 'నవ్వడం ఒక భోగం, నవ్వించడం ఒక యోగం, నవ్వలేక పోవడం ఒక రోగం' అనే మాటను ఉటంకించారు. దాంతో చంద్రబాబుగారు ఉడుక్కున్నారు. ఇప్పుడు ఆ వైఎస్సార్ తనయుడు, అన్నింటా ఆయన అడుగుజాడల్లో నడుస్తున్న సామర్థ్యం, హృదయం గల యువ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అయినా బాబుగారి పరిస్థితి అదే! పైగా వైఎస్ జగన్ నిష్కల్మషంగా, నవ్వుతుంటే ఏమిటలా నవ్వడం, హుందా లేకుండా అని బాబుగారు ఉక్రోషం ప్రదర్శిస్తున్నారు. దానికి తోడు సూటిగా బుగ్గన, అంబటి వంటి నేతలు వాగ్బాణాలు



సంధిస్తే, పాపం.. వాటికీ చంద్రబాబే బదులివ్వాల్సి వస్తోంది. టీడీపీ నేతలెవ్వరూ బాబు తరపున నోరు విప్పరు. చివరకు ప్రతిపక్ష సభ్యులు ఎవరు కూడా చంద్రబాబు ఏదైనా అభ్యంతరం చెబుతూ సమాధానమిస్తూ ఉంటే ఆయనకు అండగా తమ తమ స్థానాల్లో కూర్చున్నవారు లేవలేదు. సహజంగా అలాంటి సందర్భాల్లో ప్రతిపక్ష సభ్యులు లేచి నిలబడి మాట్లాడతారు. ప్రతిపక్షనేత కూర్చుంటారు. బాబుగారూ కాస్త ఉక్రోషపడకుండా ఆలోచించండి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతిపక్షనేత పదవిని మీరే 'ఫెవికాల్' అంటించుకుని కూర్చోవాలా? ప్రస్తుతం ఉన్న మీరు కాకుండా 22 మంది శాసనసభ్యుల్లో ఆ హోదాకు అర్హులెవరూ లేరని మీ అభిప్రాయమా? లేదా మీ 23 మందిలో ఎందరు మీ పార్టీని వదిలి వెళ్లిపోతారో అన్న భయమా? అనైతిక, రాజ్యాంగ వ్యతిరేక ఫిరాయింపులను ప్రోత్సహించి మా పార్టీలోకి మరోపార్టీ ప్రజాప్రతినిధి చేరాలనుకుంటే, తానప్పుడు ఉన్న పార్టీకే కాదు.. తన చట్ట సభ సభ్యత్వానికి కూడా రాజీనామాలు ఇచ్చి రావాల్సి ఉంది అని స్పష్టంగా వైఎస్ జగన్ శాసనసభ తొలి సమావేశంలోనే చెప్పారు. లేకుంటే గత శాసనసభలో మీరు నైతికతను, రాజ్యాంగ సూత్రాలను తుంగలో తొక్కినట్లు చేసి ఉంటే.. మీరు, మీ పుత్రరత్నం, మీ వియ్యంకుడితోపాటు ఇంకెవరైనా ఒకరిద్దరు మీ వెన్నుపోటు పార్టీలో మిగిలేవారేమో!

అయినా తస్మాత్ జాగ్రత్త! తెలుగుదేశం ఎన్నో సంక్షోభాలను ఎదుర్కొంది. ఈ దీనావస్థ నుంచి కూడా తేరుకుంటాం.. అని మీకు మీరు థూ.. థా.. అంటూ వెన్నుమీద చరుచుకుని ధైర్యం చెప్పుకోవాలనుకుంటున్నారేమో? బాబుగారూ అప్పటి పరిస్థితి వేరు. ఇప్పుడు గుంటకాడ నక్కలాగా మీ పార్టీ సభ్యులను ఎగరేసుకుపోయేందుకు మోదీ అమిత్ షాల మతతత్వ, కుతంత్రాల పార్టీ బీజేపీ కాచుకుని ఉన్నది. ఆగస్టు నెల మీ పార్టీకి అచ్చిరాదని, అనుకుంటూ ఉంటారు కదా! సెప్టెంబరులో మీ శాసనసభ్యులలో మూడింట రెండువంతుల మందిని అంటే ఒక 16 మందిని తమ వైపు లాక్కుని వారిచే తమ వెన్నుపోటు పార్టీని బీజేపీలో విలీనం చేస్తున్నామని బీజేపీ సభ్యులుగా తమకు గుర్తింపు ఇవ్వాలని, ప్రకటింప చేస్తే ఎలాగూ ప్రస్తుతం ఉన్న మీ ప్రతిపక్ష నేత పదవి కూడా పోతుంది. ఆ పరిస్థితి రాకముందే, మీ వెన్నుపోటు పార్టీలో మరొకరికి ప్రతిపక్ష హోదా ఇప్పిస్తే, మరొక్కరైనా మీతో కలిసి ఉండే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం అధికారాంతమునందు జూడవలెరా ఆ అయ్య సౌభాగ్యముల్! అన్నట్లు మీ పరిస్థితి చూసి నిజంగా బాధపడుతూ మీ పట్ల సానుభూతితోనే మీకిస్తున్న నా సలహాను, వాస్తవ స్ఫూర్తితో గ్రహించగోరుతాను. పైగా, పోలవరం, రాజధాని నిర్మాణం, అక్రమ భూదందాలు, సదావర్తి సత్రం భూములు, రాష్ట్రంలో వివిధ చోట్ల ప్రత్యేకించి రాజధాని ప్రాంతంలో రియల్ ఎస్టేట్ కోసం మీ భూ సమీకరణాల భాగోతం, స్వరాష్ట్ర, స్వదేశీ, సింగపూర్ వంటి పారిశ్రామిక దొంగల ముఠాల గుట్టు, మీ మిత్రుడు సుజనా చౌదరి రట్టు అంతా ఇవ్వాళ గాకున్నా, ఇంకో నాలుగైదు నెలల్లో బయటపడనున్నదని అంటున్నారు. ఆ ప్రభావ తీవ్రత ఎంత ప్రమాదకరంగా ఉంటుందో!

ఒకవేళ ఖర్మం చాలక, బీజేపీ మీ పార్టీని దాదాపు ఖాళీ చేసి తన ఖాతాలో వేసుకుంటే, అది మీకు ఆ బీజేపీ వారికే కాకుండా, యావత్ రాష్ట్రానికే ప్రమాదం. అదే జరిగితే, మీ వెన్నుపోటు పార్టీ ఉనికే లేనంతటి తీవ్ర పరిస్థితి ఏర్పడవచ్చు. అయినా నా పిచ్చిగానీ, ఆ పార్టీ ఆ పదవి మీరు మీ కృషితో నిర్మించుకున్నవి కావు గదా. అవన్నీ పాపం, అమాయక చక్రవర్తి నట సార్వభౌమ ఎన్టీఆర్ నుంచి కపట మాయోపాయాలతో కాజేసినవే కదా! అవి మీవి కావు కనుక పోతే పాతాయ్. ఎవడు గన్న బిడ్డరా ఎక్కెక్కి ఏడుస్తున్నాడన్నట్లు, మీకేమీ బాధ ఉండక పోవచ్చు! కానీ మీకు ఈ సిరిసంపదలు, స్వదేశీ విదేశాల్లో ఆస్తులు సంపాదించిపెట్టిన పార్టీ అన్న భావంతో అయినా కనీస కృతజ్ఞతాపూర్వకంగా, ఒకవేళ మీ వెన్నుపోటు పార్టీ కనుమరుగే అయితే, రెండు కన్నీటి బొట్లు అయినా రాలుస్తారో లేదో? ఎందుకంటే కృతజ్ఞత అనేది మీ నిఘంటువులో లేదు కదా! బీజేపీ వారికీ మీ పార్టీవాళ్లు తమతో చేరినందువల్ల వచ్చే అదనపు ప్రయోజనం లేదు. ఆంధ్రప్రదేశ్ ప్రజల దృష్టిలో భ్రష్టుపట్టిన సుజనా చౌదరి, సీఎం రమేష్ వంటి అన్ని విలువలూ లుప్తమైనవారు ఎంతమంది చేరితే మాత్రం బీజేపీకి ఒరిగేది ఏముంటుంది? పైగా అలా వచ్చిన టీడీపీ నేతలు చంద్రబాబు పాఠశాలలో వెన్నుపోటు పాఠాలు బాగా నేర్చుకుని, ఆరితేరినవారే కదా! తమకు అవసరం అనుకుంటే ఈ బాపతు నేతలు అవకాశం వస్తే అదే వెన్నుపోటు విద్య బీజేపీ వారిపై ప్రయోగించరనీ చెప్పలేము.

అలాంటి బీజేపీకి ఆంధ్రప్రజానీకం గత ఎన్నికల్లో నోటా కంటే తక్కువ ఓట్లిచ్చి, వారి స్థానం ఏమిటో వారికి బాగా తెలియజెప్పారు. అయినా సరే 2024లో ఏపీలో తామే ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నట్లు ఒక మహాస్వప్నం కంటున్నారు బీజేపీ పార్టీ మహిళా నేత ఒకరు.. కానీ మతోన్మాదం, జాతీయోన్మాదం, కుహనా దేశభక్తి తెలుగు జాతి స్వభావం కాదు. మా తెలుగుతల్లికి మల్లెపూదండ అని మా తెలుగు జాతి మాతృమూర్తిని నిత్యం స్మరించుకుంటూనే ఈ నేలపై కులమతోన్మాదాలకు, హింసాపూరిత జాతీయోన్మాదానికి తావులేదు. ఈ విషయాన్ని మా సీఎం వైఎస్ జగన్ తన మంత్రివర్గ కూర్పులోనే నిరూపించారు. మా ప్రజలు 2019 ఎన్నికల్లోనూ కుల, మత ఉన్మాదాన్ని తోసిరాజన్నారు. కనుక ఈ రాష్ట్రంలో 2024లో తాము అధికారంలో రానున్నట్లు, ఇప్పుడు శాసనసభలో ఒక్క సభ్యుడు లేకున్నా, గోడలు దూకిన వారితో కలిసి ఇప్పుడే తాము ప్రధాన ప్రతిపక్షం అన్నట్లు వ్యవహరిస్తున్న బీజేపీ, వెన్నుపోటు పార్టీలోని వెన్నుపోటు దార్ల అండ చూసుకుని కలలు కనడం ఎండమావిలో దాహం తీర్చుకోవడమే! ఏమైనా వైఎస్ జగన్ తానిచ్చిన నవరత్నాల కార్యక్రమాన్ని సాగిస్తున్నంత వరకు ఆయన రైతు, మహిళా, యువత, దళిత, గిరిజన మైనారిటీలు, కష్టజీవుల ఆకాంక్షలకు అనువుగా పాలన సాగిస్తున్నంతవరకు అవినీతిరహిత పారిశ్రామికాభివృద్ధి వైపుగా, కమీషన్ల కోసం కక్కుర్తి పడకుండా రాష్ట్రాన్ని నిరంతరం సస్యశ్యామలం చేసే ప్రస్తుత దీక్షా, పట్టుదల, కృషి సాగిస్తున్నంతవరకు, వైఎస్సార్‌సీపీకీ, వైఎస్ జగన్‌కి ఓటమి ఉండదు. ఇది తథ్యం.

వ్యాసకర్త మార్క్సిస్టు విశ్లేషకులు । మొబైల్ : 98480 69720

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!




## సోషల్ మీడియా


### బీజేపీ



"కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగానే జరిగేవి – జై శ్రీరామ్ అనాలని యువతను బలవంతం చేస్తారు, అమాయకులైన అవుమాంస విక్రేతలపై గో రక్షకులు మూకదాడులకు పాల్పడతారు, కాంగ్రెస్–జేడీఎస్ ప్రభుత్వ హయంలో పెద్ద ఎత్తున ఉన్న ఉద్యోగ అవకాశాలు తగ్గిపోయి నిరుద్యోగం ప్రబలుతుంది. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుంది. సోర్స్ : ఎన్డీటీవీ, క్వింట్, వైర్"

– మహేష్ విక్రమ్ హెగ్డే, జర్నలిస్ట్

### ప్రధాని



"మాజీ ప్రధాని చంద్రశేఖర్ ఆత్మకథ ఆవిష్కరణ సందర్భంగా ప్రధాని మోదీ ప్రసంగం బావుంది. చంద్రశేఖర్ అరుదైన రాజకీయ నాయకుడు. ఒకసారి మా ఇంటికి ఆయన భోజనానికి వచ్చారు. అక్కడ రచయితలు, చిత్రకారులు, నటులు, జర్నలిస్టులతో గంటల తరబడి మాట్లాడుతూ గడిపారు. అలా వ్యవహ రించే ప్రధానులు అరుదు"

– ప్రీతిష్ నంది, జర్నలిస్ట్

### 23 ఏళ్లు



"నేరం ఏమీ చేయలేదంటూ 23 ఏళ్ల తరువాత అలీ మహమ్మద్ భట్‌ను విడుదల చేశారు. శ్రీనగర్ చేరుకోగానే అతడు తన తండ్రి సమాధిని దర్శించుకున్నాడు. అక్కడే కుప్పకూలి కన్నీరు మున్నీరు అయ్యాడు. ఇంతకంటే హృదయవిదారకమైన దృశ్యం ఏముంటుంది? భట్ నీ కోసం కశ్మీర్ అంతా ఏకం అవుతోంది"

– సాఖ్విబ్ ముగ్లూ, జర్నలిస్ట్

### ప్రదర్శన



"మూకదాడులకు ప్రేరేపించేలా వీడియోను రూపొందించిన వారిపై ఐపీసీ 153(ఎ), 295(ఎ) కింద ఫిర్యాదు నమోదు చేయాలి. లేకపోతే ప్రధాని నరేంద్ర మోదీ ఇంటి ఎదుట ఈ వీడియోను ప్రదర్శిస్తూ నిరసన తెలియజేస్తా"

– తహ్సీన్ పూనావాలా, వ్యాపారవేత్త

### పెట్టుబడి



"బీజేపీ డబ్బు పవిత్రమైంది, బీజేపీ బెదిరింపులు పవిత్రమైనవి, బీజేపీ అవినీతి కూడా పవిత్రమైనదే. బీజేపీ చేసే గాడిదల అమ్మకాలు కొనుగోలు వ్యాపారం పవిత్రం. పవిత్రమైన పద్ధతిలోనే బీజేపీ కర్ణాటకలోని అపవిత్రమైన కూటమిని చీల్చింది. ప్రభుత్వాన్ని కూల్చివేసింది. ఇంతకీ బీజేపీ కొనుగోలు చేసిన కర్ణాటక ఎమ్మెల్యేలకు ఏవిధంగా డబ్బులు చెల్లించబోతోంది? సూట్ కేసుల్లోనా లేక ఎర్రని బట్ట చుట్టిన బాహీ ఖట్టాలోనా? అక్రమ మార్గంలోనా లేక వారి 'పవిత్ర'మైన మార్గంలోనా? తెలుసుకునే హక్కు ప్రజలందరికీ ఉంది. ఎందుకంటే, అదంతా మా పెట్టుబడే కదా!"

– సంఘమిత్ర, రచయిత్రి

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, తిథి బ.అష్టమి ప.2.48 వరకు, తదుపరి నవమి, నక్షత్రం అశ్వని ప.2.44 వరకు, తదుపరి భరణి, వర్జ్యం, ఉ.10.06 నుంచి 11.50 వరకు, తిరిగి రా.12.30 నుంచి 2.11 వరకు, దుర్ముహూర్తం ఉ.9.56 నుంచి 10.48 వరకు, తదుపరి ప.3.05, నుంచి 3.56 వరకు, అమృతఘడియలు... ఉ.6.40 నుంచి 8.01 వరకు.

సూర్యోదయం : 5.40
సూర్యాస్తమయం: 6.32
రాహుకాలం : ప. 1.30 నుంచి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుంచి 7.30 వరకు

# పదవీ విరమణ వయస్సు పెంచరూ?

తెలంగాణలో సుదీర్ఘ కాలంగా పెండింగులో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు పెంపు అంశాన్ని సత్వరమే తేల్చాలని ఉద్యోగులు కోరుతున్నారు. దేశంలోని మెజారిటీ (23) రాష్ట్రాల్లోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వయస్సును 60 ఏళ్లుగా నిర్ణయించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలోని 4వ తరగతి ఉద్యోగుల పదవీవిరమణ వయస్సును కూడా 60 ఏళ్లుగా నిర్ణయించారు. వృత్తివిద్య అధ్యాపకులది 65 ఏళ్లుగా నిర్ణయించారు. కాగా రాష్ట్రంలో మిగిలిన అందరు ఉద్యోగుల వయోపరిమితి పెంపు విషయంలో తీవ్రమైన తాత్సారం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో టీఆరెస్, కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, సీపీఐతో సహా అన్ని రాజకీయ పక్షాలూ తమ మేనిఫెస్టోల్లో ఉద్యోగుల పదవీవిరమణ వయసు పెంపును పొందుపర్చడం తెలిసిందే. కానీ రెండో దఫా అధికారం చేపట్టిన టీఆర్ఎస్ మాత్రం ఇప్పటికీ జాప్యం చేస్తుండటం విచారకరం. ఫిబ్రవరి 22న తెలంగాణ అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ఈ విషయమై ప్రకటన చేసినప్పటికీ నేటికీ ఇది అమలు కాలేదు. ముఖ్యమంత్రి ఇచ్చిన మాటకు కట్టుబడి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 61 ఏళ్లకు పెంచుతూ సత్వరం ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతున్నాం.

పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో మధ్యంతర భృతి విషయంలో నూతన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉద్యోగుల డిమాండును మన్నిస్తూ 27 శాతం ఐఆర్‌ను ప్రకటించారు. ఇక ఏపీలో 2014 నుంచే ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 సంవత్సరాలుగా నిర్ణయించి అమలు చేస్తూవస్తున్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో, తర్వాత కొత్త అసెంబ్లీలో తెలంగాణ ముఖ్యమంత్రి హామీ ఇచ్చి కూడా అమలు చేయకపోవడంపై ప్రభుత్వోద్యోగుల్లో తీరని అసంతృప్తి రగులుతోంది.

ఉద్యోగ విరమణ వయస్సు పెంపును ఇచ్చిన హామీ మేరకు 61 సంవత్సరాలకు పెంచుతూ ఇతర ఆర్థిక ప్రయోజనాలను 33 సంవత్సరాల సర్వీసు పూర్తయ్యే వరకు మాత్రమే పరిమితం చేయాల్సిన అవసరం ఉంది. పాలనా సంస్కరణల్లో భాగంగా పూర్తి పెన్షన్‌కు అర్హతకుగానూ పూర్తి చేసిన 33 ఏళ్ల సర్వీసు పైబడిన కాలానికి ఏ విధమైన ఇంక్రిమెంట్లుగానీ, ఇతర ఆర్థిక ప్రయోజనాలుగానీ వర్తింపజేయరాదు. ఇలా చేస్తే 1992–2000 సంవత్సరాల మధ్యన పోటీ పరీక్షల ద్వారా నియామకమై కనీసం 20 ఏళ్ల సర్వీసు పూర్తికాక ముందే రిటైరవుతున్న వారికి ప్రయోజనకరంగా ఉంటుంది.

ప్రభాకరరావు ఇతర సామాజిక కార్యకర్తలు, చొప్పదండి, కరీంనగర్

# అంతరిక్ష చట్టం అత్యవసరం

సందర్భం



డా॥ వి. బాలకిష్టారెడ్డి

మూడు దశాబ్దాలుగా ప్రభుత్వాలు నిధులు తగ్గించడంతో ప్రపంచ వ్యాప్తంగా అంతరిక్ష పరిశోధనలు సాగిస్తున్న అనేక దేశాలు ఇతర అంతరిక్ష కార్యకలాపాలపై దృష్టిసారించాయి. దీంతో ప్రభుత్వాలు, ప్రైవేట్ పరిశ్రమలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఏర్పడింది. ఈ కారణంగా ఉపగ్రహ సమాచారం, చోదన, భౌగోళిక పరిస్థితి, సుదూర గ్రాహకత, సమాచార విశ్లేషణ, మౌలికవసతులు, సంబంధిత సేవలు సుగమం అయ్యాయి. ఇటువంటి కార్యకలాపాలకు నిధుల సమకూర్చడం భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు తలకుమించిన భారం. దాంతో అంతరిక్ష కార్యకలాపాలను ప్రైవేటీకరించడంపై దృష్టి సారించారు. దేశాభివృద్ధిలో అంతరిక్ష పరిశోధనలు కీలకపాత్ర పోషిస్తున్నందున రెండు దశాబ్దాలుగా పరస్పరం ఇచ్చిపుచ్చుకునే పద్ధతిలో భారత అంతరిక్ష కార్యక్రమం, పరిశ్రమ నిర్మాణం సాగింది. దీనికి ప్రైవేట్ సెక్టార్ నుంచి తగిన మద్దతు కూడా లభించింది.

ప్రైవేట్ భాగస్వామ్యంతో అంతరిక్ష ప్రయోగ కార్యకలాపాలు ఊపందుకున్నాయి. కేబుల్, శాటిలైట్ టెలివిజన్ రంగాల్లో భారత్‌లో విస్తృతమైన మార్కెట్ ఉంది. దూరదర్శన్ తన డీటీహెచ్ ప్రసారాలను ప్రారంభించింది. డీటీహెచ్, డీటీటీ, బ్రాడ్ బాండ్ వంటి సాంకేతికతలు దేశాన్ని ముంచెత్తాయి. అంతరిక్ష కార్యకలాపాలు ప్రైవేటీకరణ, వ్యాపారీకరణ పొందిన నేపథ్యంలో అభివృద్ధి చెందిన దేశాలన్నీ జాతీయ అంతరిక్ష చట్టాలను రూపొందించాయి. ప్రైవేట్ అంతరిక్ష కార్యకలాపాలకు లైసెన్స్‌లు ఇవ్వడం, క్లిష్టమైన అంతరిక్ష కార్యకలాపాలపై ఈ చట్టాలు రూపొందాయి. అయితే, సరైన చట్టాలు లేని కారణంగా అంతరిక్ష సాంకేతికతకు పెట్టుబడులను రాబట్టే అనేక అవకాశాలను భారత్ కోల్పోవడం విచారకరం.

చంద్రయాన్‌–2తోపాటు గతంలో విజయవంతమైన అనేక అంతరిక్ష కార్యకలాపాలతో భారత సాంకేతిక సామర్థ్యం ప్రపంచ దేశాలకు తెలిసి వచ్చింది. ఉపగ్రహాలను ప్రయోగించడం, వాటిని స్వతంత్రంగా నిర్వహించగల దేశాల బృందంలో భారత్ కు చోటు దక్కింది. ప్రస్తుతం భారత్ అంతరిక్ష సాంకేతికతలో స్వావలంబనను సాధించడమే కాదు, వ్యాపారాత్మకత వినియోగికతను కూడా పెంచుకుంది. సంవత్సరాల తరబడి సాధించిన నైపుణ్యంతో అంతరిక్ష పరిశ్రమలో భారత్ గ్లోబల్ లీడర్ ఎదగనుంది. ఒప్పందాలను పూర్తిచేయడం, వివాదాల పరిష్కారం వంటి చట్టపరమైన అంశాలను భారత్ అత్యవసరంగా అధిగమించాల్సి ఉంది.

ఒకవైపు అంతరిక్ష కార్యకలాపాల్లో ప్రైవేట్ సెక్టార్‌కు విస్తృతంగా అవకాశాలు కల్పిస్తున్న దేశాలన్నీ, మరోవైపు అంతర్జాతీయ అంతరిక్ష చట్టం పరిధుల్లో దేశంలోని ప్రైవేట్ సంస్థల అతరిక్ష కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నాయి. భారత్ కూడా ప్రైవేట్ సెక్టార్ భాగస్వామ్యంతోనే అంతరిక్ష కార్యకలాపాల్లో దూసుకెళ్తోంది. చంద్రయాన్‌–1, 2 ప్రయోగాల్లో సుమారు 500మంది పారిశ్రామిక ప్రతినిధులు భాగస్వామ్యం వహించారు. వారి భాగస్వామ్యం లేనట్లయితే మానవ వనరులను సమకూర్చుకోవడం ఇస్రోకు సాధ్యమయ్యేది కాదు. అంతరిక్ష కార్యకలాపాలపై సరైన చట్టం లేనట్లయితే ప్రైవేట్ పెట్టుబడిదారులెవరూ ముందుకు రారు. దీన్ని దృష్టిలో పెట్టుకునే సాంకేతిక రంగంలో ముందడుగు వేస్తున్నఅనేక దేశాలు ప్రైవేట్ సెక్టార్ చేపట్టే క్లిష్టమైన అంతరిక్ష కార్యకలాపాలపై వివరణాత్మకమైన, ప్రత్యేకమైన జాతీయ అంతరిక్ష చట్టాలను రూపొందించుకున్నాయి. వీటిల్లో అమెరికా, ఇంగ్లండ్, రష్యా, స్వీడన్, ఆస్ట్రేలియా వంటి దేశాలు ఉన్నాయి. అన్ని అంతర్జాతీయ అంతరిక్ష ఒప్పందాల్లో భారత్‌కు భాగస్వామ్యం ఉంది. అంతర్జాతీయ అంతరిక్ష చట్టం రూపకల్పనలో భారత్ పాత్ర కీలకమైనది. అయితే, భారత దేశంలో మాత్రం ఎటువంటి స్పష్టమైన, సమగ్రమైన అంతరిక్ష చట్టం లేదు.


అంతరిక్ష చట్టం రూపకల్పనలో అంతరిక్ష విభాగపు పాత్రను స్పష్టంగా పేర్కొనాలి. అలాగే, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల పాత్ర, అంతరిక్ష కార్యకలాపాలను చేపట్టడం, అమలు చేసే విధానం, అంతరిక్ష పరిశ్రమలో మానవ వనరుల వినియోగం, వారి ఆర్థిక ప్రయోజనాలు, వేతనాలు, ప్రయోగ దశలో రక్షణ కల్పించడం, అంతరిక్ష వివాదాలు, వ్యోమగాములను సురక్షితంగా భూమికి తీసుకురావడం, దేశీయ గగనతలంలో విదేశీ అంతరిక్ష వాహకాలు ప్రయాణించడం, జవాబుదారీతనం, బీమా, మేధోపరమైన హక్కుల రక్షణ వీటన్నిటితోపాటు వివిధ ఒప్పందాల కింద అంతర్జాతీయ బాధ్యతలను అమలుచేయడం వంటి అంశాలను చేర్చాల్సి ఉంది.

వ్యాసకర్త రిజిస్ట్రార్, నల్సార్ యూనివర్సిటీ
ఈ–మెయిల్ : balakista@gmail.com

# సృజనాత్మకత

నూతన ఆలోచనలతో వినూత్న ఆవిష్కరణలు చేస్తుంటారు సృజనాత్మకత మెండుగా కలవారు. అగ్గిపుల్ల నుండి టెలివిజన్ వరకు మానవ సృజనకు తార్కాణాలే. మేధావుల కృషికి నిదర్శనాలు. ఆపిల్ కింద పడితే కొరికి మింగేవాడు సాధారణ మానవుడైతే, భూమ్యాకర్షణ శక్తిని నిరూపించేవాడు సృజనాత్మక శక్తి ఉన్న న్యూటన్. లక్షల్లో ప్రయోగాలు, పరిశోధనలతో నూతన ఆవిష్కరణలకు స్వీకారం చుట్టిన సృజనకారుల శ్రమ ఫలితమే నేటి మానవుల సుఖమయ జీవనం.

మానవ మేధతో సృజించిన వస్తువుల కంటే భగవంతుడి సృజన మరీ గొప్పది. ప్రతి వస్తువు, పదార్థం ప్రత్యేకంగా కన్పించి అబ్బుర పరుస్తాయి. మనుషులు, జంతువులు, పక్షులు, అడవులు, కొండలు, లోయలు, నదులు, జలపాతాలు వేటికవే అందంగా కనిపించి ఆశ్చర్యపరుస్తాయి. ఏడు వందల కోట్ల జనాభాలో మనిషిని పోలిన మనుషులు ఏడుగురుని మాత్రమే సృష్టించిన దేవదేవుడి అద్భుత సృజనకు కొలబద్దలే లేవు. నూతనత్వం లోపించిన జీవితం గానుగెద్దుని తలపిస్తుంది. జీవితం మీద ఆసక్తి లోపిస్తే విరక్తి జనిస్తుంది. పిల్లలు ఆడుకునే బొమ్మలనే తరచూ మారుస్తుంటారు. పాతబొమ్మల మీద మోజు తీరగానే కొత్తవి కొనమని మారాం చేస్తారు. మానవుడి ఆలోచన బాల్యం నుండే నూతన ఆలోచనలు, ఆవిష్కరణల కోసం పరితపిస్తుందనడానికి, నూతన ప్రక్రియల సృష్టి, వినూత్న వస్తువుల ఉత్పత్తికై తహతహలాడుతుందనడానికి ఉదాహరణలు కోకొల్లలు. సృజనకు ప్రాణం పోసే సృష్టి మీదనే నిరంతర ఆరాటం కనబరుస్తాడు.




లోకంలో చాలా మంది మూస ధోరణిలో ఆలోచిస్తూ విఫలమవుతుంటారు. పాత పరీక్షా పత్రాల జవాబులు చదివి పరీక్షల్లో విఫలమయిన వాళ్ళలా. ఇతరులు నడిచిన బాట సాఫీగా ఉందని, ఆ మార్గంలోనే ప్రయాణిస్తే సుఖమని కొందరు భావించగా, మార్గంలో ఎదురయ్యే రాళ్లూరప్పలని తొలగించి తామే ఒక మార్గం నిర్మిస్తారు సృజనకారులు. ఆ ప్రయత్నంలో కష్టం, శ్రమ ఉన్నప్పటికీ శాశ్వత కీర్తి లభిస్తుంది. కుడి బొటనవేలును గురుదక్షిణగా ద్రోణాచార్యుడికి సమర్పించిన ఏకలవ్యుడు విలువిద్యను వీడలేదు. ఎడమచేతితో బాణం సంధిస్తూ, జరాసంధుడి పక్షాన అనేక యుద్ధాలలో పాల్గొన్నాడు. సృజనకు హద్దులు లేవనడానికి ఇదొక నిదర్శనం.

కొనగోటితో నఖ చిత్రాలు, సముద్ర తీరపు ఇసుకలో సైకత శిల్పాలు, బియ్యపు గింజపై రామకోటి చిత్రించేవారు సృజనకారులే. ఆటల్లో, పాటల్లో, నృత్యాల్లో ఒకటేమిటి సకల కళల్లో కొత్త గణాంకాలు నమోదుకై నిరంతరం శ్రమించే మహానుభావులు ఉన్నారు. వారి సృజనకు ఆకాశమంత ఆదరణ ఎల్లప్పుడూ ఎదురు చూస్తుంది.

– నారంశెట్టి ఉమామహేశ్వరరావు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

టోల్ ఫ్రీ నం: 1800 270 1083

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
గురువారం ॥ 25-7-2019


జ్ఞాపకశక్తి కోల్పోయా సినిమా పేజీలో...


నేను మారిపోయాను! సినిమా పేజీలో...



# జీవితం లేని అవ్వా తాత

**పిల్లలు పుడితే పుణ్యం అంటారు. కానీ పిల్లలకు మాత్రం పెద్దలు పుణ్యానికి వచ్చినట్టే అనిపిస్తుంది. జీతం ఇవ్వకుండా జీవితమంతా వాడుకోవచ్చనుకుంటారు. అయినా పెద్దలు బాధ పడరు. ఆ సేవలో కూడా పునీతులవుతారు. అప్పటికీ వారిని కసురుకుంటే... కించపరిస్తే.. అవమానపరిస్తే... ఆ గోడు ఎక్కడ చెప్పకోవాలి? పిల్లలు మారాలి... కథను మార్చాలి.**

వేణుగోపాల స్వామి ఆలయం ప్రశాంతంగా ఉంది.

చిన్న గుడి అది. కాని ప్రాంగణం విశాలంగా ఉండటం వల్ల రకరకాల చెట్లు బాగా ఎదిగి చల్లటి నీడనే కాదు కొమ్మలను ఊపుతూ గాలిని ప్రసరింప చేస్తూ ఉండటం వల్ల వచ్చినవారికి మనసుకు ప్రశాంతత కలుగుతోంది.

భాస్కరరావు, విజయమ్మ ఒక చెట్టు కింద అమర్చిన చుట్టు అరుగు మీద కూచున్నారు.

ఉదయం తొమ్మిది, తొమ్మిదిన్నర అయి ఉంటుంది.

వారి పక్కన చిన్న సంచి ఉంది. అందులో వారి బట్టలు ఉన్నాయి.

'అమ్మాయితో చెప్పి వెళితే బాగుంటుందేమో' అంది విజయమ్మ.

'వద్దులే. కాల్ చేస్తుంది కదా. అప్పుడు చెప్దాం' అన్నాడు భాస్కరరావు.

'ఎన్నింటికి బస్?'

'మధ్యాహ్నం రెండు గంటలకు'

'ఇన్నాళ్లకు బయటపడ్డాం. రాత్రి బస్సుకు వెళదామండీ. కాస్త అలా ఊరంతా తిరుగుదాం. బయట తిందాం. ఇప్పటికిప్పుడు మన ఊరికి వెళ్లి చేసేది ఏముంది కనుక' అంది విజయమ్మ.

భాస్కరరావు భారంగా తల ఊపాడు.

ఇద్దరికీ మనవడు గుర్తుకొచ్చాడు.

'వాడు స్కూల్ నుంచి రాగానే తాళం ఇచ్చి విషయం చెప్పమని పక్కింటి వాళ్లకు చెప్పావా లేదా?' అడిగాడు భాస్కరరావు.

'ఇది మీరు వందోసారి అడగడం. వాళ్లకు వంద సార్లు చెప్పాను. వాడు వచ్చాక తినడానికి కొంచెం చికెన్ ఫ్రై కూడా చేసి పెట్టాను'

ఇద్దరూ లేచారు.

లోపల వేణుగోపాలస్వామి విగ్రహం మౌనంగా పూజలు అందుకుంటూ ఉంది.

స్వామికి కూతురు, అల్లుడు, మనవడు ఉండి ఆ ముగ్గురి పనుల్లో స్వామి ఉండవలసి ఉంటే స్వామి ఏం చేసి ఉండేవాడో.

వీళ్లు మాత్రం ప్రస్తుతానికి ఊరు బయల్దేరారు.

***

సాయంత్రం అయిదైంది.

స్కూల్ నుంచి బబ్లూ, ఆఫీస్ నుంచి రవళి దాదాపు ఒకేసారి ఇల్లు చేరారు. ఇవాళ రవళికెందుకో లోలోపల అలజడిగా అనిపించింది. అందుకే త్వరగా ఇల్లు చేరింది.

'మీ అమ్మ తాళం ఇచ్చి వెళ్లింది. ఊరు వెళుతున్నామని చెప్పింది' అని పక్కింటి వాళ్లు వచ్చి చెప్పారు.

రవళి అయోమయంగా చూసింది.

'అదేంటి.. అమ్మమ్మ, తాతయ్య మనకు చెప్పకుండా ఎలా వెళతారు' అన్నాడు బబ్లూ.

ఇద్దరూ కంగారుగా ఇంట్లోకొచ్చి ఫోన్ కలిపారు.

విజయమ్మ ఎత్తింది.

'అమ్మా.. ఎక్కడ ఉన్నారు?' కంగారుగా అడిగింది రవళి.

'ట్యాంక్ బండ్ మీద ఉన్నాం. రాత్రికి భోజనం చేసుకుని బస్సెక్కుతున్నాం'

'అమ్మా.. ఏం మాట్లాడుతున్నావు. సడన్‌గా ఊరెళ్లడం ఏంటి? బబ్లూ ఏడుస్తున్నాడు'

'ఎందుకు ఏడవడం. వాడేమైనా చిన్న పిల్లాడా. మళ్లీ వస్తాంలే ఒక మూడు నెల్లకో ఆరునెల్లకో. నువ్వు జాగ్రత్తగా పిల్లాణ్ణి చూసుకో. మేం అక్కడ ఉన్నా మా మనసంతా ఇక్కడే ఉంటుంది'

'అమ్మా.. ఏమిటి ఈ శిక్ష. నువ్వెక్కడున్నావ్ చెప్పు'

'ఎందుకమ్మా. మేం వెళతాంలే. ఊరు చేరాక ఫోన్ చేస్తాం' అని పెట్టేసింది.


రవళి వెంటనే భర్త శ్రీకర్‌కు ఫోన్ చేసింది. అతడు ఆఘమేఘాల మీద ఇల్లు చేరాడు. శ్రీకర్, రవళి, బబ్లూ కలిసి నేరుగా బస్టాండ్‌కు చేరుకున్నారు. అక్కడే కాపు కాచి భాస్కరరావును, విజయమ్మను ఇంటికి తీసుకొచ్చారు.

ఆ గండం అప్పటికి గడిచింది.

కాని వాళ్లు మాత్రం ఊరుకు వెళ్లాల్సిందే అని భీష్మించుకుని కూచున్నారు.

'సరే.. వెళ్దురు... ఒక్కసారి మా ఫ్రెండ్‌తో మాట్లాడి వెళ్లండి. నేనే మిమ్మల్ని బస్ ఎక్కిస్తాను' అంది రవళి.

అలా వాళ్లను సైకియాట్రిస్ట్ దగ్గరకు తీసుకొచ్చింది కౌన్సెలింగ్ కోసం.



**'చూడండి. అమ్మా నాన్నలు మన అక్కర చూసేవాళ్లే తప్ప పని వాళ్లు కాదు. బానిసలు అంతకన్నా కాదు. మీ అవసరానికి వాళ్లను తెచ్చుకున్నారు తప్పితే వారి అవసరానికి వారు మీ దగ్గర వచ్చి ఉండలేదు. మీ అవసరానికి వాళ్లను వాడుకుంటూ పైగా విసుక్కుంటూ చిరాకు పడుతుంటే ఎవరు మాత్రం ఉంటారు. అసలు విచిత్రం చూడండి. పెళ్లిళ్లయ్యి సంపాదన మొదలయ్యాక మీరు వారిని కూచోబెట్టి చూసుకోవాలి. కాని కచ్చితంగా అప్పటి నుంచే వారితో ఎక్కువ చాకిరి చేయించడం మొదలుపెడతారు.**

***

లేడీ సైకియాట్రిస్ట్ ఎదురుగా వాళ్లిద్దరూ కూచున్నారు. వృద్ధదంపతులు. భాస్కరరావుకు 70 ఏళ్లు ఉంటాయి. విజయమ్మకు 65. మొదట విజయమ్మే మాట్లాడింది.

'మాది వ్యవసాయ కుటుంబం డాక్టర్. ఊళ్లో పొలాలు పనులు ఉన్నాయి. ఒక్కగానొక్క కూతురు. బాగా చదివించాం. పెద్ద సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయ్యింది. అల్లుడు కూడా సాఫ్ట్‌వేర్ ఇంజనీరే. ఇద్దరూ ఉద్యోగం చేయడం ముఖ్యం అనుకున్నారు. మంచిదే. కాని ఉద్యోగమే జీవితం అనుకున్నారు. బాబు పుడితే వాడి కోసమైనా ఎవరూ పని తగ్గించుకోలేదు. ఒక నెల ఆమె అమెరికా వెళితే ఒక నెల అతను అమెరికా వెళతాడు. మరి బాబును ఎవరు చూసుకుంటారు. అందుకే ఉన్న పొలాన్ని కౌలుకు ఇచ్చేలా చేసి నన్ను, మా వారిని తీసుకొచ్చి ఇంట్లో పెట్టుకుంది. మనవడి పనులు చూడటం ఏ అమ్మమ్మ, తాతయ్యలకు ఆనందం ఇవ్వదు చెప్పండి. వాడి పనుల్లో పడ్డాం. గమ్మత్తేమిటంటే ఇన్నాళ్లు ఊళ్లో ఉండి సంసారం ఈదాను. ఇక్కడికొచ్చాక కూడా సంసారాన్ని ఈదాల్సి వచ్చింది. నా కూతురు, అల్లుడు, మావారు అందరూ నా మీద ఆధారపడ్డవాళ్లే. నేనే ఆ ఇంటికి ఆడదిక్కు. మా మనవడు వాడి అమ్మానాన్నల కంటే మమ్మల్నే అమ్మా నాన్నలు అనుకునేంతగా అటాచ్‌మెంట్ పెట్టుకున్నాడు. పన్నెండేళ్లు అయిపోయాయి. ఇప్పుడు నాకు ఓపిక లేదు. ఉదయాన్నే లేచి కూతురికి అల్లుడికి ఏర్పాట్లు చేయలేకపోతున్నాను ఎంత పని మనిషి ఉన్నా. పిల్లాడికి కావలసిన పనులు కూడా చేయలేకపోతున్నాను. మునుపటి హుషారు లేదు. కాసేపు పడుకుని ఉండాలనిపిస్తోంది. అది చూసి నా కూతురు నన్ను కసురుతోంది. విసుక్కుంటోంది. తన పని కావట్లేదని తన బాధ. నా వైపు నుంచి అసలు మమ్మల్ని అర్థం చేసుకోవడం లేదు. మా అల్లుడు మంచివాడే కాని ఇవన్నీ పట్టించుకోవాలి కదా' అందామె.

'ఇవన్నీ ఎందుకమ్మా. మా చివరి రోజులేవో విశ్రాంతిగా ఊళ్లోనే బతకాలని ఉంది' అన్నాడు భాస్కరరావు.

సైకియాట్రిస్ట్ వాళ్లను బయట కూచోబెట్టి రవళిని, రవళి భర్త శ్రీకర్‌ని లోపలికి పిలిచింది.

***

'చూడండి. అమ్మా నాన్నలు మన అక్కర చూసేవాళ్లే తప్ప పనివాళ్లు కాదు. బానిసలు అంతకన్నా కాదు. మీ అవసరానికి వాళ్లను తెచ్చుకున్నారు తప్పితే వారి అవసరానికి వారు మీ దగ్గర వచ్చి ఉండలేదు. మీ అవసరానికి వాళ్లను వాడుకుంటూ పైగా విసుక్కుంటూ చిరాకు పడుతుంటే ఎవరు మాత్రం ఉంటారు. అసలు విచిత్రం చూడండి. పెళ్లిళ్లయ్యి సంపాదన మొదలయ్యాక మీరు వారిని కూచోబెట్టి చూసుకోవాలి. కాని కచ్చితంగా అప్పటి నుంచే వారితో ఎక్కువ చాకిరి చేయించడం మొదలుపెడతారు. ఇన్నాళ్లు వాళ్లు మీ దగ్గర ఉన్నారు. వాస్తవానికి ఇప్పుడే వారు మీ దగ్గర ఉండటం ప్రారంభించాలి. ఇకమీదట వారి ఆరోగ్య సమస్యలు, అవసరాలు మీరే చూసుకోవాలి. అయినప్పటికీ రిస్క్ తీసుకొని మరీ ఊరు వెళ్లిపోవాలని నిర్ణయం తీసుకున్నారంటే మీ ప్రవర్తన వారిని ఎంత బాధించి ఉంటుందో ఆలోచించండి' అంది సైకియాట్రిస్ట్.

రవళికి కళ్ళు ఎర్రబడ్డాయి. శ్రీకర్ తల దించుకున్నాడు.

***

ఆ రాత్రి భోజనాలయ్యాక రవళి వచ్చి తల్లి దగ్గర కూచుంది. తండ్రి మౌనంగా చూస్తూ ఉన్నాడు.

'అమ్మా.. సారీ. నా గొడవలో పడి నీ సంగతి నాన్న సంగతి పట్టించుకోలేదు. అంతెందుకు... కడుపున పుట్టిన నా కొడుకు సంగతి కూడా పట్టించుకోలేదు. మీరే లేకుండా ఉంటే నా కెరీర్ ఏమై పోయి ఉండేది. డబ్బు ఉండాలి మంచిదే కాని డబ్బు మాత్రమే మిగిలి ఇంకెవరూ లేకుండా పోవడం కంటే పాపిష్టి జీవితం మరొకటి ఉండదు. ఇక సంపాదించింది చాలు. అందరం హాయిగా ఉందాం. ఇన్నాళ్లు మిమ్మల్ని నా కోసం ఉంచుకున్నాను. ఇప్పుడు మీ కోసం ఉంచుకుంటాను. మీ అవసరాలన్నీ చూడాల్సిన సమయం ఇది. ఇక ఊరి మాట ఎత్తకండి. నన్ను క్షమించండి' అని నీళ్లు కారుతున్న కళ్లతో మెల్లగా తల్లి చేయి పట్టుకుంది.

ఏ తల్లి తన బిడ్డను క్షమించకుండా ఉండదు?

'ఊరుకో తల్లి.. అలాగేలే' అని కూతురును దగ్గరకు తీసుకుంది, భాస్కరరావు చెమర్చిన కళ్లతో చూస్తూ ఉండగా.

***

బబ్లూ ఇప్పుడు కూడా స్కూల్ నుంచి అదే సమయానికి వస్తున్నాడు.

కాని స్నాక్స్ చేసి రవళి రెడీగా ఉంటోంది.

తను వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తోంది. వీలైనప్పుడు చేసే పనినే వెతుక్కుంటోంది.

సాయంత్రం పూట విజయమ్మ, భాస్కరరావు కబుర్లు చెప్పుకుంటూ వాకింగ్‌కి వెళుతున్నారు.

శ్రీకర్ బిగ్‌బాస్ రిలే సమయానికి ఇల్లు చేరి సందడి చేస్తున్నాడని వేరే చెప్పాలా?

– కథనం: **సాక్షి ఫ్యామిలీ**
ఇన్‌పుట్స్: **డా. పద్మ పాల్వాయి,** సైకియాట్రిస్ట్

అతడామె!

# జెస్ట్ చేంజ్!

**పురుషుడు లింగమార్పిడితో మహిళగా మారడం ఇప్పుడు అంత కష్టం కాదు. కానీ సమాజం ఆమోదించడమే అరుదైన విషయం. జెండర్ మారిన విషయాన్ని అధికారికంగా ధ్రువీకరించుకోవడం అంత సులభం కాదు. కావాలంటే సోనియా పాండే అనే ఈ యువతిని అడగండి.**


● రాజేశ్ పాండే

కొద్ది రోజుల క్రితం వరకు రాజేశ్ అనే యువకుడిగా ఉండేవాడు. ఇప్పుడు సోనియాగా మారిపోయాడు. ఎందుకిలా మారిపోయావని అడిగితే ఆత్మ తనదికాని శరీరంలో ప్రవేశపెట్టినంత ఇబ్బందిగా ఉండటంతో 'చేంజ్' కోరుకున్నానని జవాబిస్తాడు. మనది కాని శరీరంలో ఆత్మ ఉండటం ఎంత కష్టమో అనుభవించానని ఇకనైనా సోనియా పాండేగా తనను గుర్తించమని అడుగుతోంది. కాదు పోరాడుతోంది. ఎందుకంటే ఆమె పనిచేస్తున్న ఇండియన్ రైల్వే సోనియాను అతడిగానే కొనసాగి(చూ)స్తోంది. ఆమెగా మార్చమన్న అభ్యర్థనను ఆమోదించకుండా నిబంధనల పేరుతో మోకాలడ్డుతోంది.

అధికారిక పత్రాల్లో తనపేరు, జెండర్ మార్చాలని గోరఖ్‌పూర్‌లోని నార్త్ ఈస్ట్రన్ రైల్వే(ఎన్‌ఈఆర్) జీఎం కార్యాలయం చుట్టూ సోనియా తిరుగుతోంది. రైల్వే చరిత్రలో ఇలాంటి అభ్యర్థన ఎప్పుడూ రాకపోవడంతో ఏం చేయాలో తోచక ఉన్నతాధికారులు తలలు పట్టుకుంటున్నారు


● సోనియా పాండే

**వీడిన చిక్కు 'ముడి'**

నలుగురు అక్కాచెల్లెళ్ల నడుమ అల్లారు ముద్దుగా పెరిగిన రాజేశ్ పాండే 2003లో తండ్రి చనిపోవడంతో డిపెండెంట్ ఉద్యోగం దక్కడంతో ఇజ్జత్‌నగర్ రైల్వే వర్క్‌షాప్‌లో గ్రేడ్–1 టెక్నీషియన్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించాడు. చిన్నతనం నుంచే అమ్మాయిగా మారాలన్న కోరికతో పెరిగిన రాజేశ్ 2017లో లింగమార్పిడి చేయించుకుని సోనియా పాండేగా రూపాంతరం చెందాడు. ఆపరేషన్ చేయించుకోవడానికి ముందే స్థానిక యువతితో అతడికి వివాహం జరిగింది. 'అసలు సంగతి' బయట పడటంతో వీరి వివాహ బంధం అట్టే కాలం నిలవలేదు. మగాడి దేహంలో ఇమడలేక సతమతం అవుతున్నానని, మగడిగా ఉండటం తనకు ఇష్టం లేదని భార్య దగ్గర రాజేశ్ ఓపెన్ అయ్యాడు. భర్త బాధను అర్థం చేసుకున్న ఆమె విడాకులు తీసుకుని మౌనంగా అతడి జీవితం నుంచి నిష్క్రమించింది. చిక్కు 'ముడి' విడిపోవడంతో లింగమార్పిడి చేయించుకుని ఆమెగా అవతరించాడు. మహిళగా మారిన తర్వాత తనకు నచ్చిన జీవితం గడుపుతూ 'గుర్తింపు' కోరుకుంటున్నాడు. అందరి మహిళల్లానే సోనియా పాండే బాగా ముస్తాబవుతుంది. చక్కగా చీర కట్టుకుని, ఫుల్‌మేకప్‌తో ఆఫీసుకు వెళ్లే సోనియాను చూసి, అంతకుముందు ఆమె కాదు అతడంటే నమ్మడం ఎవరికైనా కష్టమే.

**పోరాటానికి సిద్ధం**

సోని(న)యా రూపాన్ని కుటుంబ సభ్యులే కాదు ఆమె ఉద్యోగం చేస్తున్న రైల్వే బోర్డు కూడా గుర్తించ నిరాకరిస్తోంది. ఆమెగా గుర్తించాలని సోనియా అభ్యర్థనను అలకించడం లేదు. ''న్యూ జెండర్ ఐడెంటిటీని గుర్తించకపోవడం చాలా బాధగా ఉంది. ఐడీ కార్డు, ఇతర పత్రాల్లో ఇంకా రాజేశ్‌గా కొనసాగించడాన్ని జీర్ణించుకోలేపోతున్నాను. లింగ మార్పిడి, పేరు మార్పిడితో నన్ను గుర్తించాలని రైల్వే అధికారులను వేడుకుంటున్నాను. అధికారిక పత్రాల్లో ఆమెగా నమోదు చేయాలని కోరుకుంటున్నాను. కొత్త రూపంతో నన్ను గుర్తించేందుకు అవసరమైతే రైల్వే బోర్డుతో పోరాటానికి వెనుకాడబోను' 'అని సోనియా స్పష్టం చేసింది.

**– పోడూరి నాగ శ్రీనివాసరావు,** సాక్షి వెబ్‌డెస్క్

సావధానం

# అక్షర క్రీడలో అజేయుడు

**ఆంగ్ల మాధ్యమంలో విద్య అభ్యసించాడు... ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ పూర్తి చేశాడు... మరోవైపు తెలుగు అక్షర వ్యవసాయం చేస్తున్నాడు... పిన్నవయసులోనే 32 అష్టావధానాలు చేశాడు... అనేక పురస్కారాలు అందుకున్నాడు... శతావధానానికి సన్నద్ధుడవుతున్నాడు. పాతికేళ్ళ లేత ప్రాయంలోనే ఎన్నో విజయాలు సాధించిన రాజమండ్రి వాస్తవ్యుడు తాతా సందీప్ అవధాన ప్రయాణం ఇలా సాగుతోంది...**

**వారసత్వంగా...**

తాతా పార్వతమ్మ హైస్కూలులో తెలుగు పండితురాలు. ఆవిడకు పద్యమంటే ప్రీతి. పదవీ విరమణ అయ్యాక, కంటిచూపు మందగించడంతో, మనుమడు సందీప్‌ను పిలిచి భాగవతంలోని గజేంద్రమోక్షం పద్యాలు చదివి వినిపించమన్నారు. అప్పటికి సందీప్‌కి 12 సంవత్సరాలు. పద్యం చదవడం సరిగా రాకున్నా, నాయనమ్మ కోర్కెను కాదనలేక, పద్యాలు చదివి వినిపించాడు. యథాలాపంగా ప్రారంభమైన ఈ ప్రక్రియ అతని జీవితాన్ని మార్చడానికి నాంది పలికింది. నూనూగు మీసాల ప్రాయంలో తొలి అష్టావధానం చేసిన సందీప్, పాతికేళ్ళ ప్రాయంలోపే 32 అష్టావధానాలు పూర్తిచేసి, ఇప్పుడు శతావధానానికి సై అంటున్నాడు. ప్రస్తుతం ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ పూర్తి చేసి డాక్టరేట్‌కు సిద్ధమవుతున్న సందీప్ అటు ఆధునిక చదువులతో పాటు, ఇటు తెలుగు పద్యాన్ని, తెలుగువారికే సొంతమైన అవధానాన్ని తన జీవితంలో ఒక భాగంగా మలుచుకున్నాడు.


**ఇంతింతై వటుడింతయై...**

నాయనమ్మ ఆశీస్సులతో పద్యం పట్ల మక్కువ పెంచుకున్న సందీప్, తెలుగుసాహిత్యానికి పుట్టినిల్లయిన రాజమహేంద్రవరంలో 1994లో పుట్టాడు. తండ్రి వరప్రసాద్ ఒక ప్రైవేటు సంస్థలో చిరుద్యోగి, తల్లి విజయలక్ష్మి గృహిణి. నాయనమ్మ కోరిక మీద గజేంద్రమోక్షంలోని పద్యాలు వినిపించడం ప్రారంభమైన సందీప్ క్రమేపీ ఆ పద్యాల 'రుచి' మరిగాడు. సందీప్‌లో ఉన్న ఆసక్తిని గమనించిన తెలుగుమాస్టారు సందీప్‌ను పద్యాలు రాయమన్నారు.

**అవధాన ప్రస్థానం**

అవధానానికి ధారణాశక్తి, ఏకాగ్రత కావాలి. అప్పటికే గోదావరీ తీరాన ఉన్న ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాలలో రీడరుగా సేవలు అందించిన ధూళిపాళ మహాదేవమణి వద్ద శిష్యరికం చేశారు. అటు చదువు, ఇటు అవధానాలలో ఇక వెనక్కి తిరిగి చూసుకోవలసిన అవసరం లేకపోయింది.


● తల్లిదండ్రులు విజయలక్ష్మి, వరప్రసాద్‌లతో..


● గురువు డాక్టర్ ధూళిపాళ మహాదేవమణి, నాయనమ్మ పార్వతమ్మలతో...

**బిరుదులు... సత్కారాలు**

అవధాన చింతామణి, అవధాన యువరాట్, ఘంటావధాన ధురీణ బిరుదులతో పాటు, నోరి నరసింహశాస్త్రి స్మారక పురస్కారం, ఉషశ్రీ సంస్కృతి సత్కారం, ఉగాది పురస్కారాలను అందుకున్నాడు.

**అవధాన దిగ్గజాల సరసన**


సంస్కృతాంధ్రభాషల్లో అవధానాలు అలవోకగా చేసిన డాక్టర్ చిర్రావూరి శ్రీరామ శర్మ, సహస్రావధాని కడిమిళ్ళ వరప్రసాద్, శతావధాని పాలపర్తి శ్యామలానందప్రసాద్, అబ్బిరెడ్డి పేరయ్యానాయుడు వంటి ఉద్దండ పండితులతో పాటు అవధాని సమ్మేళనంలో పాల్గొన్న తాతా సందీప్ వంటివారిని చూస్తుంటే, తెలుగు అంతరించిపోతున్న భాష అనే ఆవేదన మన నుండి–తాత్కాలికంగానయినా, దూరం కాకతప్పదు.

**– వారణాసి సుబ్రహ్మణ్యం,** సాక్షి, రాజమహేంద్రవరం కల్చరల్
– ఫొటోలు: గరగ ప్రసాద్


● విధుశేఖర భారతీస్వామి ఆశీస్సులు అందుకుంటూ..


● సిరివెన్నెల ఆశీస్సులు అందుకుంటూ..


● గరికిపాటి నరసింహారావు ఆశీస్సులు అందుకుంటూ..





## లవ్ డాక్టర్ — నన్నడగొద్దు ప్లీజ్

హాయ్ సార్! నేను రెండు సంవత్సరాల క్రితం ఒక అమ్మాయిని లవ్ చేశాను. ఆ విషయం తెలిసి మా పేరెంట్స్ మాకు పెళ్లి చేశారు. మ్యారేజ్ అయ్యి వన్ ఇయర్ అవుతోంది. ఒక పాప. కానీ నా సమస్య మా ఆవిడతోనే. నా మాట వినదు. నా దగ్గర ఉన్నపుడు ఒకలా, లేనప్పుడు మరొకలా మాట్లాడుతోంది. తనంటే నాకు చచ్చేంత ఇష్టం కానీ.. తను నన్ను అస్సలు లెక్క చెయ్యదు. నేను ఓపిక పడుతూ ఉన్నాను కానీ.. తనలో ఏ మార్పూ లేదు. ఏం చెయ్యమంటారు?

– రాజేష్

ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

మాట ఎందుకు వినాలన్నా??

'అదేంటి సార్???'

అవును నీలూ! ఎందుకు వినాలి మాట???

'అంటే మొగుడే భార్య మాట వినాలా సార్???'

తప్పేముంది నీలూ?

'హెన్‌పెక్‌డ్ హజ్బెండ్ అంటారు సార్..! పెళ్లాం కొంగు పట్టుకుని ఎలా తిరుగుతున్నాడో చూడండని అందరూ జోక్స్ వేస్తారు కదా సార్? అప్పుడు ఎలా సార్????'

భలే ముచ్చటగా ఉంటుంది నీలూ.. ప్రేమించిన అమ్మాయి భార్యగా దొరికాక.. మగాడిలా ఫీల్ అవ్వకుండా పెళ్లానికి సేవ చేస్తూ.. అన్ని విషయాలలో చేదోడువాడోడుగా ఉంటూ, శ్రీ కృష్ణుడు, సత్యభామల్లాగ సరసమాడుతూ ఉంటే అందరూ ముందు జోక్స్ వేసినా తర్వాత కుళ్లుకుని చస్తారు నీలూ!

'సార్ మీరు చాలా చాలూ! అంటే చాలా తెలివైన వాళ్లు సార్.. అమ్మాయిల పక్షం కాబట్టి రాజేష్‌ని మభ్యపెట్టి మీ చెల్లెలికి సేవలు చేయిస్తున్నారు సార్!!'

చెయ్యాలి నీలూ..! ప్రేమించిన అమ్మాయి కోసం ఎంత చేస్తారు బాయ్ ఫ్రెండ్స్? మరి పెళ్లి చేసుకున్నాక ప్రేమ ఎందుకు తగ్గాలి నీలూ? అలాంటి డబుల్ స్టాండర్డ్స్ ఎందుకు నీలూ? లవ్ పెళ్లి తర్వాత కంటిన్యూ అయితేనే అది లవ్ నీలూ.. లేకపోతే మచ్చిక చేసుకుని మోసం చెయ్యడమే అవుతుంది నీలూ..

'అవునా సార్..? భార్యకు కావలసింది చేస్తూ ఉంటే అంత సంతోషం కలుగుతుందా సార్?'

ఇద్దరూ సూపర్ హ్యాపీగా ఉంటారు నీలూ!

lovedoctorram@sakshi.com


మహేశ్‌బాబు

## సెట్‌కు నాలుగు కోట్లు?

వెండితెరపై కర్నూలు కొండారెడ్డి బురుజు సెంటర్ దగ్గర అజయ్‌వర్మ దెబ్బకు బెంబేలెత్తిపోయాడు ఓబుల్‌రెడ్డి. అంతే.. కబడ్డీ ప్లేయర్ అజయ్‌వర్మ అదుర్స్ అన్నారు ప్రేక్షకులు. పైన చెప్పిన సీన్ మహేశ్‌బాబు 'ఒక్కడు' సినిమా లోనిదని గుర్తుండే ఉంటుంది. అజయ్‌వర్మగా మహేశ్, ఓబుల్‌రెడ్డి పాత్రలో ప్రకాశ్‌రాజ్ కనిపించారు. ఇప్పుడు అదే సెంటర్‌లోకి 'సరిలేరు నీకెవ్వరు' సినిమా షూటింగ్ కోసం అజయ్ కృష్ణ అడుగుపెట్టనున్నారట. మహేశ్‌బాబు హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'సరిలేరు నీకెవ్వరు'. ఇందులో రష్మికా మండన్నా కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రంలో మేజర్ అజయ్‌కృష్ణ పాత్రలో నటిస్తున్నారు మహేశ్‌బాబు. తాజా షెడ్యూల్ రేపటి నుంచి హైదరాబాద్‌లో ప్రారంభం కానుంది.లవ్ సీన్స్‌ను తీస్తారట. అలాగే త్వరలో కర్నూలులోని కొండారెడ్డి బురుజు సెంటర్‌కు చెందిన సన్నివేశాలను తెరకెక్కిస్తారట. ఇందుకోసం దాదాపు నాలుగు కోట్ల రూపాయలతో ఆల్రెడీ సెట్ వర్క్‌ని కూడా స్టార్ట్ చేశారని టాక్. కశ్మీర్ షెడ్యూల్‌కు ముందు అనిల్ రావిపూడి కర్నూలు లొకేషన్స్‌ను పరిశీలించారు. రామబ్రహ్మం సుంకర, దిల్ రాజు, మహేశ్‌బాబు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల కానుంది.


'బాహుబలి 2' పోస్టర్

## ఇట్స్ షో టైమ్

డైరెక్టర్ రాజమౌళి, హీరో హీరోయిన్లు ప్రభాస్, రానా, అనుష్క మరోసారి ఒకే వేదిక పైకి రాబోతున్నారు. ఈ 'బాహుబలి' టీమ్ రీ యూనియన్ 'బాహుబలి –3' కోసమా? అని మాత్రం అడక్కండి. ఈ విషయానికి రాజమౌళియే సమాధానం చెప్పాలి. ఇప్పుడు మాత్రం వీరందరూ ఒకే వేదికను పంచుకోబోతున్నది లండన్‌లోని రాయల్ ఆల్బర్ట్ హాల్‌లో ప్రదర్శించబోయే 'బాహుబలి: ది బిగినింగ్' షో కోసం. ''ఈ ఏడాది అక్టోబర్ 19న సాయంత్రం ఏడు గంటలకు 'బాహుబలి' సినిమా ప్రదర్శించబడుతుంది. సినిమాలో నటించిన ప్రభాస్, అనుష్క, రానా వస్తారు. షో తర్వాత రాజమౌళితో ప్రశ్నోత్తరాల సమయం ఉంటుంది'' అని ఈ విషయాన్ని రాయల్ ఆల్బర్ట్ హాల్ ప్రతినిధులు ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. ఇక ప్రపంచవ్యాప్త గుర్తింపుతో 'బాహుబలి' సినిమా ఇండస్ట్రీలో కొత్త రికార్డులను సృష్టించిన సంగతి తెలిసిందే. రాయల్ ఆల్బర్ట్ హాల్ విషయానికి వస్తే....1871లో క్వీన్ విక్టోరియా ఈ హాల్‌ను స్టార్ట్ చేశారు. బ్రిటన్‌కు చెందిన ముఖ్య సాంస్కృతిక కార్యక్రమాలకు ఈ వేదికనే ఎక్కువగా ఉపయోగిస్తారట. వివిధ రంగాలకు చెందిన ఎంతోమంది అంతర్జాతీయ ప్రముఖులు ఈ వేదికపై తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ హాల్ సీటింగ్ సామర్థ్యం ఎంతో తెలుసా.... 5,267.

## సెల్యూట్ ఆఫీసర్

'దర్బార్'లో రజనీకాంత్ రాజసం మామూలుగా లేదు. ఇక్కడున్న ఫొటో చూశారుగా.. ఐపీఎస్ ఆఫీసర్‌గా రజనీ ఎలా ఉన్నారో! మురుగదాస్ దర్శకత్వంలో రజనీకాంత్ హీరోగా రూపొందుతున్న సినిమా 'దర్బార్'. ఇందులో నయనతార కథానాయికగా నటిస్తున్నారు. ఈ సినిమాలో ఐపీఎస్ ఆఫీసర్ పాత్రలో నటిస్తున్నారు రజనీకాంత్. ముంబై నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. ప్రస్తుతం ముంబైలో ఫైనల్ షెడ్యూల్ చిత్రీకరణ జరుగుతుందని టాక్. ఆగస్టు చివరికల్లా షూట్ కంప్లీట్ చేయాలని టార్గెట్ పెట్టుకున్నారు మురుగదాస్. తాజాగా ఈ సినిమాలోని రజనీ లుక్ సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది. ఇదివరకు కూడా ఈ సినిమా స్టిల్స్ లీక్ అయినప్పటికీ ఖాకీడ్రెస్‌లో రజనీ ఉన్న లుక్ బయటకు రావడం ఇదే తొలిసారి. ఇందులో బాలీవుడ్ నటులు సునీల్ శెట్టి, ప్రతీక్ బబ్బర్ విలన్లుగా నటిస్తున్నారు. నివేదా థామస్, యోగిబాబు కీలకపాత్రలు చేస్తున్నారు. లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల కానుంది.


రజనీకాంత్


రానా

## ఆపరేషన్ సక్సెస్

'బాహుబలి'లో రానా బలిష్టంగా ఉన్నారు. ఆ తర్వాత సడన్‌గా సన్నబడ్డారు. దాంతో చాలా మందికి సందేహాలు మొదలయ్యాయి. ఆ తర్వాత రానా ఆరోగ్యం బాగా లేదనే వార్త ప్రచారంలోకి వచ్చింది. కిడ్నీ సంబంధింత సమస్యతో రానా బాధపడుతున్నారన్నది ఆ వార్త సారాంశం. హైదరాబాద్, ముంబైలలో కొంత కాలంగా చికిత్స పొందుతున్నారని ఫిల్మ్ నగర్ టాక్. తాజాగా అమెరికాలో కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతంగా జరిగిందని, రానా తల్లి లక్ష్మి తనయుడికి కిడ్నీ దానం చేశారనే వార్త షికారు చేస్తోంది. ప్రస్తుతం రానా అమెరికాలో విశ్రాంతి తీసుకుంటున్నారని కూడా చెప్పుకుంటున్నారు. కొద్దిరోజుల తర్వాత మళ్లీ షూటింగ్స్‌తో బిజీబిజీగా ఉంటారట. అయితే ఈ విషయంపై రానా కుటుంబం స్పందించలేదు. ఇదిలా ఉంటే రానా ట్విట్టర్‌లో యాక్టివ్‌గా ఉన్నారు. మంగళవారం 'డియర్ కామ్రేడ్'కి ఆల్ ది బెస్ట్ చెబుతూ, ట్వీట్ చేశారు రానా. అలాగే బుధవారం సాయంత్రం 'బాహుబలి' లండన్ షో గురించి కూడా ఓ ట్వీట్ పెట్టారు.


శ్రుతీహాసన్

## కొత్త ప్రయాణాన్ని మొదలు పెట్టాం

– నిర్మాత 'దిల్' రాజు


లక్ష్మణ్, అనిల్ రావిపూడి, వంశీ పైడిపల్లి, 'దిల్' రాజు, శివలెంక కృష్ణప్రసాద్, శిరీష్, హర్షిత్ రెడ్డి, మహేశ్ కోనేరు

''ఇండస్ట్రీలో రెండు దశాబ్దాల పాటు మాకు అద్భుతమైన ప్రయాణం దొరికినందుకు ఆనందంగా ఉంది. ఇండస్ట్రీ నుంచి మేము తీసుకున్న దానికి, మాకు లభించిన అనుభవాన్ని పంచాలనుకుంటున్నాం. ఇందుకోసం కొంతమంది నిర్మాతలతో మా వెంకటేశ్వర క్రియేషన్స్ (ఎస్వీసీ) అసోసియేట్ అవుతోంది. స్క్రిప్ట్ నుంచి రిలీజ్ డేట్ వరకు ఆయా చిత్ర నిర్మాతలకు మా సంస్థ నుంచి మద్దతు ఇస్తాం. మా సంస్థ ద్వారా ఎంతో మంది నిర్మాతలకు, రాబోయే నిర్మాతలకు ఉపయోగపడాలనే ఆలోచనతోనే ఈ నిర్ణయం తీసుకున్నాం. ఇందుకోసం కొత్త ప్రయాణాన్ని మొదలుపెడుతున్నాం'' అన్నారు నిర్మాత 'దిల్' రాజు. పంపిణీరంగం నుంచి నిర్మాతగా మారి, ఎన్నో విజయాలు చూస్తున్నారు 'దిల్' రాజు. ఎస్వీసీ సంస్థ 20ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో 'దిల్' రాజు మాట్లాడుతూ– ''1999లో 'ఒకే ఒక్కడు' సినిమాతో మా వెంకటేశ్వర ఫిల్మ్స్ మొదలైంది. ఈ సినిమాకు ముందు (1998 జూలై 24) ఇదే జూలై 24న 'తొలి ప్రేమ' చిత్రం నైజాం డిస్ట్రిబ్యూషన్‌లో భాగస్వామ్యులుగా ఉన్నాం. పవన్‌కల్యాణ్‌గారిని స్టార్‌ని చేసిన సినిమా అది. 'పెళ్లి పందిరి' సినిమా సక్సెస్ మమ్మల్ని ఇక్కడివరకూ తీసుకువచ్చింది. ఈ రెండు సినిమాల నిర్మాతలకు థ్యాంక్స్. అలాగే మా డిస్ట్రిబ్యూషన్లో ఎన్నో సక్సెస్‌ఫుల్ సినిమాలను అందించిన నిర్మాతలందరికీ ఈ రోజు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఆ తర్వాత ప్రొడక్షన్ స్టార్ట్ చేసి ఈ పదహారేళ్లలో 32 సినిమాలు తీశాం. 2017లో ఆరు, గత ఏడాది మూడు సినిమాలు మా సంస్థ నుంచి వచ్చాయి. ఈ ఏడాది నాలుగు సినిమాల రిలీజ్‌లు ప్లాన్ చేస్తున్నాం. ఒక సినిమా సక్సెస్ కావాలంటే స్క్రిప్ట్ దగ్గర నుంచి రిలీజ్ వరకు కావాల్సినవి ఎన్నో ఉంటాయి. శివలెంక కృష్ణప్రసాద్‌గారు, విజయ్, సత్యనారాయణ రెడ్డి, కృష్ణ, గోపీ, రాహుల్, హరి, సాగర్, రాహుల్ యాదవ్ నక్కా, విజయ్ చిల్లా, మహేశ్ కోనేరు, రాజీవ్.. ఇలా ఈ నిర్మాతలందరితో మాకు ఒక మంచి అనుబంధం ఉంది. ఈ అనుబంధాన్ని తర్వాత స్థాయికి తీసుకువెళ్లాలనే ఆలోచనతో మా సంస్థతో అసోసియేషన్ గురించి ఆలోచించాం. వారితో ట్రావెల్ అవుతూ మా సంస్థ నుంచి వస్తున్న మంచి సినిమాల మాదిరిగానే వారు కూడా మంచి సినిమాలు తీయడానికి మా వంతు కృషి చేస్తాం. వీరేకాదు, మంచి సినిమాలు చేయాలని మంచి స్క్రిప్ట్‌ను తీసుకువస్తే మా ఎస్వీసీని వాడుకుని తెలుగు ఇండస్ట్రీకి మంచి సినిమాలు ఇవ్వాలనే ఆలోచనతో ఈ కొత్త ప్రయాణం మొదలు పెడుతున్నాం. అలాగే డబ్బు సంపాదిస్తూ ప్రేక్షకులకు మంచి సినిమాలు ఇవ్వడానికి ప్రయత్నం చేస్తాం. హారిక హాసిని, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలకు కూడా ఈ సందర్భంగా థ్యాంక్స్'' అని అన్నారు.

''రాజుగారితో నాకు 18ఏళ్ల పరిచయం ఉంది. సినిమాలపై పిచ్చితో ఇండస్ట్రీవైపు వచ్చారు రాజు, శిరీష్, లక్ష్మణ్. 'ఎస్వీసీ' సక్సెస్‌ఫుల్ జర్నీలో నా వంతుగా నాలుగు సినిమాలు ఉండటం హ్యాపీగా ఉంది. ఎస్వీసీని నా మాతృసంస్థగా భావిస్తాను. రైటర్‌గా నాకు జన్మనిచ్చారు. ఈ సంస్థ సపోర్ట్‌తో నాలాంటి దర్శకులు చాలామంది స్థిరపడే అవకాశం ఉంది'' అన్నారు దర్శకుడు వంశీపైడిపల్లి.

''ఎస్వీసీ' జర్నీలో నాది 2015–2019 టైమ్. 'దిల్' రాజుగారి జడ్జిమెంట్, లక్ష్మణ్ ప్లానింగ్, శిరీష్ ఎగ్జిక్యూషనే ఈ సంస్థ సక్సెస్‌కు కారణమనిపిస్తోంది. ఎస్వీసీ అంటే సక్సెస్ వీళ్ల కేరాఫ్ అడ్రస్'' అన్నారు దర్శకుడు అనిల్ రావిపూడి. ''ఇండస్ట్రీలో అన్నింటినీ అన్ని రకాలుగా చూసినవాడే నిర్మాత. ఈ ముగ్గురూ ఇంత దూరం వచ్చారు. వీరితో అసోసియేట్ అవ్వడం హ్యాపీ'' అన్నారు నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్. ''ఇలాంటి పెద్దబ్యానర్‌లో అసోసియేట్ అయితే చిన్న సినిమాలు మరింత ఎక్కువమంది ప్రేక్షకులకు రీచ్ అవుతాయి'' అన్నారు నిర్మాత రాహుల్ యాదవ్. ''నిర్మాత అంటే ప్రతిరోజూ యుద్ధమే. 20 ఏళ్లలో దాదాపు 95 శాతం విజయాలతో ఈ సంస్థ టాప్ ప్రొడక్షన్ హౌస్‌గా నిలబడింది'' అన్నారు నిర్మాత మహేశ్ కోనేరు. ''ఆర్య' సినిమా సమయంలో నేను, బన్నీవాసు, యూవీ క్రియేషన్స్ ఈ బ్యానర్‌తో అసోసియేట్ అయ్యాం. ఈ రోజు మేమంతా నిర్మాతలుగా మారాం'' అన్నారు విజయ్ చిల్లా. ''సినిమా చూపిస్తా మామా' చిత్రం నుంచి ఈ సంస్థతో అసోసియేట్ అయ్యాను'' అన్నారు బెక్కం వేణుగోపాల్. లక్ష్మణ్, శిరీష్, సాగర్, కృష్ణ, గోపీ తదితరులు పాల్గొన్నారు.

## నేను మారిపోయాను!

''నేను మారిపోయా'' అంటున్నారు శ్రుతీహాసన్. సౌత్‌లో స్టార్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకున్న ఈ బ్యూటీ సేమ్ మ్యాజిక్‌ను అక్కడ రిపీట్ చేయడానికి అప్పుడప్పుడు హిందీ సినిమాలు చేస్తున్నారు. ఇలా నటిగా శ్రుతీహాసన్ పదేళ్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ – ''మూవీ బిజినెస్‌లో ఒక నటిగా పదేళ్లు పూర్తి చేసుకున్నాను. ఎంతో నేర్చుకున్నాను. ఎంతోమందికి థ్యాంక్స్ చెప్పాల్సి ఉంది. నటిగా నేను ఈ స్థాయిలో ఉన్నందుకు చాలా సంతోషంగా ఉంది. కెరీర్‌లో ఎదిగేందుకు నేను మరింత కష్టపడతానని ప్రామిస్ చేస్తున్నాను. నాకు సపోర్ట్ చేసేవారందరూ గర్వపడేలా నేను మరింత శ్రద్ధగా పనిచేస్తాను. ఈ జర్నీలో 'మూవీ బిజినెస్' అనేది నాకు ఫ్యామిలీ లాంటిదని అర్థమైంది. ఇక్కడ కొన్ని మంచి విషయాలు ఉన్నాయి. మరికొన్ని చెడు సంగతులున్నాయి. ఈ పదేళ్ల ప్రయాణంలో వృత్తిపరంగా, వ్యక్తిగా నేను చాలా మారిపోయాను. ఈ మధ్య ఒక ఏడాది విరామం తీసుకుని, వృత్తిపరంగా, వ్యక్తిగతంగా ఎలా అడుగులు వేయాలో విశ్లేషించుకున్నాను. కొన్ని లక్ష్యాలు పెట్టుకున్నాను. నా జీవితంలోని తర్వాతి దశకు చేరుకోవడంలో ఈ లక్ష్యాలు నాకు ఉపయోగపడతాయని ఆశిస్తున్నాను'' అని చెప్పుకొచ్చారు శ్రుతీహాసన్. 2009లో బాలీవుడ్ మూవీ 'లక్' సినిమాతో హీరోయిన్‌గా శ్రుతీహాసన్ కెరీర్ ప్రారంభమైంది. ఈ సినిమా విడుదలై (2009 జూలై 24) బుధవారం నాటికి సరిగ్గా పదేళ్లు ముగిశాయి. 'అనగనగా ఓ ధీరుడు' చిత్రం ద్వారా తెలుగుకి పరిచయమయ్యారామె.


విజయ్ సేతుపతి

## విజయ్ @ 800

క్రికెట్ ప్రపంచంలో శ్రీలంక స్పిన్నర్ ముత్తయ్య మురళీధరన్ పేరు తెలియనివారు ఉండకపోవచ్చు. టెస్ట్, వన్ డే క్రికెట్‌లో అత్యధిక వికెట్లు సాధించిన ఘనత ముత్తయ్య పేరు మీదనే ఉంది. ఇటీవల క్రీడాకారుల జీవితాలు వెండితెర పైకి వస్తున్న నేపథ్యంలో తాజాగా ముత్తయ్య మురళీధరన్ బయోపిక్ తెరపైకి వచ్చింది. ఈ బయోపిక్‌లో ముత్తయ్యగా విజయ్ సేతుపతి నటించబోతున్నారు. ఈ సినిమాకు శ్రీపతి రంగస్వామి దర్శకుడు. ''ముత్తయ్య మురళీధరన్ తమిళ సంతతికి చెందిన సూపర్ స్పోర్ట్స్ పర్సన్. స్పిన్నర్‌గా ప్రపంచఖ్యాతి గడించారు. అతని పాత్రలో నటించడం నాకు సవాల్ లాంటిది. ముత్తయ్య మురళీధరన్‌గారు ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడం, స్వయంగా నాకు క్రికెట్ టిప్స్ చెప్పడం సంతోషంగా ఉంది. నన్ను నమ్మిన మురళీధరన్‌కు, నిర్మాతలకు థ్యాంక్స్'' అన్నారు విజయ్ సేతుపతి. ''విజయ్ సేతుపతి వంటి నటుడు నా పాత్రలో నటించడం హ్యాపీ'' అన్నారు మురళీధరన్. టెస్ట్ క్రికెట్‌లో ఎనిమిది వందల వికెట్లు తీసిన బౌలర్ రికార్డు మురళీధరన్ సొంతం. సో.. ఈ సినిమాకు '800' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారట టీమ్. ఈ చిత్రాన్ని థార్ మోషన్ పిక్చర్స్ నిర్మించనుంది.

## సున్నితమైన ప్రేమకథ

జగపతిబాబు, మలయాళ నటి మీరా నందన్ జంటగా 2015లో విడుదలైన చిత్రం 'హితుడు'. కె.విప్లవ్ ఈ సినిమాకి దర్శకత్వం వహించారు. విమర్శకుల ప్రశంసలు అందుకున్న ఈ సినిమా నంది అవార్డు కూడా పొందింది. విప్లవ్ తాజాగా కొత్త సినిమాని తెరకెక్కించనున్నారు. కేఎస్వీ సమర్పణలో సిరంజ్ సినిమా పతాకంపై ఈ చిత్రం రూపొందనుంది. 'ప్రేమకు రెయిన్ చెక్' ఫేమ్ అభిలాష్, 'అరవింద సమేత వీర రాఘవ, మిస్టర్ మజ్ను' చిత్రాల్లో నటించిన రాఘవ్ కథానాయకులు. విప్లవ్ మాట్లాడుతూ– ''సున్నితమైన ప్రేమకథతో నిర్మించనున్న చిత్రమిది. నేటి తరం యువత జీవనశైలికి దగ్గరగా ఉంటుంది. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు పూర్తి కావచ్చాయి'' అన్నారు.


కె.విప్లవ్


ప్రియాంకా చోప్రా

## వందలో ఒక్కరు!

సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్‌గా ఉండే బాలీవుడ్ హీరోయిన్లలో ప్రియాంకా చోప్రా ఒకరు. ఫొటో షేరింగ్ యాప్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమెకు దాదాపు 4 కోట్ల 30 లక్షల ఫాలోయర్స్ ఉన్నారు. ట్విటర్‌లో దాదాపు 2 కోట్ల 50 లక్షల ఫాలోయర్స్ ఉన్నారు. ఇప్పుడీ సంగతి ఎందుకంటే.. సెలబ్రిటీలు తమ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేసిన వాటికి ఎంత చార్జ్ చేస్తారనే అంశం ఆధారంగా యూఎస్‌కు చెందిన ఓ కంపెనీ విడుదల చేసిన 'ఇన్‌స్టాగ్రామ్ రిచ్ లిస్ట్'లో ప్రియాంకా చోప్రా 19వ స్థానంలో నిలిచారు. ఏదైనా ప్రొడక్ట్‌ను తన ఇన్‌స్టా ఖాతా ద్వారా ప్రమోట్ చేయడానికి ప్రియాంకా చోప్రా దాదాపు కోటీ 86 లక్షల 80 వేల రూపాయలు తీసుకుంటారట. ఆ కంపెనీ విడుదల చేసిన వందమంది జాబితాలో ఉన్న ప్రముఖుల్లో అమెరికన్ మోడల్ కైలీ జెన్నర్ తొలి స్థానంలో నిలిచారు. అలాగే ఈ జాబితాలో చోటు సంపాదించిన ఒకేఒక్క బాలీవుడ్ నటి కూడా ప్రియాంకే కావడం విశేషం. అలాగే ఇండియా తరఫున విరాట్ కోహ్లీ 23వ స్థానంలో నిలవడం విశేషం.

## హ్యాట్రిక్‌కి రెడీ


అనసూయ

'క్షణం, రంగస్థలం' వంటి హిట్ చిత్రాల్లో కీలక పాత్రలు చేసిన అనసూయ ప్రధాన పాత్రలో రాజేష్ నాదెండ్ల దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం 'కథనం'. ది గాయత్రి ఫిల్మ్స్, ది మంత్ర ఎంటర్‌టైన్మెంట్స్‌పై బి.నరేంద్రరెడ్డి, శర్మ చుక్కా నిర్మించారు. ఈ సినిమా ఆగస్టు 9న రిలీజ్ కానుంది. ''అనసూయగారి కెరీర్‌లో బ్లాక్ బస్టర్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు నరేంద్ర రెడ్డి. ''ఇది నా తొలి చిత్రం. 'క్షణం, రంగస్థలం' హిట్స్ తర్వాత 'కథనం'తో అనసూయగారు హ్యాట్రిక్ కొట్టబోతున్నారు. ఆమె నటన ప్రేక్షకులను మెప్పిస్తుంది. నరేంద్రరెడ్డిగారు ఏ సినిమా పంపిణీ చేసినా అది హిట్. నిర్మాతగా కూడా ఆయన సక్సెస్ అవుతారనే నమ్మకం ఉంది'' అన్నారు రాజేష్ నాదెండ్ల. ఈ చిత్రానికి సంగీతం: రోషన్ సాలూరి, కెమెరా: సతీష్ ముత్యాల, లైన్ ప్రొడ్యూసర్: ఎమ్.విజయ చౌదరి.

## జ్ఞాపకశక్తి కోల్పోయా


దిశా పాట్నీ

నిన్న, మొన్న ఏం జరిగిందో, ఏం చేశామో మనకు ఒక్కోసారి గుర్తుకు రాకపోతేనే కంగారు పడతాం. అలాంటిది ఓ ఆర్నెల్ల పాటు జ్ఞాపకశక్తి కోల్పోతే? సినిమాల్లో ఇలా జరుగుతుంది కానీ నిజజీవితంలో జరుగుతుందా అనుకుంటున్నారా? హీరోయిన్ దిశా పాట్నీ లైఫ్‌లో ఇలా జరిగింది. తలకు తగిలిన గాయం వల్ల ఆమె ఓ ఆర్నెల్ల పాటు జ్ఞాపకశక్తిని కోల్పోయారు. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన 'లోఫర్' సినిమాలో వరుణ్ తేజ్‌తో జోడీ కట్టిన ఈ బ్యూటీ గుర్తుండే ఉంటుంది. ఆ సినిమా తర్వాత బాలీవుడ్‌పై దృష్టి సారించారామె. తాను చేస్తున్న సినిమా విశేషాలు, జిమ్‌లో కసరత్తులు చేస్తున్న వీడియోలు, ఫిట్‌నెస్ విషయాల గురించి ఆమె సోషల్ మీడియాలో పంచుకుంటూ ఉంటారు. మూడేళ్లుగా దిశా జిమ్నాస్టిక్స్, మార్షల్ ఆర్ట్స్ ప్రాక్టీస్ చేస్తున్నారు. కాగా, ఓసారి జిమ్నాస్టిక్స్ చేస్తున్న సమయంలో ఆమె తల నేలకు తగలడంతో బలమైన గాయం తగిలింది. ఆ గాయం కారణంగా ఆమె ఆర్నెల్ల పాటు జ్ఞాపకశక్తిని కోల్పోయారు. ఆ విషయం గురించి దిశా మాట్లాడుతూ – ''ఆర్నెల్ల జీవితాన్ని నేను కోల్పోయాను. ఎందుకంటే అంతకుముందు ఏం జరిగిందో ఆ ఆరు నెలల్లో గుర్తుకు రాలేదు'' అన్నారు. ట్రీట్‌మెంట్‌తో మళ్లీ మామూలు మనిషి అయ్యారామె. ''జిమ్నాస్టిక్స్, మార్షల్ ఆర్ట్స్ చేయాలంటే చాలా ధైర్యం, శక్తి, ఓపిక కావాలి. వర్కవుట్స్ చేసే టైమ్‌లో దెబ్బలు తగిలినప్పుడు మినహా మిగతా అన్నిరోజులూ చేయాల్సిందే. నేనివాళ ఇంత ఫిట్‌గా ఉండటానికి కారణం క్రమం తప్పకుండా ప్రాక్టీస్ చేయడమే'' అన్నారు దిశా.



సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
గురువారం
25-7-2019

# కడుపులో దాచుకోకండి




**ఈ** రోజుల్లో జస్ట్ ముప్ఫయి ఏళ్ల వయసుకు చేరిన వారిలో ఏదో ఒక రకమైన జీర్ణసమస్య కనపడుతుండటం మామూలైపోయింది. తిన్న వెంటనే కడుపు ఉబ్బరంగా అనిపించడమో, పొట్ట రాయిలా మారడమో, అదే పనిగా తేన్పులు రావడమో... ఇలా ఏదో ఒక ఇబ్బంది ఉండనే ఉంటోంది. ప్రతి ఇంట్లోనూ తమకు మలబద్ధకం ఉందనో, కిందినుంచి గ్యాస్ పోతోందనో, గుండెల్లో మంటగా ఉంటోందనో చెప్పడం చాలా సాధారణం. ఇందుకు ఏ ఇల్లూ మినహాయింపు కాదంటే అతిశయోక్తి ఏమీ కాదు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్క కుటుంబానికీ ఉపకరించేలా ఆహారం జీర్ణం అయ్యే ప్రక్రియలోనూ, జీర్ణవ్యవస్థలోనూ మనం ప్రతిరోజూ ఎదుర్కొనే సాధారణ సమస్యలూ, వాటి పరిష్కారాల వంటి అంశాలపై అవగాహన కోసం ఈ కథనం.

## కడుపులో గ్యాస్ పైకి తన్నడం

మనం ఆహారం తీసుకోగానే ఈసోఫేగస్ అనే పైప్ ద్వారా అది జీర్ణాశయంలోకి వెళ్తుంది. అక్కడ ఆహారాన్ని జీర్ణం చేయడం కోసం ఆసిడ్ ఉత్పత్తి అవుతుంటుంది. మనం జీర్ణం అవడానికి తగినంత పరిమాణంలో అక్కడ ఆహారం లేకపోతే ఆ యాసిడ్ మన కడుపు కండరాలపై ప్రభావం చూపుతుంది. యాసిడ్ దేనినైనా కాల్చేస్తుందన్న విషయం తెలిసిందే కదా. అందుకే అది మన కడుపు కండరాల మీద పని పనిచేస్తుంటే కడుపులో మంటగా అనిపిస్తుంటుంది. అంతేకాదు ఆ తాలూకు పొగలు (యాసిడ్ ఫ్యూమ్స్) ఒక్కోసారి పైకి చిమ్ముతుంటాయి. అలా పైకెగసినప్పుడు దాని ప్రభావం గొంతులోనూ తెలుస్తుంది. అప్పుడు ఆసిడ్ గొంతులోకి, కొన్నిసార్లు నోట్లోకి కూడా ప్రవేశించి, మనకు చేదు తెలుస్తుంటుంది. దీన్నే 'వెట్ బర్ప్' అని కూడా అంటారు. అప్పుడు గొంతు మంటగా అనిపించడం సహజం. అందుకే గ్యాస్ పేరుకున్నప్పుడు కడుపులో మంటగానూ, గొంతులోకి గ్యాస్‌ఫ్యూమ్స్ ఎగజిమ్మినప్పుడు గ్యాస్ పైకి ఎగతన్నుతున్నట్లు అనిపించడం చాలా సాధారణం.

**కారణాలు:** కడుపులో గ్యాస్ సమస్యకు ఎన్నో కారణాలు ఉన్నాయి. అందులో ఇవి కొన్ని... ● కడుపులో కొద్దిపాటి ఖాళీ కూడా మిగల్చకుండా తినడం ● తిన్నవెంటనే పడుకోవడం ● ఆహారంలో కొవ్వు ఎక్కువగా ఉండటం. ● ఉప్పు, కారం, మసాలాలు అధికంగా ఉండటం. ● మనం తీసుకున్న ఆహారంలో తగినన్ని పీచుపదార్థాలు ఉండకపోతే... అలాంటప్పుడు యాసిడ్ పనిచేసే సమయంలో కడుపు కండరాలకు తగినంత రక్షణ దొరకదు. యాసిడ్ నేరుగా కడుపు కండరాలపై పనిచేస్తుండటంతో కడుపులో మంట, గ్యాస్ పైకి ఎగజిమ్మడం వంటి సమస్యలు మరింత తీవ్రమవుతాయి.



● ఆహారనాళం, జీర్ణకోశంలోకి ఈ రెండూ కలిసే జంక్షన్‌లో ఒక మూత (స్ఫింక్టర్) లాంటి నిర్మాణం ఉంటుంది. ఈ మూతను వైద్యపరిభాషలో 'జీఈ జంక్షన్' అని పిలుస్తారు. ఒకసారి జీర్ణకోశంలోకి వెళ్లిన ఆహారాన్ని మళ్లీ పైకి రాకుండా 'జీఈ జంక్షన్' అనే మూతలాంటి నిర్మాణం అడ్డుపడుతుంది. అయితే కొన్నిసందర్భాల్లో అది బలహీనంగా ఉండటం వల్ల గొంతులోకి ఆహారపు మెతుకులు రావడం, దాంతోపాటు గ్యాస్, ఆసిడ్ రావడం వంటి లక్షణాలు కూడా చాలా మందిలో కనిపిస్తుంటాయి. 'జీఈ జంక్షన్' సరిగా పనిచేయడానికి ఎన్నో అంశాలు దోహదం చేయాలి. ఉదాహరణకు... కడుపు కండరాలు మృదువుగా ఉండటం, అక్కడ స్రవించాల్సిన రకరకాల హార్మోన్లు సక్రమంగా స్రవించడం వంటివి. ఒకసారి కడుపులోకి ఆహారమంతా చేరుకున్న తర్వాత ఆ స్ఫింక్టర్ పూర్తిగా, సక్రమంగా మూసుకుపోవాలి. మనం తీసుకునే ఆహారం, కొన్నిరకాల మందులు, నరాల నుంచి ఆదేశాలు కూడా ఈ జీఈ జంక్షన్ అనే నిర్మాణం బలహీన పడటానికి దోహదం చేస్తుంటాయి. అంతేకాదు... మనం ఆల్కహాల్ తీసుకున్నప్పుడు అన్ని కండరాలూ రిలాక్స్ అయినట్లుగానే ఈ స్ఫింక్టర్ కండరాలూ రిలాక్స్ అవుతాయి. అలాంటప్పుడు ఆహారంతో పాటు ఆసిడ్ పైకి ఎగజిమ్మి ఒక్కోసారి నోట్లోకి వస్తుంది. ఆల్కహాల్ తాగి నిద్రపోతున్న సమయంలో ఇలా నోట్లోకి చేదు వస్తుండటం చాలామందికి అనుభవంలోకి వచ్చే సంఘటనే. అలాగే కొన్నిసార్లు కొన్ని రకాల మందులు కూడా గ్యాస్‌ట్రబుల్‌కు కారణమవుతుంటాయి.

## గ్యాస్ సమస్యను నివారించడం ఎలా

● ఒకేసారి ఎక్కువ ఆహారాన్ని మూడు పూటల్లో కాకుండా చిన్న చిన్న మోతాదుల్లో రోజులో ఎక్కువ సార్లు తినడం ● ఊబకాయం ఉన్నవారు బరువు తగ్గించుకోవడం ● పొగతాగడం, మద్యపానం వంటి అలవాట్లు ఉన్నవారు తక్షణం వాటిని మానివేయడం. ● రాత్రిపూట చాలా ఆలస్యంగా తినకూడదు. ● రాత్రి ఆహారం తీసుకున్న తర్వాత కొద్ది దూరం నడవాలి. ● రాత్రిపూట తీసుకునే చిరుతిండ్లను వీలైనంత వరకు మానేయాలి. ● రాత్రి నిద్రకు ఉపక్రమించే ముందర రెండుగంటల పాటు ఏమీ తినకూడదు. ● పక్కమీదకు వెళ్లగానే సాధ్యమైనంత వరకు ఎడమవైపునకు ఒరిగి పడుకోవాలి. వీలైనంత వరకు కుడివైపు తిరిగి పడుకోకూడదు. ఎందుకంటే... అలా పడుకుంటే స్ఫింక్టర్ మీద ఒత్తిడి పడి అది తెరుచుకుని, ఆహారం మళ్లీ వెనక్కు రావచ్చు. ఆసిడ్ కూడా వెనక్కు వచ్చే అవకాశం ఎక్కువ. ● మీ తల వైపు భాగం ఒంటి భాగం కంటే కాస్త ఎత్తుగా ఉండేలా చూసుకోవాలి. ఒక మెత్త (దిండు)ను ఎక్కువగా పెట్టుకోవడం కాస్త ఉపశమనాన్ని కలిగిస్తుంది. ఈ దిండు తల కింద మాత్రమేగాక మీ భుజాల కిందివరకూ ఉంటే మేలు.

**చికిత్స:** ఈ సమస్య విషయంలో నివారణే మంచి చికిత్సగా భావించవచ్చు. అంటే మన జీవనశైలిని ఆరోగ్యవంతంగా మార్చుకోవడం. అంటే తక్కువ మోతాదుల్లో ఎక్కువ సార్లు తినడం, ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా ఉండేలా చూసుకోవడం. వీటన్నింటితో గుణం కనిపించనప్పుడే హెచ్2 బీటాబ్లాకర్స్, ప్రోటాన్ పంప్ ఇన్హిబిటర్స్ (పీపీఐ) అనే మందులతో చికిత్స అవసరమవుతుంది.

**గృహ వైద్యం:** అప్పుడే తయారు చేసిన మజ్జిగ తీసుకోవడం ఇలాంటి సమస్యల్లో మంచి గృహ వైద్యం. అప్పుడే చిలికిన మజ్జిగకు క్షారగుణం ఉంటుంది. ఇది కడుపులోని ఆసిడ్ (ఆమ్లం)తో కలవగానే దాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసేస్తుంది. ఫలితంగా ఆమ్లం తన ప్రభావాన్ని కోల్పోతుంది. అయితే ఈ గృహవైద్యం కోసం అప్పటికప్పుడు తయారు చేసిన తాజామజ్జిగనే (ఉప్పు లేకుండా) వాడాలి. ఎందుకంటే... కాస్త ఆలస్యం చేసినా మజ్జిగ పులవడం మొదలై అది కూడా అసిడిక్ (ఆమ్ల)గుణాన్ని పొందుతుంది. కాబట్టి ఆసిడ్‌లో ఆసిడ్ కలిసి సమస్య మరింత తీవ్రం కావచ్చు. కడుపును చల్లగా ఉంచే తాజా పెరుగు, తియ్యటి పెరుగు కూడా మంచి ఉపశమనాన్ని ఇస్తుంది. పెరుగులోని ప్రో-బయోటిక్ ఫ్యాక్టర్స్ అక్కడి బ్యాక్టీరియాను నియంత్రించి కడుపులో మంటను తగ్గిస్తాయి.

## కింది నుంచి గ్యాస్ పోవడం

ఇది చాలామందిలో చాలా ఇబ్బంది కలిగించే సమస్య. మనం ఆహారాన్ని మింగే సమయంలో గాలిని కూడా మింగుతుంటాం. ఇది పెరిస్టాలిటిక్ చలనం రూపంలో జీర్ణవ్యవస్థ పొడవునా వెళ్తూనే ఉంటుంది. ఈ గ్యాస్... జీర్ణవ్యవస్థ భాగంలో ఉంటే తేన్పు రూపంలో వెళ్తుంది. కానీ జీర్ణవ్యవస్థ కింది భాగానికి దగ్గరగా అంటే పెద్దపేగు, రెక్టమ్‌లో ఉన్నప్పుడు కిందన... మలద్వారం గుండా పోతుంటుంది. అలాంటప్పుడు ఇది చాలా ఇబ్బందిని కలిగిస్తుంటుంది.

## ఎవరెవరిలో ఈ సమస్య ఎక్కువ... ?

● బాగా వేగంగా తినేవారు, బాగా వేగంగా తాగేవారు ● పొగతాగే అలవాటు ఉన్నవారు ● చ్యూయింగ్‌గమ్ నమిలేవారు ● ఎప్పుడూ ఏదో చప్పరిస్తూ ఉండేవారు ● కార్బొనేటెడ్ డ్రింక్స్ / కూల్‌డ్రింక్స్ (గ్యాస్ ఉన్నవి) ఎక్కువగా తాగేవారు ● వదులుగా ఉండే కట్టుడుపళ్లు ఉన్నవారు... వీరంతా గ్యాస్ ఎక్కువగా మింగుతుంటారు.

ఇక కొన్ని రకాల ఆహారాలు కూడా కింది నుంచి గ్యాస్ పోవడం అనే సమస్యను తీవ్రతరం చేసుంటాయి. ఆ ఆహారాలివే...

● బీన్స్, ● కూరగాయల్లో బ్రాకోలీ, కాలీఫ్లవర్, క్యాబేజీ, ఉల్లిగడ్డలు ● పండ్లలో పియర్స్, ఆపిల్స్ ● పొట్టు ఉన్న ధాన్యాల్లో గోధుమలు ● గ్యాస్ ఉన్న పానీయాలైన సోడాలు, కార్బొనేటేడ్ సాఫ్ట్‌డ్రింక్స్ ● పాలు, పాల ఉత్పాదనల్లో చీజ్, ఐస్‌క్రీములు, పెరుగు ● ప్యాకేజ్‌ఫుడ్స్‌లో బ్రెడ్స్ వంటివి తినేవారిలో గ్యాస్ పోవడం ఎక్కువ.

## కిందినుంచి గ్యాస్ పోయే సమస్యకు పరిష్కారం

మనం ఆహారం తీసుకునే సమయంలో గాలి ఎక్కువగా నోట్లో పోకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఈ సమస్యను చాలావరకు అధిగమించవచ్చు. ఆ జాగ్రత్తలివే...

● తినే సమయంలో చాలా మెల్లగా, నింపాదిగా తినాలి. ● నమిలేటప్పుడు పెదవులు మూసి తినాలి ● పొగతాగే అలవాటు ఉంటే తక్షణం మానేయాలి. ● కట్టుడు పళ్లు ఉన్నవారు డెంటిస్ట్ సహాయంతో అవి సరిగా అమరి ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి ● సోడాలు, కూల్‌డ్రింక్స్, బీర్ వంటి గ్యాస్ నిండిన పానీయాలకు దూరంగా ఉండాలి. ● పండ్లను కొరికి, నమిలి తినాలి. ఇలాంటి జాగ్రత్తలతో చాలావరకు ఈ సమస్యను అధిగమించవచ్చు.

**మందులు :** ● మనం బీన్స్ లేదా గ్యాస్‌కు దోహదం చేసే కూరగాయలతో ఎక్కువగా భోజనం చేసినప్పుడు డాక్టర్ల సలహా మేరకు అల్ఫా-గెలాక్టోసైడేజ్ మందులు తీసుకోవడం ద్వారా గ్యాస్ సమస్యను తగ్గించుకోవచ్చు.

● కడుపులో గ్యాస్ పెరిగి ఇబ్బందికరమైన నొప్పితో బాధపడుతున్నప్పుడు డాక్టర్ సలహా మేరకు సైమెథికోన్ (గ్యాస్-ఎక్స్, మైలాంటా గ్యాస్) వంటి మందులతో ఈ సమస్యను అధిగమించవచ్చు.

**గమనిక:** పాలు, పాల ఉత్పాదనలు తీసుకున్నప్పుడు కడుపు ఉబ్బరంగా మారిపోయి, గ్యాస్ సమస్య పెరుగుతుంటే... మార్కెట్‌లో ఇటీవల ల్యాక్టోజ్ రహిత పాలు, పాల ఉత్పాదనలు దొరుకుతున్నాయి. వాటిని ఉపయోగిస్తే గ్యాస్ సమస్య బాగా తగ్గుతుంది.

**ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్ (ఐబీఎస్):** దీని వల్ల సాధారణ ఆరోగ్యానికి ఇబ్బందేమీ ఉండదు. ఎలాంటి ప్రమాదమూ, ప్రాణాపాయమూ ఉండదు. కానీ అనుభవించేవారికి ఇదెంతో పెద్ద సమస్య. సామాజిక జీవనానికి పెద్ద అడ్డంకి. ఓ డిన్నర్‌కీ లేదా లంచ్‌కీ వెళ్దామన్నా ఇబ్బంది. ఎక్కడకు వెళ్లినా బాత్‌రూమ్ ఎక్కడ ఉందో అని మొదటే వెతుక్కోవాల్సిన ఇబ్బందికరమైన స్థితి. భోజనం ముగిసిన వెంటనే టాయిలెట్‌కు పరుగుపెట్టాల్సిన పరిస్థితి. నలుగురిలో ఇబ్బంది ఎప్పుడు కలుగుతుందో అన్న ఆందోళన.

**లక్షణాలివి...** ఒక్కోసారి మలబద్ధకం, కొన్నిసార్లు నీళ్ల విరేచనాలు... కొన్నిసార్లు ఈ రెండూ కలిసి ఉన్నట్లు అనిపిస్తాయి. ఉబ్బినట్లుగా ఉన్న పొట్ట, కింది నుంచి గ్యాస్ పోవడం మామూలే. భోజనం ముగించిన వెంటనే కడుపునొప్పితో ఆపుకోలేని విధంగా టాయిలెట్‌కు వెళ్లాల్సిన పరిస్థితి. మలవిసర్జన తర్వాత కడుపు తేలికై, నొప్పి తగ్గుతుంది.

**కారణాలు:** ఐబీఎస్‌కు నిర్దిష్టమైన కారణం తెలియదు. అయితే... మన దేహంలో జీర్ణక్రియ ఒక పద్ధతి ప్రకారం జరిగిపోతుంది. రోజూ ఉదయాన్నే మలవిసర్జన మొదలుకొని, ఆయా వేళలకు ఆకలైనప్పుడు తినాలనిపించడం అంతా మెదడునుంచి జీర్ణవ్యవస్థకు అందే ఆదేశాల ఆధారంగా ఒక క్రమబద్ధమైన రీతిలో జరుగుతూ ఉంటుంది. ఏదైనా కారణాల వల్ల మెదడుకూ, జీర్ణవ్యవస్థకూ మధ్య సమాచార వ్యవస్థ దెబ్బతిని, అక్కడినుంచి అందే ఆదేశాలు అస్తవ్యస్తమైతే అది ఐబీఎస్‌కు దారితీస్తుందన్నది ఒక వాదన. ఇక రోజువారీ జీవితంలో తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొనేవారిలో ఇది ఎక్కువ. ఏదైనా ఒత్తిడితో కూడిన పరిస్థితి ఎదురుకాగానే మలం వస్తున్న ఫీలింగ్‌తో బాత్‌రూమ్‌కు వెళ్లాల్సి రావడం చాలామందిలో కనిపించే లక్షణమే. అదే ప్రక్రియ ఐబీఎస్ ఉన్నవారిలోనూ జరుగుతుంది.

**అధిగమించడం ఎలా:** ఇటీవల ఆహారానికీ, ఐబీఎస్‌కూ ఏదో తెలియని అంతర్లీన సంబంధం ఉందన్న విషయాన్ని అధ్యయనాలు తెలుపుతున్నాయి. ప్రధానంగా 'ఫోడ్‌మ్యాప్స్' అనే ఆహారం వల్ల ఈ సమస్య మరింత ఎక్కువవుతోందన్న వాదన వినిపిస్తోంది. ఫోడ్‌మ్యాప్ ఆహారం అంటే... మనం తిన్న తర్వాత పేగుల్లో పూర్తిగా జీర్ణం కాకుండా కేవలం పాక్షికంగా మిగిలిపోయే ఆహారం అన్నమాట. ఇది అలా పాక్షికంగా జీర్ణమై మిగతాది మిగిలిపోవడంతో అది పులియడం (ఫెర్మెంటేషన్ ప్రక్రియ) మొదలవుతుంది. ఈ ప్రక్రియలో గ్యాస్ వెలువడటం, అది కింది నుంచి మాటిమాటికీ పోతూ ఉండటం, గ్యాస్ నిండిపోయి పొట్టబిగుతయ్యేలా చేయడం వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి.

**ఫోడ్‌మ్యాప్స్ ఎక్కువగా ఉండే ఆహారాలు:** మనం తినే ఆహారంలో కృత్రిమ చక్కెరలు, కొన్ని తీపిపదార్థాలు, పాలు, పండ్లలో మామిడి, ఆపిల్, కూరగాయల్లో బీట్‌రూట్, క్యాబేజీ, ఉల్లి వంటివి ఎక్కువ ఫోడ్‌మ్యాప్స్ ఉంటాయి. కాబట్టి వీటిని పరిమితంగానే తీసుకోవాలి.

**ఫోడ్‌మ్యాట్ తక్కువగా ఉండే ఆహారాలు:** అరటి పండ్లు, బ్లూబెర్రీ, ద్రాక్ష, నిమ్మ, ఆరెంజ్, స్ట్రాబెర్రీ వంటి వాటిల్లో ఫోడ్‌మ్యాప్స్ తక్కువగా ఉంటుంది. ఇలాగే గుమ్మడి, పాలకూర, టొమాటో, చిలగడదుంప (మోరంగడ్డ), కొత్తిమీర, అల్లం, ల్యాక్టోజ్ లేని పాలు, ఆలివ్ ఆయిల్, పెరుగు వంటి వాటిల్లోనూ ఫోడ్‌మ్యాప్ తక్కువ. ఇక గోధుమల కంటే వరి, ఓట్స్‌లో ఫోడ్ మ్యాప్స్ తక్కువ.

గుర్తుంచుకోవాల్సిన అంశం ఏమిటంటే... ఐబీఎస్‌తో బాధపడేవారు ఫోడ్‌మ్యాప్ తక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. ఫోడ్‌మ్యాప్ ఎక్కువగా ఉండే ఆహారాన్ని వీలైనంత తక్కువగా తీసుకోవాలి.

## జీర్ణసంబంధమైన అనేక సమస్యలకు కొన్ని సాధారణ పరిష్కారాలు

● తక్కువ తక్కువ మోతాదుల్లో ఎక్కువ సార్లు తినండి. రోజుకు రెండు మూడు సార్లు ఎక్కువగా తినడం కంటే... తక్కువ మోతాదుల్లో 4, 5 సార్లు తినండి.

● మీ ఆహారం పీచు ఎక్కువగా ఉండే ఆహారం ఎక్కువగా తీసుకోండి. ఇందుకోసం పొట్టుతో ఉండే ధాన్యాలతో చేసిన ఆహారం, ఆకుకూరలు, తాజా పండ్లు ఎక్కువగా తినండి.

● మీ ఆహారంలో చేపలను వారంలో కనీసం రెండు-మూడు సార్ల కంటే ఎక్కువగా తీసుకోవడం మంచిది.

● ఎక్కువ కొవ్వుతో ఉండేవి, బాగా వేయించిన ఆహారపదార్థాలను వీలైనంత దూరంగా ఉండండి. ఒకవేళ తీసుకోవాల్సి వస్తే చాలా పరిమితంగా మాత్రమే తీసుకోండి.

● తినకముందే పాక్షికంగా పులిసే పదార్థాలైన ఇడ్లీ, దోసెల వంటివాటిని, (పూరీ, చపాతీల కంటే) మీ బ్రేక్‌ఫాస్ట్‌లో భాగంగా ఎక్కువగా తీసుకోండి. అలాగే ఇలా పులిసేందుకు అవకాశం పెరుగు, మజ్జిగ వంటి ఆహారాల్లో మనకూ, మన జీర్ణవ్యవస్థకు మేలు చేసే 'ప్రో-బయాటిక్' బ్యాక్టీరియా ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి ఆహారాన్ని ఎక్కువగా తీసుకోండి. అయితే అది పూర్తిగా పులియకముందే తాజాగా ఉన్నప్పుడు తినడం మంచిదని గుర్తుంచుకోండి.

● మీకు మాంసాహారం తీసుకోవాలని అనిపించినప్పుడు వేటమాంసం కంటే కొవ్వు తక్కువగా ఉంటే చికెన్‌ను లేదా చేపలను ఎంచుకోండి.


● రోజూ కనీసం రెండు లీటర్ల కంటే ఎక్కువగా మంచినీళ్లు తాగండి. ఇక కాఫీలు, ఆల్కహాలిక్ డ్రింక్స్‌కు దూరంగా ఉండండి.

● రోజూ చురుగ్గా ఉండండి. వ్యాయామం చేయండి. పొగతాగే అలవాటుకు, మద్యానికి దూరంగా ఉండండి.

● మీ బరువు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోండి.

ఇక్కడ పేర్కొన్న ఈ జాగ్రత్తలు తీసుకుంటున్నంత కాలం మన జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగ్గా ఉంటుందని గుర్తుంచుకోండి.


### హార్ట్ ఎటాక్‌గా పొరబడటమూ సహజమే!



**మ**నం తిన్న ఆహారం ఈ ఈసోఫేగస్‌లోకి వెళ్లగానే అక్కడ దానిపై యాసిడ్ ప్రభావం మొదలవుతుంది. ఈసోఫేగస్ దాదాపు గుండె ఉన్న ప్రాంతంలోనే ఉండటంతో ఈ ఛాతీలో మంటను ఒక్కోసారి గుండెమంటగా కూడా పొరబడి 'గుండెపోటు'గా అపోహపడుతుంటారు. అందుకే దీన్ని 'హార్ట్‌బర్న్' అనుకోవడం సహజంగా జరిగేదే. అయితే కొందరు తమకు నిజానికి హార్ట్ ఎటాక్ వచ్చినప్పుడు కూడా దాన్ని గ్యాస్‌ట్రబుల్‌గా పొరబడ్డ ఉదంతాలూ ఎన్నో ఉన్నాయి. కాబట్టి ఇలాంటి పరిస్థితి ఉన్నవారు ఒకసారి తగిన వైద్య పరీక్షలు చేయించుకుని, అది గుండెకు సంబంధించిన సమస్య కాదని నిర్ధారణ చేసుకున్న తర్వాతే నిశ్చింతగా ఉండటం మంచిది.

**నివారణ**

అసిడిక్ నేచర్ (ఆమ్ల స్వభావం) ఎక్కువగా ఉండే ఆహారాలైన టమాటా, నిమ్మజాతి పండ్లు, పులుపు ఎక్కువగా ఉండే పండ్లు, కూల్‌డ్రింక్స్‌లో కార్బొనేటెడ్ కోలా డ్రింక్స్ ఎక్కువగా తాగడం, కెఫిన్ ఎక్కువగా ఉండే కాఫీ, కొన్ని సందర్భాల్లో టీ ఎక్కువగా తాగడం వంటి అంశాలన్నీ ఛాతీలో మంట, గుండెల్లో మంటకు దోహదపడతాయి. పైన పేర్కొన్న వాటిని చాలా పరిమితంగా తీసుకోవడం లేదా వీలైతే తీసుకోకుండా ఉండటం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చు.



డాక్టర్ కె.ఎస్. సోమశేఖర్‌రావు
కన్సల్టెంట్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ అండ్ హెపటాలజిస్ట్,
అపోలో హాస్పిటల్స్, జూబిలీ హిల్స్, హైదరాబాద్

# క్యాన్సర్... అందరూ తెలుసుకోవాల్సిన నిజాలు

**వై**ద్యవిజ్ఞానం ఎంతగానో అభివృద్ధి చెందినా ఇప్పటికీ తెలిసిన వారికి, బంధువులకు క్యాన్సర్ అని తెలిస్తే... ఒళ్లు జలదరిస్తుంది. ఎన్నో సందేహాలు, భయాలు, అనుమానాలు వెంటాడుతుంటాయి. తొలిదశలోనే గుర్తిస్తే చికిత్సకు లొంగే క్యాన్సర్ గురించి ప్రముఖ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ చిగురుపాటి మోహనవంశీ అందిస్తున్న కొన్ని వివరాలు...

**1. క్యాన్సర్ లక్షణాలు ఎలా ఉంటాయి?**

క్యాన్సర్ లక్షణాలన్నవి ఆ వ్యాధి సోకిన అవయవాన్ని బట్టి మారుతూ ఉంటాయి. అందరిలోనూ అన్నిరకాల క్యాన్సర్లలో కనిపించే సాధారణ లక్షణాలు ఇవి... తీవ్రమైన అలసట. జ్వరం, రోగనిరోధక శక్తి తగ్గడం, ఆకలితగ్గడం, వాంతులు, విరేచనాలు, అకారణంగా బరువు తగ్గడం, రక్తహీనత. (ఇవి క్యాన్సర్ ముదిరాక కనిపించే సాధారణ లక్షణాలని తెలుసుకోండి).

**2. క్యాన్సర్ కణం శరీరంలో ఎక్కడైనా ఉందా అని ముందే తెలుసుకోవచ్చా?**

శరీరం మొత్తంలో క్యాన్సర్ కణం ఎక్కడైనా ఉందా అని ముందే తెలుసుకోడానికి నిర్దిష్టమైన పరీక్ష అయితే లేదు. ఎందుకంటే ఏ అవయవానికి క్యాన్సర్ వచ్చిందని అనుమానిస్తే... ఆ అవయవానికి సంబంధించిన పరీక్షలు వేర్వేరుగా ఉంటాయి. వీటిలో బయాప్సీ, ఎఫ్ఎన్ఏ టెస్ట్, బ్లడ్ మార్కర్స్, ఎక్స్-రే, సీటీస్కాన్, ఎమ్మారై, పెట్ స్కాన్ ఇలా.. అవసరాన్ని బట్టి రకరకాల పరీక్షలు చేస్తుంటారు. ఒక్క సర్వైకల్ క్యాన్సర్‌ను మాత్రమే పాప్‌స్మియర్ ద్వారా చాలా ముందుగా గుర్తించవచ్చు.

**3. క్యాన్సర్ రాకుండా వ్యాక్సిన్ లేదా?**

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్)కు కారణం ఖచ్చితంగా హెచ్‌పీవీ వైరస్ అని తెలుసు కాబట్టి ఇది రాకుండా అమ్మాయిలకు వ్యాక్సిన్ ఉంది. తొమ్మిదేళ్ల నుంచి పెళ్లికాని అమ్మాయిలందరూ (అంటే శృంగార జీవితం ప్రారంభం కాకముందుగా) ఈ వ్యాక్సిన్ తీసుకుంటే ఈ క్యాన్సర్ బారిన పడకుండా కాపాడుకోవచ్చు.

**4. క్యాన్సర్ నివారణ మన చేతుల్లో లేదా?**

సర్వైకల్ క్యాన్సర్‌కు తప్పితే మిగతా ఏ క్యాన్సర్‌కూ ఖచ్చితమైన కారణం తెలియదు కాబట్టి నివారణ మన చేతుల్లో లేనట్టే. అయితే పుష్కలంగా పీచుపదార్థాలు ఉండే ఆహారం, వ్యాయామం, కాలుష్యానికీ, రసాయనాలకూ దూరంగా ఉండటం, పొగతాగడం-ఆల్కహాల్ వంటి అలవాట్లకు దూరంగా ఉండటం, తరచూ ఇన్ఫెక్షన్స్ గురికాకుండా చూసుకోవడం ద్వారా కొంత మేరకు ప్రయత్నం చేయవచ్చు.

**5. ఏదైనా క్యాన్సర్స్ వంశపారంపర్యమా?**

ఖచ్చితంగా చెప్పలేం గానీ... రొమ్ము క్యాన్సర్ రక్త సంబంధీకుల్లో ఉన్నప్పుడు... మిగతా వారితో పోలిస్తే... వీళ్లకువచ్చే ముప్పు ఎక్కువ. బీఆర్‌సీఏ-1, బీఆర్‌సీఏ-2 వంటి జీన్ మ్యూటేషన్ పరీక్షల ద్వారా రొమ్ముక్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని పసిగట్టడచ్చు. రొమ్ము క్యాన్సర్ బాధితులు 80% వంశపారంపర్యంగా లేనివారే కాబట్టి ప్రతి మహిళా తన 20వ ఏటి నుంచే రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి. నెలసరి అయిన ఏడో రోజున సబ్బు చేతులతో వేళ్ల మధ్యభాగంతో రొమ్ములను పరీక్షించుకుని, చిన్న చిన్న గడ్డలు ఏవైనా తగులుతున్నాయా అని గమనించుకోవాలి. 30 ఏళ్ల నుంచి ఇతర పరీక్షలు, 40 ఏళ్ల పైబడ్డాక మామోగ్రామ్ వంటివి డాక్టర్ సలహా మేరకు ఏడాదికి ఒకసారి (ఇది కుటుంబ చరిత్రను అనుసరించి) లేదా మూడేళ్లకు ఒకసారి చేయించుకుంటే రొమ్ముక్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించగలిగితే వెంటనే చికిత్స తీసుకోని, దాని బారినుంచి విముక్తం కావడానికి అవకాశాలుంటాయి.



Dr. Ch. Mohana Vamsy
Chief Surgical Oncologist
Omega Hospitals, Hyderabad
Ph: 98480 11421,
Kurnool 08518273001

**6. క్యాన్సర్‌ను కొంతమంది జయిస్తే మరికొంత మంది తెలిసిన కొద్దిరోజుల్లోనే మరణిస్తారు. ఎందుకని?**

ప్రతి మనిషి ప్రవర్తనలో తేడా ఉన్నట్లే, క్యాన్సర్ కణం ఒక్కొక్కరిలో ఒక్కోలా ప్రవర్తిస్తూ ఉంటుంది. క్యాన్సర్‌ను జయించడం అన్న విషయం క్యాన్సర్‌ను ఏ దశలో కనుక్కున్నాం, వారి క్యాన్సర్ గడ్డకు త్వరగా పాకే గుణం ఉందా లేదా వచ్చిన ప్రదేశానికే పరిమితమయ్యిందా అనే అంశాల మీద ఆధారపడి ఉంటుంది. సర్జరీ, మందులు, థెరపీలు కూడా ఆ విషయాల మీదే ఆధారపడి ఉంటాయి. క్యాన్సర్‌ను జయించడంలో త్వరగా గుర్తించడంతో పాటు ఆ గడ్డ తాలూకు స్టేజ్, గ్రేడింగ్ కూడా చాలా ముఖ్యం.

**7. క్యాన్సర్‌కు వయోభేదం లేదా?**

లేదు. ఏ వయసువారిలోనైనా కనిపించవచ్చు. అదృష్టవశాత్తు చిన్నపిల్లల్లో వచ్చే క్యాన్సర్స్ చాలావరకు పూర్తిగా నయం చేయగలిగేవే. వయసు పెరిగేకొద్దీ క్యాన్సర్స్ వచ్చే అవకాశం చాలా ఎక్కువ. పెద్ద వయసు వారిలో వచ్చే క్యాన్సర్స్ తీవ్రత చాలా ఎక్కువ. అందుకే క్యాన్సర్ చికిత్స అన్నది కూడా రోగి వయసును బట్టి మారుతూ ఉంటుంది.

**8. క్యాన్సర్ చికిత్స సమయంలోనూ, ఆ తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటి?**

పరిశోధకులు క్యాన్సర్ చికిత్సతో వచ్చే దుష్ప్రభావాలను (సైడ్‌ఎఫెక్ట్స్‌ను) కొంతవరకు తగ్గించగలిగారు గానీ ఇప్పటికీ అవి ఎంతోకొంత ఉన్నాయి. వైద్యుల సలహాలు పాటించడం, అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్న అనుభవజ్ఞులైన డాక్టర్ దగ్గరికి వెళ్లడం, మనోధైర్యంతో యోగా, ధ్యానం వంటివి చేస్తూ ఉండటం మంచిది. పథ్యాలు ఏవీ పాటించనక్కర్లేదు. ఇంకా మంచి పోషకాహారం తీసుకోవడం చాలా ముఖ్యం. క్యాన్సర్ కణాలమీదే పనిచేసే కీమోథెరపీ, రేడియోథెరపీలతో పాటు ల్యాపరోస్కోపిక్ పద్ధతిలో చేసే కీ-హోల్ సర్జరీలు కూడా నేడు క్యాన్సర్‌కు చేయగలుగుతున్నారు. సర్జరీ చేశాక రేడియోథెరపీ, కీమో, హార్మోన్ థెరపీ వంటివి ఇచ్చినా లేదా థెరపీ తర్వాత సర్జరీ చేసినా చికిత్స అంతటితో ముగిసిందని అనుకోడానికి లేదు. క్రమం తప్పకుండా చెకప్స్‌కు వెళ్లడం, పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరి. మొదటి ఐదేళ్లలో వ్యాధి తిరగబెట్టకపోతే అది మళ్లీ వచ్చే అవకాశాలు తక్కువ. అయితే కొంతమందిలో పది, ఇరవై ఏళ్ల తర్వాత వ్యాధి వచ్చిన భాగంలో కాకుండా మరో అవయవంలో వచ్చిన సందర్భాలున్నాయి. కాబట్టి క్యాన్సర్ అదుపులో ఉంది అంటారుగానీ పూర్తిగా నయమైంది అని చెప్పలేరు. ఒక రొమ్ములో క్యాన్సర్ వచ్చిన వారిలో మరో రొమ్ములోనూ వచ్చే అవకాశాలు ఎక్కువ. అంతేకాకుండా కొన్ని రకాల క్యాన్సర్‌లు శరీరంలోని ఒక అవయవం నుంచి ఇంకో అవయవానికి విస్తరించి, మిగతా భాగాలకు వ్యాపించి, ఇతర అవయవాలకూ వచ్చే ప్రమాదం ఉంది కాబట్టి వాటిని నిర్ధారణ చేసే పరీక్షలను చికిత్స ముగిశాక కూడా చేయించుకుంటూ ఉండాలి.

**పరి పరిశోధన**

## చౌకగా కేన్సర్ వ్యాధి నిర్ధారణ...

**కే**న్సర్ మహమ్మారిని నిర్ధారించుకునేందుకు ఎంతో ఖర్చు అవుతున్న ఈ రోజుల్లో మైక్రోఫ్లూయిడిక్స్ టెక్నాలజీతో దీన్ని కారు చౌక చేసేందుకు శాస్త్రవేత్తలు చేస్తున్న ప్రయత్నాలు ఒక కొలిక్కి వస్తున్నాయి. మనిషి వెంట్రుక మందమంత చిన్న చిన్న కాలువల్లాంటి నిర్మాణాలతో కూడిన ల్యాబ్ ఆన్ చిప్ పరికరాలతో కేన్సర్‌ను సులువుగా గుర్తించవచ్చునని సిప్రియాన్ ఇలిస్క్యూ అనే రొమేనియన్ శాస్త్రవేత్త చెబుతున్నారు. అంతేకాకుండా.. ఈ ల్యాబ్ ఆన్ చిప్‌లు ఒక్కో వ్యక్తికి తగిన వైద్యం అందించేందుకు కూడా ఉపయోగపడతాయని చెప్పారు. మైక్రోఫ్లూయిడిక్స్ అభివృద్ధిపై బయో మైక్రోఫ్లూయిడిక్స్ అనే జర్నల్‌లో ప్రచురితమైన వివరాలు ఇలా ఉన్నాయి. కొన్ని కణాలను వేరుచేసి ఈ చిప్‌లలోకి పంపి... కేన్సర్ మందులను వాటిపై ప్రయోగించవచ్చునని... తద్వారా అవి ఎంత ప్రభావం చూపుతున్నాయో తెలుసుకుని అందుకు అనుగుణంగా ఆయా మందులను వాడకం మొదలుపెట్టవచ్చునని సిప్రియాన్ వివరిస్తున్నారు. ఈ ల్యాబ్ ఆన్ చిప్స్ రక్తం, లాలాజలం, స్వేదం, మూత్రం వంటి పలు జీవ ద్రవాలను విశ్లేషించగలదని.. కేన్సర్ కణితులు విడుదల చేసే నిర్దిష్ట కణాలు, ప్రొటీన్లు, కణజాలాలను గుర్తించగలదని వివరించారు. లిక్విడ్ బయాప్సీ అని పిలిచే ఈ పద్ధతి వల్ల రోగికి ఇబ్బందులు తగ్గడమే కాకుండా.. శరీరం మారుమూలల్లోని కణితులను కూడా గుర్తించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. కేన్సర్ ఏ అవయవంలో మొదలైంది.. ఇతర అవయవాలకు విస్తరించిందా? లేదా? అన్నది కూడా ఈ చిప్స్ ద్వారా తెలుసుకోవచ్చు.

## జాబిల్లిపై మరింత నీరు!



**చం**దమామపై నీటి ఉనికి, విస్తృతిని గుర్తించేందుకు చంద్రయాన్-2 మూడ్రోజుల క్రితమే నింగికి ఎగిసిన విషయం మనకు తెలిసిందే. ఈలోపుగానే కాలిఫోర్నియా శాస్త్రవేత్తలు మన సహజ ఉపగ్రహంపై ఊహించిన దానికంటే ఎక్కువ మొత్తంలోనే నీరు ఉన్నట్లు ప్రకటించేశారు. నేచర్ జియోసైన్సెస్ తాజా సంచికలో ప్రచురితమైన వివరాల ప్రకారం.. మంచుతో కూడిన బుధ గ్రహానికి, జాబిల్లిలో నిత్యం నీడలో ఉండే ప్రాంతానికి మధ్య ఎన్నో సారూప్యతలు ఉన్నాయి. దీనర్థం బుధుడి మాదిరిగానే ఈ ప్రాంతంలోనూ ఉపరితల జలం ఉండే అవకాశం ఉందన్నమాట. బుధ గ్రహపు ధ్రువ ప్రాంతాల్లోనూ భూమి నీడ పడే కొన్ని ప్రాంతాలు ఉన్నాయని.. 2009లో ఈ ప్రాంతంలోకి ప్రయోగించిన శోధక నౌక నీరు, మంచు ఆవిరి ఉన్నట్లు నిర్ధారించిందని ఇప్పటికే జరిగిన కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి. నీడలో ఉన్న భారీ గుంతల్లో (క్రేటర్స్) మీటర్ల మందంలో మంచు ఉన్నట్లు... నీడ కారణంగా ఆ నీరు సూర్యరశ్మికి ఆవిరైపోకుండా ఉన్నట్లు తెలుస్తోంది. జాబిల్లిపై కూడా అచ్చం బుధ గ్రహ పరిస్థితులను పోలినవి ఉండవచ్చునన్న అంచనాతో తాము పరిశోధనలు మొదలుపెట్టామని జాహ్నవి వెంకటరామన్ తెలిపారు. ఉష్ణగ్రతలు, నీడల్లో ఉండే క్రేటర్స్ వివరాలన్నింటినీ పరిశీలిస్తే మునుపు వేసిన అంచనాల కంటే ఎక్కువ మొత్తంలో చందమామపై నీరు ఉన్నట్లు తెలుస్తోందని తెలిపారు.

సాక్షి భవిత

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

స్పర్థయా వర్ధతే విద్య

గురువారం
25-7-2019

# అమెరికా కాదన్నా... రా రమ్మని పిలిచేవెన్నో..!

విదేశాల్లో ఉన్నతవిద్యలో చేరాలి, అక్కడే ఉద్యోగాలూ సొంతం చేసుకోవాలన్నది దేశంలోని లక్షల మంది విద్యార్థుల లక్ష్యం. ఇంతకాలంగా మన విద్యార్థులకు అమెరికా డాలర్ డ్రీమ్స్ ముఖ్య గమ్యం. కానీ, అక్కడ ట్రంప్ అధికారంలోకి వచ్చాక స్టడీ, పోస్ట్ స్టడీ వర్క్ వీసాల పరంగా సవాలక్ష ఆంక్షలు. ఏదో రకంగా అమెరికా యూనివర్సిటీలో కాలుమోపినా.. అడుగడుగునా నిబంధనల భయం! అందుకే ఇటీవల కాలంలో మన విద్యార్థులు ప్రత్యామ్నాయ దేశాలవైపు దృష్టిసారిస్తున్నారు. ఫీజులు, కోర్సులు, ఉద్యోగాల పరంగా సానుకూల విధానాలు అనుసరిస్తున్న కెనడా, ఆస్ట్రేలియా, యూకే, జర్మనీ, జపాన్‌లకు పయనమవుతన్నారు. ఈ నేపథ్యంలో అమెరికాకు దీటైన ప్రత్యామ్నాయలుగా నిలుస్తున్న దేశాలు, అందిస్తున్న కోర్సులు, పోస్ట్ స్టడీ వర్క్ అవకాశాలపై కథనం...




## ఫ్రాన్స్ ప్రత్యేక విధానాలు



ఫ్రాన్స్ కూడా మన విద్యార్థుల స్టడీ అబ్రాడ్ దేశాల జాబితాలో నిలుస్తోంది. అందుకు తగ్గట్టుగానే ఆ దేశ ప్రభుత్వం సైతం భారతీయ విద్యార్థులను ఆకర్షించేందుకు ప్రత్యేక విధానాలను అమలు చేస్తోంది. 2020 నాటికి పది వేల మంది భారత విద్యార్థులకు స్టూడెంట్ వీసాలు మంజూరు చేయాలని ఫ్రాన్స్ ప్రభుత్వం నిర్ణయించింది. ఫలితంగా ఫ్రాన్స్ ఇన్‌స్టిట్యూట్‌లకు దరఖాస్తు చేసుకుంటే వీసా సులువుగా మంజూరవుతోంది. 2017లో ఫ్రాన్స్ స్టూడెంట్ వీసాలు పొందిన భారతీయ విద్యార్థుల సంఖ్య 4,500 కాగా.. ఆ సంఖ్య 2018లో ఎనిమిది వేలకు పైగా ఉంది. అకడమిక్స్ పరంగా చూస్తే.. హ్యుమానిటీస్, ఆర్ట్స్ కోర్సులకు ఫ్రాన్స్ ప్రత్యేకంగా నిలుస్తోంది. మన దేశ విద్యార్థుల్లో అధిక శాతం మంది మేనేజ్‌మెంట్, ఇంజనీరింగ్ కోర్సుల్లోనే చేరుతున్నట్లు గణాంకాల ద్వారా స్పష్టమవుతోంది. పోస్ట్ స్టడీ వర్క్ విషయంలో రెండేళ్ల మాస్టర్ కోర్సు పూర్తయిన తర్వాత విద్యార్థులు రెండేళ్ల పాటు అక్కడే కొనసాగి ఉద్యోగాన్వేషణ చేయొచ్చు. ఈ సమయంలో ఉద్యోగం లభిస్తే స్పాన్సర్‌షిప్ లెటర్ ఆధారంగా తొలుత రెండేళ్ల కాల పరిమితితో వర్క్ పర్మిట్ మంజూరు చేస్తారు. ఆ తర్వాత దాన్ని పొడిగించుకునే అవకాశం కూడా ఉంది.

- వివరాలకు వెబ్‌సైట్: www.inde.campusfrance.org


## ఆస్ట్రేలియా.. అవకాశాలెన్నో!



భారత విద్యార్థులకు మరో ప్రధాన ప్రత్యామ్నాయ గమ్యం.. ఆస్ట్రేలియా. గతేడాది ఆ దేశానికి వెళ్లిన భారత విద్యార్థుల సంఖ్య 60వేలకు పైగా ఉంది. 2017తో పోల్చితే 2018లో ఆ సంఖ్యలో 14 శాతం వృద్ధి నమోదైంది. అకడమిక్ కోర్సులతోపాటు పోస్ట్ స్టడీ వర్క్ పరంగా ఆస్ట్రేలియా అనుసరిస్తున్న సరళీకృత విధానాలే ఇందుకు ప్రధాన కారణంగా చెప్పొచ్చు. ఇంజనీరింగ్, సైన్స్, టెక్నాలజీతోపాటు మేనేజ్‌మెంట్, హాస్పిటాలిటీ కోర్సులను అందించడంలో ఆస్ట్రేలియాలోని ఇన్‌స్టిట్యూట్‌లకు మంచి పేరుంది. రెండేళ్ల వ్యవధి గల కోర్సులు పూర్తి చేసుకున్న విదేశీ విద్యార్థులకు పోస్ట్ స్టడీ వర్క్ వీసాలను సులువుగా మంజూరు చేస్తోంది. ఆ క్రమంలో టెంపరరీ గ్రాడ్యుయేట్ వర్క్ స్ట్రీమ్ ప్రోగ్రామ్‌ను ప్రత్యేకంగా అమలు చేస్తోంది. దీని ప్రకారం రెండేళ్ల వ్యవధిలో గల కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించి.. సంబంధిత రంగంలో ఉద్యోగం సొంతం చేసుకుంటే.. తొలుత ఏడాదిన్నర (18 నెలల) కాల పరిమితి ఉండే వర్క్ వీసా మంజూరు చేస్తారు. మరోవైపు పోస్ట్ స్టడీ వర్క్ స్ట్రీమ్‌లో భాగంగా కనిష్ఠంగా రెండేళ్లు, గరిష్ఠంగా నాలుగేళ్లు ఆస్ట్రేలియాలోనే పనిచేసే అవకాశం ఉంది.

- వెబ్‌సైట్: www.border.gov.au

## సింగపూర్ సానుకూల గమ్యం



విదేశీ విద్య ఔత్సాహికులకు అన్ని రకాలుగా సానుకూల గమ్యంగా సింగపూర్‌ను పేర్కొనొచ్చు. ఇక్కడి యూనివర్సిటీలకు అంతర్జాతీయ ఇన్‌స్టిట్యూట్‌లతో ఉన్న ఒప్పందాల ఫలితంగా డ్యూయల్ డిగ్రీ, జాయింట్ డిగ్రీ ప్రోగ్రామ్‌లు చేసే అవకాశం లభిస్తోంది. ప్రస్తుతం ఏటా 35వేల మంది విదేశీ విద్యార్థులు సింగపూర్ యూనివర్సిటీల్లో ప్రవేశాలు పొందుతున్నారు. వీరిలో భారత విద్యార్థుల సంఖ్య 15 శాతం నుంచి 20 శాతం ఉంటోంది. ముఖ్యంగా ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ కోర్సుల్లోనే అధిక శాతం విద్యార్థులు చేరుతున్నారు. కోర్సు పూర్తయ్యాక ఏడాదిపాటు పోస్ట్ స్టడీ వర్క్ పేరుతో అక్కడే పనిచేసే అవకాశముంది. ఆ తర్వాత కూడా ఎంప్లాయర్ స్పాన్సర్‌షిప్ లెటర్ ఆధారంగా పొడిగించుకోవచ్చు.

- పూర్తి వివరాలకు: www.singaporeedu.gov.sg

## జపాన్ టెక్నాలజీకి పెట్టింది పేరు



సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సులకు అంతర్జాతీయంగా ప్రత్యేక గుర్తింపు పొందిన దేశం.. జపాన్. ప్రధానంగా సైన్స్, ఇంజనీరింగ్ కోర్సులకు నెలవు ఇక్కడి ఇన్‌స్టిట్యూట్‌లు. గతేడాది దాదాపు 10 వేల మంది భారతీయ విద్యార్థులు జపాన్ విద్యా సంస్థల్లో అడుగుపెట్టారు. జపాన్‌లో పోస్ట్ స్టడీ వర్క్ సరళీకృత విధానాలు అమలవుతున్నాయి. కోర్సు పూర్తయ్యాక ఉద్యోగ ప్రయత్నాలు చేసుకునేందుకు ఆరు నెలలు ఇక్కడే నివసించే అవకాశముంది. ఆ సమయంలో ఉద్యోగం లభిస్తే స్పాన్సర్‌షిప్ లెటర్ ఆధారంగా తొలుత మూడేళ్ల వ్యవధికి వర్క్ వీసా మంజూరు చేస్తారు.

- పూర్తి వివరాలకు: www.jasso.go.jp

## యూకే.. ఉద్యోగాన్వేషణకు వీలు



విదేశీ విద్య పరంగా యూకే వైపు మొగ్గుచూపుతున్న భారతీయ విద్యార్థుల సంఖ్య ఇటీవల కాలంలో గణనీయంగా పెరుగుతోంది. ముఖ్యంగా అమెరికాలో ఆంక్షలు, కెనడాలో ఖర్చుల దృష్ట్యా.. మన విద్యార్థులు యూకే బాట పడుతున్నారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో 21,165 మంది భారతీయ విద్యార్థులు యూకే స్టూడెంట్ వీసాలు సొంతం చేసుకోవడమే ఇందుకు నిదర్శనం. అంతకుముందు ఏడాదితో పోల్చితే ఈ సంఖ్య 40 శాతం పెరగడం గమనార్హం. బ్రెగ్జిట్ తదనంతర పరిణామాలతో యూకేలో పోస్ట్ స్టడీ వర్క్ అవకాశాలు మెరుగవుతున్నాయి. యూజీ, పీజీ విద్యార్థులు కోర్సు ఉత్తీర్ణత తర్వాత ఆరు నెలలు; పీహెచ్‌డీ పూర్తిచేసుకున్నాక ఏడాది పాటు అక్కడే ఉండి ఉద్యోగాన్వేషణ చేయొచ్చు. ఈ సమయంలో ఉద్యోగం లభిస్తే టైర్-2 వర్క్ వీసా సులువుగా మంజూరవుతోంది. దీనిద్వారా గరిష్ఠంగా అయిదేళ్లు యూకేలో నివశించొచ్చు. టైర్-5 విధానంలో అక్కడే ఏడాది పాటు ఇంటర్న్‌షిప్ చేసేందుకు అనుమతి లభిస్తుంది.

- వివరాలకు వెబ్‌సైట్: www.gov.uk

## మలేషియా..యూకే తరహా బోధన



మలేషియా అకడమిక్ కరిక్యులం పరంగా యూకే తరహా బోధన విధానాన్ని అనుసరిస్తోంది. గతేడాది మలేషియా యూనివర్సిటీల్లో చేరిన విదేశీ విద్యార్థుల సంఖ్య లక్షన్నర. ఇది అక్కడి ఇన్‌స్టిట్యూట్‌ల పట్ల పెరుగుతున్న ఆదరణకు నిదర్శనం. ఇక్కడ పీజీ కోర్సుల వ్యవధి ఏడాదిన్నర. వీటిని పూర్తిచేసుకున్న అభ్యర్థులకు కేటగిరీ-1, 2, 3 పేరుతో మూడు రకాల పోస్ట్ స్టడీ వర్క్ పర్మిట్ల విధానం అమల్లో ఉంది. కేటగిరీ-1లో నెలకు కనిష్ఠంగా 5 వేల రింగిట్‌ల జీతం సొంతం చేసుకున్న వారికి అయిదేళ్ల ఎంప్లాయ్‌మెంట్ పాస్ లభిస్తుంది. నెలకు అయిదు వేల లోపు రింగిట్‌ల వేతనంతో రెండేళ్ల కాంట్రాక్ట్ ఉద్యోగం పొందిన వారికి కేటగిరీ-2 ఎంప్లాయ్‌మెంట్ పాస్ లభిస్తుంది. ఉద్యోగ కాల పరిమితి ఏడాది లోపు, వేతనం 2,500-4,999 రింగిట్లు ఉంటే కేటగిరీ-3 ఎంప్లాయ్‌మెంట్ పాస్ మంజూరవుతుంది.

- వివరాలకు వెబ్‌సైట్: https://educationmalaysia.gov.my

## నెదర్లాండ్స్.. స్టడీ, పోస్ట్ స్టడీ వర్క్



స్టడీ, పోస్ట్ స్టడీ వర్క్ అవకాశాల పరంగా అంతర్జాతీయంగా విద్యార్థులను ఆకర్షిస్తున్న మరో దేశం.. నెదర్లాండ్స్. 2017-18 విద్యా సంవత్సరంలో 81,392 మంది విదేశీ విద్యార్థులు నెదర్లాండ్స్‌లోని ఇన్‌స్టిట్యూట్‌లలో అడుగుపెట్టారు. వీరిలో ఎనిమిది వేల మంది భారత విద్యార్థులు. అకడమిక్‌గా చూస్తే.. కోర్సుల వ్యవధి కనిష్ఠంగా ఏడాది, గరిష్ఠంగా రెండేళ్లు ఉంటుంది. వీటిని పూర్తిచేసుకున్న వారికి పోస్ట్ స్టడీ వర్క్ అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. కోర్సు పూర్తిచేసుకున్న తర్వాత ఏడాది పాటు ఉద్యోగాన్వేషణ సాగించొచ్చు. ఆ సమయంలో ఉద్యోగం సొంతం చేసుకుంటే.. తొలుత మూడేళ్ల కాల పరిమితితో వర్క్ పర్మిట్ లభిస్తుంది.

- వెబ్‌సైట్: www.studyinholland.nl

## న్యూజిలాండ్ సరికొత్త గమ్యం



ఉన్నత విద్య, ఉపాధి అవకాశాల పరంగా సరికొత్త గమ్యం.. న్యూజిలాండ్. ఇది మన విద్యార్థులకు అకడమిక్ కోర్సులు, పోస్ట్ స్టడీ వర్క్ అవకాశాల పరంగా మరో ఉత్తమ ప్రత్యామ్నాయం. గతేడాది దాదాపు 25 వేల మంది భారతీయ విద్యార్థులు న్యూజిలాండ్‌లోని యూనివర్సిటీల్లో అడుగుపెట్టారు. వీరిలో అధిక శాతం మంది మేనేజ్‌మెంట్ కోర్సుల్లో చేరినట్లు గణాంకాల ద్వారా తెలుస్తోంది. మరోవైపు విదేశీ విద్యార్థులను ఆకర్షించేందుకు న్యూజిలాండ్.. ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ స్ట్రాటజీ 2018-30 అనే కొత్త విధానాన్ని రూపొందించింది. దీని ప్రకారం-విదేశీ విద్యార్థుల సంఖ్యను 2030 నాటికి రెట్టింపు చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకుంది. అందుకోసం విదేశీ విద్యార్థులకు పలు ప్రోత్సాహకాలు సైతం అందిస్తోంది. పోస్ట్ స్టడీ వర్క్ పరంగా.. కోర్సు పూర్తిచేసుకున్న తర్వాత జాబ్ సెర్చ్ వీసా ద్వారా ఏడాది పాటు ఆ దేశంలోనే ఉండి ఉద్యోగాన్వేషణ సాగించొచ్చు. ఆ సమయంలో ఉద్యోగం లభిస్తే గరిష్ఠంగా మూడేళ్లు అక్కడే కొలువుదీరొచ్చు.

- వెబ్‌సైట్: www.immigration.govt.nz

## కెనడా తొలి ఎంపిక



ట్రంప్ అధికారంలోకి వచ్చాక అమెరికాలో వీసా ఆంక్షలు పెరిగాయి. ఇలాంటి పరిస్థితిలో మన దేశ విద్యార్థులకు తొలి ప్రత్యామ్నాయంగా నిలుస్తున్న దేశం కెనడా. అధికారిక గణాంకాల ప్రకారం 2018లో 1,07,795 మంది భారత విద్యార్థులు కెనడాలోని యూనివర్సిటీల్లో ప్రవేశాలు పొందడమే ఇందుకు నిదర్శనం. కెనడాలోని మొత్తం విదేశీ విద్యార్థుల్లో భారతీయ విద్యార్థుల సంఖ్య తొలి స్థానంలో ఉండటం విశేషం. మన విద్యార్థులు కెనడాను ప్రత్యామ్నాయంగా చేసుకోవడానికి పలు కారణాలున్నాయి. అకడమిక్ పరంగా చూస్తే రీసెర్చ్ ఆధారిత విద్యా విధానంతోపాటు.. అక్కడి యూనివర్సిటీల మధ్య అకడమిక్ ఎక్స్ఛేంజ్ విధానాల వల్ల విద్యార్థులకు వివిధ అంశాల్లో నైపుణ్యం లభిస్తోంది. అంతేకాకుండా పోస్ట్ స్టడీ వర్క్ పరంగా 'పోస్ట్ గ్రాడ్యుయేట్ వర్క్ పర్మిట్' విధానాన్ని కెనడా ప్రభుత్వం అమలు చేస్తోంది. దీనివల్ల కెనడాలోని యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్‌లలో కోర్సులు పూర్తిచేసుకున్న విద్యార్థులు ఉద్యోగ ఆఫర్ లేకపోయినా.. మూడేళ్లపాటు కెనడాలోనే ఉండి.. ఏదో ఒక ఉద్యోగం చేసుకునే వెసులుబాటు లభిస్తోంది. కనిష్ఠంగా ఎనిమిది నెలలు వ్యవధి గల కోర్సు పూర్తిచేసుకుంటే చాలు.. ఆ ఎనిమిది నెలల వ్యవధికి సరిపడే కాల పరిమితితో పోస్ట్ స్టడీ వర్క్ పర్మిట్‌ను కూడా కెనడా ప్రభుత్వం మంజూరు చేస్తోంది.

- వివరాలకు వెబ్‌సైట్: www.cig.gc.ca

## జర్మనీ! రీసెర్చ్‌కు కేరాఫ్



మన దేశ విద్యార్థులకు మరో మంచి ప్రత్యామ్నాయం.. జర్మనీ. ఇంజనీరింగ్, సైన్స్ విభాగాల్లో రీసెర్చ్‌కు జర్మనీ కేరాఫ్‌గా నిలుస్తోంది. అంతేకాకుండా అక్కడి యూనివర్సిటీల్లో విద్యాబోధన, ఫీజులు, పోస్ట్ స్టడీ వర్క్ విధానాలు భారతీయ విద్యార్థులను ఆకట్టుకుంటున్నాయి. జర్మన్ ప్రభుత్వ యూనివర్సిటీల్లో ఫీజులు సెమిస్టర్‌కు 500 నుంచి 700 యూరోల మధ్య ఉండటం మన విద్యార్థులకు సానుకూలం. అందుకే గత కొంతకాలంగా జర్మనీకి వెళుతున్న భారత విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. 2017-18 వింటర్ సెమిస్టర్‌లో గణాంకాల ప్రకారం-17,570 మంది భారతీయ విద్యార్థులు జర్మనీలోని ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రవేశాలు పొందారు. అంతకుముందు ఏడాదితో పోల్చితే ఈ సంఖ్య 13 శాతం అధికం. భారతీయ విద్యార్థులు ఇంజనీరింగ్ కోర్సుల్లో ఎక్కువగా చేరుతున్నారు. మరోవైపు ఎలాంటి కాలపరిమితి ఆంక్షలులేని విధంగా పోస్ట్ స్టడీ వర్క్ వీసా సదుపాయం అందుబాటులో ఉండటం మన విద్యార్థులకు కలిసొస్తోంది. కోర్సు పూర్తిచేసుకున్న తర్వాత 18 నెలలపాటు జర్మనీలోనే ఉండి ఉద్యోగాన్వేషణ సాగించొచ్చు. ఈ సమయంలో ఉద్యోగం ఖరారు చేసుకుంటే.. స్పాన్సర్ లెటర్ ఆధారంగా వర్క్ వీసా లభిస్తుంది.

- వివరాలకు వెబ్‌సైట్: www.daad.de

### ప్రత్యామ్నాయ దేశాలు.. ముఖ్యాంశాలు

- కెనడాకు అధికంగా వెళుతున్న భారత విద్యార్థులు.
- ప్రతి దేశంలోనూ పోస్ట్ స్టడీ వర్క్ అవకాశాలు.
- యూకే, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో పీజీ కోర్సుల వ్యవధి ఏడాది.
- జర్మనీ, జపాన్‌లో నామ మాత్రపు ఫీజులతో కోర్సులు పూర్తిచేసుకోవచ్చు.
- న్యూజిలాండ్, మలేషియా, సింగపూర్‌లపైనా భారత విద్యార్థుల ఆసక్తి.
- స్ప్రింగ్, ఫాల్ సెషన్స్ పేరుతో ఏటా రెండుసార్లు ప్రవేశాల ప్రక్రియ.

### విదేశీ విద్య.. అవసరమైన పత్రాలు

- అకడమిక్ సర్టిఫికెట్స్
- అడ్మిషన్ కన్ఫర్మేషన్ లెటర్
- లెటర్ ఆఫ్ రికమండేషన్
- స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్
- ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్
- స్పాన్సర్‌షిప్ లెటర్
- స్టాండర్డ్ టెస్ట్ స్కోర్స్
- పాస్‌పోర్ట్



# విద్య, ఉద్యోగ సమాచారం

### ఎస్‌బీఐలో స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులు

ప్రభుత్వ రంగ బ్యాంకు ఎస్‌బీఐ స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 76.
- **ఖాళీల వివరాలు:** డిప్యూటీ జనరల్ మేనేజర్-1, ఎస్ఎంఈ క్రెడిట్ అనలిస్ట్ (సెక్టర్ స్పెషలిస్ట్)-25, క్రెడిట్ అనలిస్ట్-50.
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టులో గ్రాడ్యుయేషన్, సీఏ, ఎంబీఏ (ఫైనాన్స్), సీఎఫ్ఏ, బీఈ/బీటెక్, ఎంబీఏ, పీజీడీఎం ఉత్తీర్ణత, అనుభవం.
- **వయసు:** 23-35 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** 12.08.2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://bank.sbi/careers

### ఆర్కిటెక్చర్ కోర్సుల్లో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ (జేఎన్ఏఎఫ్ఏయూ).. తెలంగాణలోని ఇన్‌స్టిట్యూట్స్‌లో బీఆర్క్ కోర్సుల్లో 2019-20 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **కోర్సు:** బీఆర్క్(రెగ్యులర్).
- **అర్హతలు:** ఇంటర్ ఎంపీసీతోపాటు నాటా-2019 /జేఈఈ మెయిన్ 2019-పేపర్ 2లో ఉత్తీర్ణత.
- **దరఖాస్తు:** అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్లో రిజిస్టర్ చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేది:** 2019, జూలై 31.
- **దరఖాస్తు ఫీజు:** ఓసీ/బీసీలకు రూ.1500. ఎస్సీ/ఎస్టీలకు రూ.800.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** http://barchadm.tsche.ac.in

### జేఎన్‌యూలో 271 టీచింగ్ పోస్టులు

న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 271 (ప్రొఫెసర్-110, అసోసియేట్ ప్రొఫెసర్-157, అసిస్టెంట్ ప్రొఫెసర్ -157).
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టులో పీహెచ్‌డీతోపాటు నెట్/స్లెట్/సెట్; అనుభవం.
- **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూల ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
- **దరఖాస్తులు:** ఆఫ్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.1000.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** 19.08.2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://jnu.ac.in

సాక్షి స్పోర్ట్స్
గురువారం
25-7-2019

### ఒక్కో పోస్టుకు రూ. కోటీ 35 లక్షలు...

'ఇన్‌స్టాగ్రామ్'లో పోస్టు పెట్టడం ద్వారా భారీగా ఆర్జిస్తున్న ఆటగాళ్ల జాబితాలో కోహ్లి 9వ స్థానంలో ఉన్నాడు. కోహ్లి చేసే ఒక్కో పోస్టుకు ఆయా బ్రాండ్‌లు 1 లక్షా 96 వేల డాలర్లు (సుమారు రూ. 1 కోటి 35 లక్షలు) చెల్లిస్తాయి. ఈ జాబితాలో ఫుట్‌బాల్ స్టార్లు రొనాల్డో, నెమార్, మెస్సీ వరుసగా టాప్‌-3లో ఉన్నారు. హాపర్‌హెచ్‌క్యూ అనే సంస్థ ఈ ఇన్‌స్టాగ్రామ్ రిచ్ లిస్ట్ 2019ని విడుదల చేసింది.



# నేను తప్పులు చేశా... వారు చేయకుండా ఆపుతున్నా!

విరాట్ కోహ్లి ప్రపంచ క్రికెట్‌ను శాసించే బ్యాట్స్‌మన్‌గా ఎదగక ముందు ఎలా ఉన్నాడో గుర్తుందా? మైదానంలో అనవసర దూకుడు, మాట్లాడితే బూతులు, వరుస వివాదాలు అతనికి చెడ్డ పేరు తెచ్చి పెట్టాయి. ఆ తర్వాత ఆటతో పాటు వ్యక్తిగతంగా కోహ్లిలో పెను మార్పు వచ్చి అతడిని దిగ్గజ స్థాయిలో నిలబెట్టింది. ఈ విషయం అతనికీ బాగా తెలుసు. తాను తప్పులు చేశానని ఒప్పుకుంటూ జూనియర్లు అలాంటి పని చేయకుండా నిరోధిస్తున్నానని విరాట్ అంటున్నాడు.

- యువ క్రికెటర్లకు మార్గనిర్దేశనంపై విరాట్ కోహ్లి
- వరల్డ్ కప్ ప్రదర్శనను చిన్నదిగా చూడవద్దన్న స్టార్ బ్యాట్స్‌మన్
- టెస్టు చాంపియన్‌షిప్‌ను స్వాగతించిన భారత కెప్టెన్

**న్యూఢిల్లీ:** వన్డే వరల్డ్ కప్ సెమీఫైనల్లో న్యూజిలాండ్ చేతిలో ఓటమి తర్వాత తొలిసారి మీడియాతో సవివరంగా మాట్లాడిన భారత కెప్టెన్... వేర్వేరు అంశాలపై తన మనసులో మాటను బయటపెట్టాడు. కోహ్లి ఇంటర్వ్యూ విశేషాలు అతని మాటల్లోనే...

**వరల్డ్ కప్‌లో ఓటమిపై...**

నేను నా జీవితంలో పరాజయాల నుంచే ఎక్కువ పాఠాలు నేర్చుకున్నాను. పెద్ద ఓటములే ముందు ముందు ఇంకా బాగా ఆడేలా స్ఫూర్తినిచ్చాయి. మున్ముందు ఏం చేయాలనే విషయంపై దిశానిర్దేశం చేశాయి. ఇలాంటి సమయంలోనే మనతో ఎవరు ఉంటారో, ఎవరు గోడ దూకుతారో కూడా తెలిసిపోతుంది. దురదృష్టం ఏమిటంటే అందరూ అద్భుతంగా ఆడుతున్నారు అనిపించిన సమయంలో మరో జట్టు మనకంటే బాగా ఆడిందని తెలుస్తుంది. దీనిని జీర్ణించుకోవడం చాలా కష్టం. ఏదైనా తప్పు చేస్తే చెప్పవచ్చు గానీ తప్పు చేయకపోయినా ఓడిపోయామని తెలిస్తే ఎలా ఉంటుంది! వరల్డ్ కప్‌లో ఏం సాధించామో దానిని చూసి గర్వపడాలని మేమంతా చెప్పుకున్నాం. మన ఘనతను మనం చెప్పుకోకుండా ఉంటే ఎలా? ఓటమి ఎదురైనంత మాత్రాన మన శ్రమను తక్కువ చేసి చూపవద్దని అందరం నిర్ణయించుకున్నాం.

**ఈ స్థాయికి చేరడంపై...**

పోరాడటం వదిలేస్తే మన ప్రయాణం ముగిసిపోయినట్లే. ఉదయం లేచిన దగ్గరి నుంచి కష్టపడటం, చేసిన పనినే మళ్లీ మళ్లీ చేయడం మినహా మరో మార్గం లేదు. వీటిని పునరావృతం చేస్తేనే నిలకడ, విజయాలు వస్తాయి. నిజానికి ఇదంతా చాలా విసుగు తెప్పిస్తుంది. అయినా సరే చేయాల్సి రావడం చాలా కష్టం. గోల్ఫ్ ఆటగాళ్లు ఒకే షాట్‌ను ఎన్ని సార్లు ప్రాక్టీస్ చేస్తారో కదా. యూఎస్ ఓపెన్ చాంపియన్‌గా నిలిచినా సరే అది అలా చేయాల్సిందే. ఎందుకంటే అలా చేస్తేనే తర్వాత దాని ఫలితం దక్కుతుంది. క్రికెట్‌లో అడుగు పెట్టినప్పుడు దేవుడు నా కోసం ఏం రాసి పెట్టాడో తెలీదు. దేని గురించి కూడా ఊహించలేదు. నాలో మరీ అంత గొప్ప సామర్థ్యం లేదని నాకూ తెలుసు. అయితే నా చుట్టూ ఉన్న వారితో పోలిస్తే ఎంతైనా కష్టపడగలనని, ఎంత శ్రమకైనా ఓర్చుకోగలననే విషయం మాత్రం నాకు బాగా తెలుసు. దేవుడు బహుశా ఈ శ్రమనే చూసినట్లున్నాడు!

**క్రికెట్ బయట జీవితంపై...**

నేను నా కోసం క్రికెట్ ఆడుతున్నానే తప్ప ఎవరిని మెప్పించడానికో కాదు. నా ఉద్దేశాలు, ఆలోచనలు స్పష్టం. అయితే ఆ తర్వాత సహజంగానే క్రికెట్ తర్వాత కూడా జీవితం ఉందనే వాస్తవం అర్థమవుతుంది. అప్పటి వరకు ఆటనే సర్వస్వం అనిపించినా భార్య, కుటుంబానికి కూడా సమయం కేటాయించాలి. అప్పుడు అవి ప్రాధాన్యతలుగా మారిపోతాయి. మతపరమైన అంశాల్లో నేను భాగం కాను. మొదటి నుంచీ ఏ మతంతో నన్ను నేను ముడి వేసుకోలేదు. అన్ని మతాలతో, అందరు మనుషులతో కలిసిపోతా. నాకు తెలిసి మనందరిలో ఆధ్యాత్మికత ఉంటుంది.

**కొత్త కుర్రాళ్లతో సాన్నిహిత్యంపై...**

రిషభ్ పంత్, శుబ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్‌లాంటి కుర్రాళ్లంతా అద్భుతమైనవారు. గతంలోనే చెప్పినట్లు నేను 19–20 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు ఆలోచనా ధోరణితో పోలిస్తే వీరంతా చాలా ముందున్నారు. ఐపీఎల్‌తో ఆట మెరుగుపడితే... తప్పుల నుంచి నేర్చుకోవడం మొదలు ఇతరత్రా వాటిలో కూడా వారిలో ఆత్మవిశ్వాసంపాళ్లు చాలా ఎక్కువ. కుర్రాళ్లపై కోపం ప్రదర్శించే సంస్కృతి మా జట్టులో లేదు. వారు కూడా సీనియర్లలాగే మనసు విప్పి మాట్లాడవచ్చు. నేనైతే వారి దగ్గరకు వెళ్లి 'నేను ఇలాంటి తప్పులు చేశాను. మీరు మాత్రం అలా చేయకండి' అంటూ విడమర్చి చెబుతాను. ఎందుకంటే ఎదుగుతున్న సమయంలో నేను చాలా తప్పులు చేశాను. కెరీర్ ఆరంభంలో ఇతర విషయాలపై దృష్టి పెట్టి ఆటపై ఏకాగ్రత కనబర్చలేకపోయాను. అదృష్టవశాత్తూ మళ్లీ దారిలో పడ్డాను.

**రాబోయే టెస్టు చాంపియన్‌షిప్‌పై...**

నేను కూడా ఆసక్తిగా ఎదురు చూస్తున్నా. సరైన సమయంలో ఇది జరుగుతోంది. ఆడేది ద్వైపాక్షిక సిరీస్‌లే అయినా వాటి ప్రాధాన్యత పెరిగిపోతుంది. కాబట్టి ప్రతీ సిరీస్ కోసం ప్రత్యేక ప్రణాళికతో సిద్ధం కావాల్సి ఉంటుంది. గతంలోనే టెస్టు చాంపియన్‌షిప్ గురించి ఆలోచించా. ఇప్పుడది వాస్తవ రూపం దాలుస్తోంది.

## నిఖత్, హుసాముద్దీన్‌లకు పతకాలు ఖాయం





**బ్యాంకాక్:** థాయ్‌లాండ్ ఓపెన్ అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారత బాక్సర్ల జోరు కొనసాగుతోంది. భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ బాక్సర్లు నిఖత్ జరీన్ (మహిళల 51 కేజీలు), హుసాముద్దీన్ (పురుషుల 56 కేజీలు)లతో పాటు మంజు రాణి (49 కేజీలు), ఆశిష్ (69 కేజీలు), బ్రిజేశ్ యాదవ్ (81 కేజీలు), దీపక్ సింగ్ (49 కేజీలు) కూడా సెమీస్ చేరి కనీసం కాంస్య పతకాలను ఖాయం చేసుకున్నారు. క్వార్టర్ ఫైనల్స్‌లో నిఖత్ 5–0తో సిటోరా షాగ్‌దరోవా (ఉజ్బెకిస్తాన్)పై, హుసాముద్దీన్ 5–0తో లీ యెచాన్ (దక్షిణ కొరియా)పై విజయం సాధించారు.

## టోక్యో ఒలింపిక్స్ పతకాల ఆవిష్కరణ



**టోక్యో:** ప్రతిష్టాత్మక ఒలింపిక్స్‌లో విజేతలకు ప్రదానం చేసే పతకాలను ఆతిథ్య దేశం జపాన్ బుధవారం విడుదల చేసింది. ఆ దేశ రాజధాని నగరం టోక్యో వేదికగా జరుగనున్న విశ్వ క్రీడా పండుగకు సరిగ్గా ఏడాది వ్యవధి ఉన్న నేపథ్యంలో బుధవారం వీటిని ప్రజల ముందుకు తెచ్చింది. దీంతో నగరవ్యాప్తంగా ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. 1976 క్రీడల ఫెన్సింగ్ స్వర్ణ పతక విజేత, అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసి) అధ్యక్షుడు థామస్ బాచ్.. పాఠశాల విద్యార్థులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. టోక్యో సన్నాహాలు అత్యద్భుతంగా సాగుతున్నాయని ఆయన కొనియాడారు. 20 బిలియన్ డాలర్ల వ్యయంతో ఒలింపిక్స్ నిర్వహించాలని జపాన్ ప్రణాళికలు వేస్తోంది.

## భారత జట్టు ఫీల్డింగ్ కోచ్ బరిలో జాంటీ రోడ్స్



**ముంబై:** మైదానంలో పాదరసం లాంటి కదలికలతో క్రికెట్ ఫీల్డింగ్‌కు కొత్త పాఠాలు నేర్పిన దక్షిణాఫ్రికా క్రికెటర్ జాంటీ రోడ్స్ ఇప్పుడు భారత జట్టుకు శిక్షకుడిగా పని చేయాలని భావిస్తున్నాడు. బీసీసీఐ ప్రకటనకు స్పందిస్తూ టీమిండియా ఫీల్డింగ్ కోచ్ పదవి కోసం రోడ్స్ దరఖాస్తు చేసుకున్నాడు. ఈ నెల 27న 50వ పుట్టినరోజు జరుపుకోబోతున్న రోడ్స్ తొమ్మిది సీజన్ల పాటు ఐపీఎల్ జట్టు ముంబై ఇండియన్స్‌కు ఫీల్డింగ్ కోచ్‌గా వ్యవహరించాడు. ఇదే అనుభవంతో తాను భారత జట్టుతో కలిసి పని చేయాలనుకుంటున్నట్లు అతను చెప్పాడు. 'భారత్‌తో నాది ప్రత్యేక అనుబంధం. నాకు, నా భార్యకు ఈ దేశమంటే చాలా ఇష్టం. మా ఇద్దరు పిల్లలు ఇక్కడే పుట్టారు. గత కొన్నేళ్లలో టీమిండియా ఫీల్డింగ్ ప్రమాణాలు చాలా పెరిగిపోయాయి. అలాంటి టీమ్‌తో పని చేయాలని కోచ్ పదవి కోసం దరఖాస్తు చేశాను' అని జాంటీ వెల్లడించాడు.



## టైటాన్స్ హ్యాట్రిక్ ఓటమి

**దబంగ్ ఢిల్లీ చేతిలో పాయింట్ తేడాతో పరాజయం**

**సాక్షి, హైదరాబాద్:** ప్రొ కబడ్డీ లీగ్ ఏడో సీజన్‌లో తెలుగు టైటాన్స్ వరుసగా మూడో పరాజయంతో హ్యాట్రిక్ నమోదు చేసింది. కానీ ఈ సారి గెలిచేందుకు చివరిదాకా కష్టపడింది. మ్యాచ్ ముగిసే దశలో కాస్త ఉత్కంఠరేపినా... స్వల్ప ఆధిక్యాన్ని కాపాడుకున్న దబంగ్ ఢిల్లీ కేసీ జట్టు 34–33తో తెలుగు టైటాన్స్‌పై గట్టెక్కింది. కేవలం పాయింట్ తేడాతో టైటాన్స్ పరాజయం చవిచూసింది. కోటి ఆశల సిద్ధార్థ్ దేశాయ్ నిరాశపరిచాడు. జట్టు తురుపుముక్కగా బరిలోకి దిగిన ఈ రైడర్ 13 సార్లు కూతకు వెళ్లి కేవలం 8 పాయింట్లే చేశాడు. ఇతని సోదరుడు సూరజ్ దేశాయ్ అదరగొట్టాడు. 15 సార్లు రైడింగ్‌కు వెళ్లి 18 పాయింట్లు తెచ్చిపెట్టాడు. స్టార్ డిఫెండర్ విశాల్ భరద్వాజ్ కూడా నిరాశపరిచాడు. ప్రత్యర్థి రైడర్లను పట్టేందుకు 7 సార్లు కష్టపడిన భరద్వాజ్ కేవలం 4 పాయింట్లే సాధించాడు. మిగతా ఆటగాళ్లలో అమిత్ 2 పాయింట్లు చేశాడు. దబంగ్ ఢిల్లీ జట్టులో రైడర్లు నవీన్ కుమార్ (14 పాయింట్లు), చంద్రన్ రంజీత్ (6) జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. డిఫెండర్లలో జోగిందర్ నర్వాల్ (4), రవీందర్ పహల్ (3) రాణించారు.

**యూపీ యోధ చిత్తుగా...**

అంతకుముందు జరిగిన తొలి మ్యాచ్‌లో యూపీ యోధ 17–48 స్కోరుతో బెంగాల్ వారియర్స్ చేతిలో చిత్తుగా ఓడింది. రైడర్లు మొహమ్మద్ నబీబక్ష్ (10), మణిందర్ సింగ్ (9) చెలరేగారు. డిఫెండర్లు కూడా తమ వంతుగా రాణించడంతో బెంగాల్ స్కోరు అమాంతం పెరిగింది. బల్‌దేవ్ సింగ్ 7, రింకూ నర్వాల్ 4, జీవా కుమార్ 3 పాయింట్లు సాధించారు. యూపీ యోధ తరఫున మోను గోయత్ (6), సురేందర్ సింగ్, నితీశ్ కుమార్ చెరో 3 పాయింట్లు చేశారు. నేడు జరిగే మ్యాచ్‌లో దబంగ్ ఢిల్లీతో తమిళ్ తలైవాస్ జట్టు తలపడుతుంది.



మాక్సిమ్ డడ్‌షెవ్

## ప్రాణం తీసిన పంచ్

- రింగ్‌లో రష్యన్ బాక్సర్‌కు తీవ్ర గాయాలు
- చికిత్స పొందుతూ మృతి చెందిన మాక్సిమ్ డడ్‌షెవ్

**మాస్కో:** రింగ్‌లో ప్రత్యర్థి పిడిగుద్దులు ఓ యువ బాక్సర్ ఉసురు తీశాయి. ప్రొఫెషనల్ ఆటలో భౌతిక దాడి స్థాయిలో విసిరిన పంచ్‌లు నిండు ప్రాణాలను బలిగొన్నాయి. ఈ విషాద ఘటన అమెరికాలో చోటు చేసుకుంది. వివరాలు... మేరీలాండ్ పరిధి అక్సన్ హిల్‌లో గత శుక్రవారం రాత్రి మాక్సిమ్ డడ్‌షెవ్ (రష్యా), సుబ్రియెల్ మటియాస్ (ప్యూర్టోరికో) మధ్య ప్రపంచ బాక్సింగ్ సమాఖ్య (ఐబీఎఫ్) సూపర్ లైట్ వెయిట్ విభాగంలో బౌట్ జరిగింది. ఇందులో మటియాస్ వరుసగా విసిరిన పంచ్‌ల ధాటికి 28 ఏళ్ల డడ్‌షెవ్ దిమ్మతిరిగింది. డ్రెస్సింగ్ రూమ్ వరకు సైతం నడవలేని పరిస్థితుల్లో ఉన్న అతడిని హుటాహుటిన వాషింగ్టన్‌లోని ఆస్పత్రిలో చేర్చారు. మెదడులో అంతర్గతంగా తీవ్ర రక్తస్రావం కావడంతో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. డడ్‌షెవ్ తాను తలపడిన గత 13 బౌట్లలో అజేయంగా నిలిచాడు. శుక్రవారం నాటి పోరులో మాత్రం మటియాస్ ముందు నిలవలేకపోయాడు. ఆరంభం నుంచే దూకుడు చూపిన మటియాస్... ప్రత్యర్థి తప్పించుకోలేనంతగా బలమైన పంచ్‌లు విసిరాడు. వీటికి డడ్‌షెవ్ తాళలేకపోయాడు. 11వ రౌండ్ తర్వాత కుప్పకూలిన అతడు గ్లోవ్స్ చాటున తలదాచుకుంటూ 'ఇక ఆపదల్చుకున్నాను' అని సంకేతాలిచ్చాడు. కానీ, అప్పటికే నష్టం జరిగిపోయింది. ఆస్పత్రిలో అత్యవసర వార్డులో చేర్చి చికిత్స చేసినా ప్రాణం దక్కలేదు. దీనిపై కార్నర్‌మన్ మెక్‌గ్రిట్ మాట్లాడుతూ... బౌట్‌ను ఆపేలా డడ్‌షెవ్‌ను ఒప్పించలేకపోయానని అంటున్నాడు. మరోవైపు రష్యా బాక్సింగ్ సమాఖ్య ఈ బౌట్‌పై విచారణ జరుపుతోంది. ఈ బౌట్‌లో నిబంధనల ఉల్లంఘన జరిగిందని సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఉమర్ క్రెమ్లెవ్ ఆరోపించాడు. డడ్‌షెవ్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. అతడి కుటుంబాన్ని ఆదుకుంటామని ఉమర్ ప్రకటించారు.

## సింధు ముందుకు... శ్రీకాంత్ ఇంటికి



శ్రీకాంత్

**జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ**



**టోక్యో:** ఈ సీజన్‌లో తన నిరాశాజనక ప్రదర్శన కొనసాగిస్తూ భారత బ్యాడ్మింటన్ స్టార్ ప్లేయర్, ప్రపంచ మాజీ నంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్ జపాన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్‌–750 టోర్నమెంట్‌లో తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టాడు. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు శుభారంభం చేసి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరింది. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ పదో ర్యాంకర్ శ్రీకాంత్ 21–13, 11–21, 20–22తో భారత్‌కే చెందిన ప్రపంచ 34వ ర్యాంకర్ హెచ్‌ఎస్ ప్రణయ్ చేతిలో ఓడిపోయాడు. ఈ మ్యాచ్‌కు ముందు శ్రీకాంత్ చేతిలో వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో ఓడిన ప్రణయ్ ఈసారి మాత్రం సంచలన ప్రదర్శన చేసి తన సహచరుడికి షాక్ ఇచ్చాడు. 2011లో ఏకైకసారి శ్రీకాంత్‌ను ఓడించిన ప్రణయ్ ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ అతడిపై గెలుపొందడం విశేషం. మరో సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో సమీర్ వర్మ (భారత్) 17–21, 12–21తో ఆంటోన్సన్ (డెన్మార్క్) చేతిలో ఓటమి చవిచూశాడు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ఐదో సీడ్ సింధు 21–9, 21–17తో హాన్ యుయె (చైనా)పై గెలిచింది. 37 నిమిషాల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో సింధుకు రెండో గేమ్‌లో కాస్త పోటీ ఎదురైంది. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో నేలకుర్తి సిక్కి రెడ్డి–ప్రణవ్ చోప్రా (భారత్) జంట 11–21, 14–21తో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ జోడీ జెంగ్ సి వె–హువాంగ్ యా కియోంగ్ (చైనా) చేతిలో ఓడింది. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో సిక్కి రెడ్డి–అశ్విని పొన్నప్ప (భారత్) ద్వయం 16–21, 14–21తో కిమ్ సో యోంగ్–కాంగ్ హీ యోంగ్ (కొరియా) జంట చేతిలో పరాజయం పాలైంది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) జోడీ 21–16, 21–17తో మార్కస్ ఇలిస్–క్రిస్ లాంగ్‌రిడ్జ్ (ఇంగ్లండ్) జంటపై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరింది. నేడు జరిగే సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో అయా ఒహోరి (జపాన్)తో సింధు; కాంటా సునెయామ (జపాన్)తో సాయిప్రణీత్; రాస్‌ముస్ గెమ్కే (డెన్మార్క్)తో ప్రణయ్ తలపడతారు.

## ఇంగ్లండ్ 85; ఐర్లాండ్ 207

**ఆతిథ్య జట్టును కుప్పకూల్చిన ఐరిష్ పేసర్లు**



ముర్టాగ్ (5/13)

**లండన్:** సరిగ్గా పది రోజుల క్రితం వన్డే ప్రపంచ కప్ గెలిచిన లార్డ్స్‌లో... అదికూడా పసికూన ఐర్లాండ్ చేతిలో ఇంగ్లండ్‌కు టెస్టులో చేదు అనుభవం ఎదురైంది. రెండు జట్ల మధ్య బుధవారం ఇక్కడ ప్రారంభమైన నాలుగు రోజుల ఏకైక టెస్టు మ్యాచ్‌లో ఇంగ్లండ్‌ను ఐరిష్ పేసర్లు కుప్పకూల్చారు. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆతిథ్య జట్టు... ప్రత్యర్థి పేసర్లు ముర్టాగ్ (5/13); మార్క్ అడైర్ (3/32); రాన్‌కిన్ (2/5) ధాటికి తొలి ఇన్నింగ్స్‌లో 23.4 ఓవర్లలో 85 పరుగులకే ఆలౌటైంది. జాన్ డెన్లీ (23) టాప్ స్కోరర్. ప్రధాన బ్యాట్స్‌మెన్‌లో కెప్టెన్ రూట్ (2) సహా మరె వరూ రెండంకెల స్కోరు చేయలేకపోయారు. స్యామ్ కరన్ (18), స్టోన్ (19) బ్యాట్ ఝుళిపించకుంటే ఆ మాత్రం పరుగులైనా వచ్చేవి కాదు. అనంతరం ఐర్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 58.2 ఓవర్లలో 207 పరుగులకు ఆలౌటై 122 పరుగుల ఆధిక్యాన్ని సంపాదించింది. వన్‌డౌన్ బ్యాట్స్‌మన్ బాల్‌బిర్నీ (69 బంతుల్లో 55; 10 ఫోర్లు) అర్ధసెంచరీతో రాణించాడు. అతడికి స్టిర్లింగ్ (43 బంతుల్లో 36; 4 ఫోర్లు), కెవిన్ ఓబ్రైన్ (27) సహకరించారు. ఇంగ్లండ్ బౌలర్లలో స్టువర్ట్ బ్రాడ్ (3/60), స్టోన్ (3/29), స్యామ్ కరన్ (3/28) ఆకట్టుకున్నారు.

## ఈ యేడు కాదు... వచ్చే ఏడాదే!

**పనాజీ:** జాతీయ క్రీడలు... గోవా... వాయిదా... ఇలా వాయిదాలపై వాయిదాలు కోరుతున్న గోవా రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మళ్లీ వాయిదా ప్రకటనను తెరపైకి తెచ్చింది. అసెంబ్లీలో గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ మాట్లాడుతూ ఈ నవంబర్ కల్లా ఆతిథ్య వేదికల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన పూర్తికాదని... వచ్చే ఏడాది మేలో నిర్వహించేలా కొత్త తేదీలు ప్రకటించాలని భారత ఒలింపిక్ సంఘాన్ని (ఐఓఏ) కోరారు. గత నాలుగేళ్లుగా జాతీయ క్రీడల్ని వాయిదా వేస్తూ వచ్చిన గోవా ప్రభుత్వంపై విసుగొచ్చిన ఐఓఏ ఇటీవలే జరిమానా కూడా విధించింది. సార్వత్రిక ఎన్నికలు, హెచ్‌ఎస్‌సీ పరీక్షల సాకుతో ఈ క్రీడల్ని నవంబర్‌లో నిర్వహిస్తామంది. ఇప్పుడేమో వచ్చే ఏడాది మే నెల తేదీలతో కొత్త షెడ్యూలును ప్రకటించాలని కోరింది.

**డైరెక్టరేట్ ఆఫ్ ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్ ఆంధ్రప్రదేశ్ :: విజయవాడ**

**టెండరు ప్రకటన నం. 2299/1/CDS/DIMS/2019 ఔషధాల సేకరణ కు సవరణ**

**టెండర్ ID: 283728** **తేది: 23/07/2019**

కార్యాలయ ఆవరణలు తరలించుట కారణంగా, టెండరు తేదీలు మరియు ప్రి-బిడ్ మీటింగ్ కోసం ప్రదేశం దిగువ తెలిపిన విధంగా మార్పులు చేయబడినవని ఇందుమూలంగా తెలియజేయడమైనది. ప్రి–బిడ్ మీటింగ్ తేది: 29-07-2019 ఉ. 11.00 గం.కు బిడ్ దాఖలు ముగింపు తేది: 01.08.2019 సా. 05.00గం.కు టెండరు తెరుచు తేది: 02.08.2019 ఉ. 11.00గం.కు. ప్రి–బిడ్ మీటింగ్ ప్రదేశము: జాయింట్ డైరెక్టర్, DIMS ఛాంబర్స్ కార్యాలయం, 3వ అంతస్తు, న్యూ డైరెక్టరేట్ ఆఫీస్ బిల్డింగ్, 100 అడుగుల న్యూ ఆటోనగర్ రోడ్, కేశినేని వెంకయ్య నగర్, ఎనికెపాడు, విజయవాడ- 520007

**సం/– డైరెక్టర్ ఆఫ్ ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్**

DIPR RO.No.63PP/CL/Advt/1/1/2019-20, Dt.24.7.2019

**ఆంధ్రప్రదేశ్ స్టేట్ వక్ఫ్ బోర్డ్**

**4వ అంతస్తు, ఇమ్దాద్ ఘర్ వక్ఫ్ కాంప్లెక్స్, కాళేశ్వరరావు మార్కెట్ ఎదురుగా, విజయవాడ**

**FNo.06/DM/SPSRNLR/AUC/2016** **ప్రకటన** **తేది : 24.07.2019**

01-08-2019 నుండి ప్రారంభమయ్యే ఒక సంవత్సర కాలానికి దర్గా మిట్ట, SPSR నెల్లూరు సిటీ మరియు జిల్లా వద్ద గల D.Hzt. బారా షహీద్‌లో 1) గోలక్ (హుండీలు) 2) కొబ్బరి చిప్పలు 3) తలనీలాలు 4) దుకాణాలు మరియు హోటల్స్ 5) గాలఫ్ (క్లాత్) 6) బందీష్ కోకోనట్ మరియు నిమ్మకాయలు 7) ఝూలా మరియు ఎగ్జిబిషన్, 8) లడ్డూ ప్రసాదం ఐటమ్‌ల కోసం బిడ్‌లో పాల్గొనేందుకు ఆసక్తిగల బిడ్డర్ల నుండి సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి.
చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, AP స్టేట్ వక్ఫ్ బోర్డ్, విజయవాడ పేరున తీసిన డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో రూ.10.00 లక్షలు (పది లక్షల రూపాయలు మాత్రమే) బయానాతో పాటు బిడ్డర్లు టెండరును దాఖలు చేయాలి. సర్కారు ధర రూ.65.00 లక్షలు (అరవై ఐదు లక్షల రూపాయలు మాత్రమే) టెండర్లను 30.07.2019న ఉ.11.00గం. నుండి మ.3.00గం. మధ్య దాఖలు చేయాలి మరియు అవి అదే రోజున సా.4.00గం.కు తెరువబడతాయి. బిడ్డర్లు టెండరు నియమ నిబంధనలు అనుసరించాలి వేలం అత్యధిక బిడ్డరు పేరున కొట్టి వేయబడును.
టెండరును రద్దు చేయుటకు లేదా వాయిదా వేయుటకు APS వక్ఫ్ బోర్డ్‌కు హక్కులు కలవు.

**చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ వక్ఫ్ బోర్డ్**

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**
**విజిలెన్స్ & సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్**
**షార్ట్ ఇ.-టెండరు ప్రకటన**

**Roc.No.C1/2033/V&SO/TTD/TPT/2019**

TTD విజిలెన్స్ మరియు సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్‌కు పనుల కాంట్రాక్ట్ క్రింద CCTV ఆపరేషనల్ సర్వీసెస్ యొక్క ఇన్‌స్ట్రుమెంట్‌కు ఇ-టెండర్లు కోరబడుతున్నవి.

**బిడ్ల స్వీకరణకు చివరి తేది మరియు సమయం: 01-08-2019**

టెండరు డాక్యుమెంట్లను వెబ్‌సైట్: **https://tender.apeprocurement.gov.in** నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. తదుపరి వివరాల కోసం సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు 0877-2264079, 2264555. ఫ్యాక్స్– 2264554 మరియు మెయిల్ ID: **cvsoofficettd@gmail.com**

**టెండరు సమయంలో అప్‌లోడ్ చేయవలసిన ధృవీకృత డాక్యుమెంట్ల జాబితా.**

1. డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో బయానా
2. పూర్వార్హత నిర్ణీత ప్రమాణాలలో తెలిపిన విధంగా డాక్యుమెంట్లు
3. సంస్థ రిజిస్ట్రేషన్
4. GST రిజిస్ట్రేషన్
5. PAN కార్డ్/ఆదాయపన్ను డాక్యుమెంట్

**Roc.No.PR4/13908/Adv.No.181/2019, Dt: 23-07-2019** **ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్**

సాక్షి బిజినెస్
గురువారం
25-7-2019
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 135 ▼ | 60 ▼ |
| 37,848 | 11,271 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు రాత్రి 11.30గంలకు)

| సూచీ | విలువ | మార్పు |
|---|---|---|
| నాస్‌డాక్ | 8,284 | ▲ 32 |
| డోజోన్స్ | 27,234 | ▼ 115 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,501 | ▼ 55 |
| డాక్స్ | 12,523 | ▲ 32 |
| షాంఘై | 2,923 | ▲ 23 |
| నికాయ్ | 21,702 | ▲ 87 |

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | కరెన్సీ | | • కొనుగోలు | • అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 68.34 | 69.98 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 84.40 | 87.48 |
| € | యూరో | ఎస్‌బీఐ | 75.69 | 78.55 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 62.73 | 65.16 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.33 | 49.51 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 49.79 | 51.55 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 17.77 | 19.19 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.18 | 19.51 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.51 | 10.64 |

# హమ్మయ్య! హైదరాబాద్‌కు బీమా ఉంది!

- 83 శాతం హైదరాబాదీలకు జీవిత బీమా భద్రత
- దేశంలో మిగతా ప్రాంతాల వారికన్నా టాప్
- మ్యాక్స్ లైఫ్ సర్వేలో వెల్లడి

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** జీవిత బీమా విషయంలో దేశంలోని మిగతా వారితో పోలిస్తే హైదరాబాదీలు చాలా మెరుగని చెప్పాలి. ఎందుకంటే ఇక్కడ దాదాపు 83 శాతం మందికి ఏదో ఒక జీవిత బీమా పాలసీ ఉంది. ఇలా ఏదో ఒక పాలసీ ఉన్నవారి జాతీయ సగటు 65 శాతం. దీంతో పోలిస్తే భాగ్యనగర వాసులదే పైచేయి!!. అయితే, అతి తక్కువ ప్రీమియంతో జీవితానికి రక్షణనిచ్చే టర్మ్ ప్లాన్స్ విషయానికి వస్తే ప్రతి నలుగురిలో ఒక్కరు మాత్రమే ఈ పాలసీ తీసుకున్నారు. ప్రైవేట్ ఇన్సూరెన్స్ సంస్థ మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్, కాంటార్ ఐఎంఆర్‌బీ నిర్వహించిన సర్వేలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. టెక్ నగరం బెంగళూరుతో పోలిస్తే హైదరాబాదీలకే రకరకాల జీవిత బీమా పాలసీల (టర్మ్ ప్లాన్, మార్కెట్ ఆధారిత ప్లాన్ మొదలైనవి) గురించి




ఎక్కువగా అవగాహన ఉన్నట్లు తాము నిర్వహించిన సర్వేలో వెల్లడయిందని మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ డిప్యూటీ ఎండీ వి.విశ్వానంద్ చెప్పారు. వ్యక్తులు తమకు ఎంత వరకు భద్రత ఉందని భావిస్తున్నారు? భవిష్యత్ అనిశ్చితిని ఎదుర్కొనేందుకు మానసికంగా ఎంత మేర సన్నద్ధంగా ఉన్నారు? అనే అంశాల ప్రాతిపదికన బీమా భద్రతపై భారతీయుల వైఖరి (0–100 స్కేల్) నివేదికను తయారు చేసినట్లు ఆయన తెలియజేశారు.

అనిశ్చితి పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఆర్థిక సన్నద్ధత, జీవిత.. టర్మ్ బీమాలపై అవగాహన, పాలసీల కొనుగోలుకు కారణాలు అనే మూడు అంశాల ఆధారంగా పాయింట్లను లెక్కించినట్లు ఆయన పేర్కొన్నారు. దీని ప్రకారం 100కి హైదరాబాద్ 44 పాయింట్లు సాధించిందని, జాతీయ స్థాయిలో పట్టణ ప్రాంతాల్లో నమోదైన 35 పాయింట్ల సగటుకన్నా ఇది అధికమని విశ్వానంద్ చెప్పారు. అయితే, హైదరాబాదీల్లో టర్మ్ ఇన్సూరెన్స్ కేవలం 23% మందికే ఉందని, భవిష్యత్‌లో ఆకస్మిక మరణం, తీవ్ర అనారోగ్యాల బారిన పడటం వంటి వాటిని 44% మంది ఆర్థికంగా ఎదుర్కొనే పరిస్థితుల్లో లేరని చెప్పారాయన. ఉత్తరాది, తూర్పు, పశ్చిమ రాష్ట్రాలతో పోలిస్తే దక్షిణాదిలోనే ఎక్కువగా జీవిత బీమా, టర్మ్ పాలసీదారులు ఉన్నట్లు సర్వేలో తేలింది. దేశానికి ఐటీ హబ్‌గా పేరొందినప్పటికీ దక్షిణాదిలో 82% జనాభా ఇప్పటికీ ఏజెంట్ల నుంచే టర్మ్ పాలసీలు తీసుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. 15% మంది బ్యాంకుల నుంచి, 3% మంది మాత్రమే ఆన్‌లైన్ మాధ్యమం ద్వారా తీసుకోవడానికి ఇష్టపడుతున్నారు.

# 'ఇన్నోవేషన్'లో భారత్‌కు 52వ ర్యాంకు

**గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్–2019లో ఐదు స్థానాలు మెరుగుదల**

**న్యూఢిల్లీ:** గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్ (జీఐఐ) –2019లో భారత్ ఐదు స్థానాలు మెరుగుపరచుకుంది. ప్రపంచంలోని అత్యంత వినూత్న ఆర్థిక వ్యవస్థల ఆధారంగా రూపొందించే ఈ జాబితాలో మొత్తం 129 దేశాలు ఉండగా.. భారత్ 52వ స్థానాన్ని సొంతంచేసుకుంది. మేధో సంపత్తి ఫైలింగ్ రేట్స్ నుంచి మొబైల్ అప్లికేషన్ సృష్టి, విద్యా వ్యయం వంటి మొత్తం 80 ఇండికేటర్స్ ఆధారంగా ఈ ర్యాంక్ నిర్ణయం జరుగుతుంది. ఇక ప్రపంచంలోని టాప్ 100 సైన్స్ అండ్ టెక్నాలజీ క్లస్టర్ల జాబితాలో న్యూఢిల్లీ, ముంబై, బెంగళూరు నగరాలు స్థానం సంపాదించాయి. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ ఈ సమాచారాన్ని బుధవారం ఇక్కడ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'భారత్ తొలుత 25వ స్థానానికి ఆ




తరువాత 10వ స్థానానికి చేరుకునేలా లక్ష్యాన్ని నిర్దేశించాం' అని వ్యాఖ్యానించారు. మధ్య, దక్షిణ ఆసియా ప్రాంతాల్లో భారత్ టాప్‌లో ఉన్నట్లు తెలిపారు. కార్మిక ఉత్పాదకత పెరుగుదల, సాంకేతిక ఉత్పాదన వృద్ధి, మేధో సంపత్తి సంబంధిత అంశాల మెరుగుదలతో పాటు సంస్థలు, మానవ మూలధనం, పరిశోధన పెరిగిన నేపథ్యంలో దేశ ర్యాంక్ మెరుగుపడింది.

## సింగపూర్‌లో స్టార్టప్స్ నిధుల వేట..

**సింగపూర్:** దేశీ స్టార్టప్ సంస్థలు నిధుల సమీకరణ కోసం సింగపూర్ బాట పడుతున్నాయి. తాజాగా లండన్ సంస్థ ఎంట్రప్రెన్యూర్ ఫస్ట్ (ఈఎఫ్) సారథ్యంలో బెంగళూరుకి చెందిన ఆరు స్టార్టప్ సంస్థలు



.. 300 మంది ఇన్వెస్టర్లతో భేటీ అయ్యాయి. పెట్టుబడుల సమీకరణలో ఈ స్టార్టప్‌లకు పూర్తి స్థాయిలో తోడ్పాటు అందిస్తున్నట్లు ఈఎఫ్ జీఎం ఈషా తివారీ చెప్పారు. ప్రత్యేకంగా భారత స్టార్టప్స్ కోసం వచ్చే నెల బెంగళూరులో ఇన్వెస్టర్ల సమావేశం కూడా నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ ఏడాది 100 మంది ప్రతిభావంతుల ఐడియాలకు తుదిరూపం ఇచ్చే ప్రయత్నాల్లో ఉన్నట్లు తివారీ పేర్కొన్నారు.

## రుణ ఎగవేతదారులపై 83 ఎల్‌వోసీలు




**న్యూఢిల్లీ:** తీసుకున్న బ్యాంకు రుణాలను ఎగ్గొట్టిన కంపెనీల ప్రమోటర్లు దేశం విడిచి వెళ్లకుండా ఉండేందుకు, వారికి వ్యతిరేకంగా 83 లుకవుట్ సర్క్యులర్ (ఎల్‌వోసీ)లను ప్రభుత్వం జారీ చేసినట్టు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ రాజ్యసభకు తెలిపారు. ఇలా తమపై ఎల్‌వోసీలు జారీ అయిన వారు దేశం నుంచి వెళ్లే ప్రయత్నం చేస్తే ఇమిగ్రేషన్ అధికారులు నిర్బంధించగలరని ఆయన పేర్కొన్నారు.

# బ్యాంకింగ్ 'బాండ్'!

- రుణాలివ్వడమే కాదు... వినియోగంపైనా పర్యవేక్షణ
- ఎగవేతలు, మోసాలతో మారుతున్న బ్యాంకుల రూటు
- రుణాల వినియోగంపై పర్యవేక్షణకు ఏజెన్సీల సేవలు




**న్యూఢిల్లీ:** రుణాల విషయంలో కార్పొరేట్ సంస్థలు మోసాలకు పాల్పడుతున్న ఘటనల నేపథ్యంలో బ్యాంకులు రూటు మార్చుకుంటున్నాయి. కేవలం రుణాలు జారీ చేయడానికే పరిమితమై పోకుండా, తీసుకున్న రుణాలను కంపెనీలు ఏ విధంగా వినియోగిస్తున్నాయనేది పర్యవేక్షించేందుకు వెలుపలి ఏజెన్సీల సాయం తీసుకోవాలని భావిస్తున్నాయి. ముఖ్యంగా ఇతర బ్యాంకులతో కలిసి కన్సార్షియం కింద జారీ చేసే రూ.250 కోట్లకు మించిన రుణాల విషయంలో ఏజెన్సీ సేవలను వినియోగించుకోవాలని అనుకుంటున్నాయి. భూషణ్ పవర్ అండ్ స్టీల్ రుణం రూపంలో మోసం చేసినట్టు వెలుగు చూడడం, కంపెనీల ఆర్థిక అంశాలపై కచ్చితమైన సమాచారం విషయంలో రేటింగ్ ఏజెన్సీలు విఫలమవుతున్న నేపథ్యంలో... ఫోరెన్సిక్ ఆడిట్ తరహాలో కంపెనీల ఖాతాలపై సర్వే కోసం ఏజెన్సీలను నియమించుకోవాల్సిన అవసరం ఉందని రెండు అగ్ర స్థాయి ప్రభుత్వరంగ బ్యాంకర్లు తెలిపారు. ప్రస్తుతం అయితే కన్సార్షియం కింద రుణాలను జారీ చేసిన తర్వాత బ్యాంకులు... ప్రధానంగా రేటింగ్ ఏజెన్సీలు ఇచ్చే రేటింగ్‌లు, కంపెనీలు ఇచ్చే సమాచారానికే పరిమితం అవుతున్నాయి. వీటి ఆధారంగానే ఆయా కంపెనీల ఆర్థిక ఆరోగ్యాన్ని అంచనా వేస్తున్నాయి. ఈ ప్రతిపాదనపై ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) స్థాయిలో చర్చ జరిగిందని, అకౌంటింగ్ సంస్థలను నియమించుకోవడం ఈ ప్రతిపాదనలో భాగమని బ్యాంకరు తెలిపారు. ఇప్పటికే ఐబీఏ 75 సంస్థలను కూడా గుర్తించి బ్యాంకుల స్థాయిలో పంపిణీ చేయడం జరిగినట్టు చెప్పారు.

### ఎప్పటికప్పుడు నివేదికల రూపంలో...

''ఇది నూతన యంత్రాంగం. ఇప్పటికే అకౌంటింగ్ సంస్థలను గుర్తించాం. తీసుకున్న రుణాలను కంపెనీలు వినియోగించే తీరుపై ఎప్పటికప్పుడు ఇవి పర్యవేక్షణ నిర్వహిస్తాయి. అలాగే, క్రమం తప్పకుండా బ్యాంకులకు నివేదికల రూపంలో తెలియజేస్తాయి'' అని యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ, సీఈవో అశోక్ కుమార్ ప్రధాన్ తెలిపారు. ఇప్పటికైతే తాము అందుకున్న స్టేట్‌మెంట్స్‌పై ఎక్కువగా వివరాలు వెల్లడించలేమంటూ... సంబంధిత ఆడిటింగ్ సంస్థలు కంపెనీల పుస్తకాలను పరీక్షిస్తాయని, ఇది ఫోరెన్సిక్ ఆడిట్ తరహాలో ఉంటుందన్నారు. కంపెనీల పుస్తకాల్లోని లోపాలను గుర్తించే విషయంలో రేటింగ్ ఏజెన్సీలు సమర్థవంతంగా వ్యవహరించడం లేదని గతేడాది సెప్టెంబర్‌లో ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ పరిణామంతో వెలుగు చూసింది. రుణాల చెల్లింపుల్లో ఈ సంస్థ వరుసగా విఫలం కావడం, రేటింగ్ ఏజెన్సీలు ముందుగా ఈ విషయాలను గుర్తించలేకపోయిన విషయం తెలిసిందే. ఖాతాల్లోని ఆర్థిక ఇబ్బందులు రేటింగ్‌ల్లో ప్రతిఫలించకుండా ఉండేందుకు ఐఎల్‌ఎఫ్‌ఎస్ సీనియర్ మేనేజ్‌మెంట్ ఉద్యోగులు, రేటింగ్ ఏజెన్సీల ఉద్యోగులను ప్రలోభపెట్టినట్టు గ్రాంట్ థార్న్‌టన్ ఫోరెన్సిక్ ఆడిట్‌లో ప్రాథమికంగా వెలుగు చూసింది. ''పర్యవేక్షణ బాధ్యత అన్నది రేటింగ్ ఏజెన్సీలు చేయాల్సి ఉంటుంది. ఎందుకంటే వాటి రేటింగ్‌లు బ్యాంకులతోపాటు వాటాదారులకూ ఎంతో ముఖ్యమైనవి. కానీ, ఇప్పుడున్న విధానంలో ఇది ఫలితాలను ఇవ్వడం లేదు. ఎక్స్‌టర్నల్ ఏజెన్సీలను నియమించుకోవాలని ఐబీఏ యోచిస్తుండడం వెనుక కారణం ఇదే. భూషణ్ పవర్ మోసం వెలుగు చూడడంతో ఈ విధానాన్ని వెంటనే అమల్లో పెట్టాల్సిన అవసరం ఉంది'' అని సిండికేట్ బ్యాంకు ఎండీ, సీఈవో మృత్యుంజయ మహాపాత్ర పేర్కొన్నారు.

## సిండికేట్ బ్యాంక్ నష్టాలు తగ్గుదల

**రూ.6,081 కోట్లకు మొత్తం ఆదాయం**




**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ సిండికేట్ బ్యాంక్ నికర నష్టాలు ఈ ఆర్థిక సంవత్సరం జూన్ క్వార్టర్‌లో తగ్గాయి. గత క్యూ1లో రూ.1,282 కోట్లుగా ఉన్న నికర నష్టాలు ఈ క్యూ1లో రూ.980 కోట్లకు తగ్గాయని సిండికేట్ బ్యాంక్ తెలిపింది. మొండి బకాయిలకు కేటాయింపులు తగ్గడంతో నికర నష్టాలు కూడా తగ్గాయని వివరించింది. మొత్తం ఆదాయం రూ.5,638 కోట్ల నుంచి రూ.6,081 కోట్లకు పెరిగిందని పేర్కొంది.

**రుణ నాణ్యత స్వల్పంగా మెరుగు....**

ఈ బ్యాంక్ రుణ నాణ్యత స్వల్పంగా మెరుగుపడింది. గత క్యూ1లో 12.59 శాతంగా ఉన్న స్థూల మొండి బకాయిలు ఈ క్యూ1లో 11.76 శాతానికి తగ్గాయని సిండికేట్ బ్యాంక్ తెలిపింది. అలాగే నికర మొండి బకాయిలు 6.64 శాతం నుంచి 5.06 శాతానికి తగ్గాయని పేర్కొంది. మొండి బకాయిలు, ఇతరాలకు కేటాయింపులు రూ.2,327 కోట్ల నుంచి రూ.1,969 కోట్లకు తగ్గాయని వివరించింది. ఈ ఏడాది జూన్ నాటికి బ్యాంక్ ప్రొవిజన్ కవరేజ్ రేషియో 69.02 శాతంగా ఉందని తెలిపింది.

ఆర్థిక ఫలితాల నేపథ్యంలో సిండికేట్ బ్యాంక్ షేర్ 4.2 శాతం నష్టంతో రూ.35.35 వద్ద ముగిసింది.

## కెనరా బ్యాంక్ లాభం 329 కోట్లు

- 17 శాతం వృద్ధి
- రూ.14,062 కోట్లకు ఆదాయం
- మొండిబాకీలు తగ్గుముఖం...

**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ కెనరా బ్యాంక్ ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక కాలంలో రూ.329 కోట్ల నికర లాభం సాధించింది. గత క్యూ1లో రూ.281 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ1లో రూ.329 కోట్లకు పెరిగిందని, 17 శాతం వృద్ధి సాధించామని కెనరా బ్యాంక్ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.13,192 కోట్ల నుంచి రూ.14,062 కోట్లకు పెరిగిందని పేర్కొంది. వడ్డీ ఆదాయం రూ.11,360 కోట్ల నుంచి రూ.12,201 కోట్లకు చేరిందని తెలిపింది. రూ.2,440 కోట్ల ఇతర ఆదాయం ఆర్జించామని పేర్కొంది.

బ్యాంక్ రుణ నాణ్యత మెరుగుపడింది. గత క్యూ1లో 11.05గా ఉన్న స్థూల మొండి బకాయిలు ఈ క్యూ1లో 8.77 శాతానికి తగ్గాయని కెనరా బ్యాంక్ తెలిపింది. అలాగే నికర మొండి బకాయిలు 6.91 శాతం నుంచి 5.35 శాతానికి తగ్గాయని పేర్కొంది. విలువ పరంగా చూస్తే, స్థూల మొండి బకాయిలు రూ.44,660 కోట్ల నుంచి రూ.39,399 కోట్లకు, నికర మొండి బకాయిలు 26,694 కోట్ల నుంచి 23,150 కోట్లకు తగ్గాయని వివరించింది. మొండి బకాయిలు తగ్గిన ఫలితంగా మొండి బకాయిలకు కేటాయింపులు 2,466 కోట్ల నుంచి రూ.2,283 కోట్లకు తగ్గాయని పేర్కొంది. మొత్తం మీద కేటాయింపులు




రూ.2,582 కోట్ల నుంచి రూ.1,889 కోట్లకు చేరాయని తెలిపింది. ప్రొవిజన్ కవరేజ్ రేషియో 60.69 శాతం నుంచి 68.62 శాతానికి పెరిగిందని బ్యాంక్ పేర్కొంది.

ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం చివరి నాటికి రుణాలు 11 శాతం వృద్ధితో రూ.4.49 లక్షల కోట్లకు, డిపాజిట్లు 15 శాతం వృద్ధితో రూ.6.10 లక్షల కోట్లకు పెరిగాయని కెనరా బ్యాంక్ తెలిపింది. ఇక మొత్తం వ్యాపారం 13 శాతం వృద్ధితో రూ.10.59 లక్షల కోట్లకు పెరిగిందని పేర్కొంది.

మార్కెట్ ముగిసిన తర్వాత ఆర్థిక ఫలితాలు వెల్లడయ్యాయి. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో కెనరా బ్యాంక్ షేర్ 3 శాతం నష్టంతో రూ.249 వద్ద ముగిసింది.

## నిస్సాన్‌లో 10వేల కొలువుల కోత!

**టోక్యో:** జపాన్‌కు చెందిన ప్రముఖ కార్ల తయారీ కంపెనీ నిస్సాన్ ప్రపంచవ్యాప్తంగా 10,000 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికే యోచనలో ఉన్నట్లు జపాన్ మీడియా బుధవారం వెల్లడించింది. కంపెనీలో చోటుచేసుకుంటున్న తాజా పరిణామాల ఆధారంగా ఈ విషయాన్ని ప్రచురిస్తున్నట్లు పేర్కొంది. నిస్సాన్ చైర్మన్ కార్లోస్ ఘోన్ అరెస్టు తరువాత ఆర్థిక సంక్షోభాన్ని చవి చూస్తున్నామని, ఇదే సమయంలో అమెరికా, యూరప్‌లో అమ్మకాలు తగ్గిపోవడం వల్ల తొలి త్రైమాసిక




నిర్వహణ లాభం గణనీయంగా తగ్గిపోయిందని ఆ కంపెనీ అధికారికంగా ప్రకటించిన నేపథ్యంలో ఈ అంచనాలు వెల్లడయ్యాయి. గతంలో కంపెనీ 4,800 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలకనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే కాగా, ప్రస్తుత పరిస్థితుల ఆధారంగా ఈ సంఖ్య రెట్టింపును దాటి 10,000 వరకు ఉండవచ్చని అక్కడి మీడియా వివరించింది. ఈ అంశంపై స్పందించిన కంపెనీ ఆడిట్ కమిటీ.. ఉద్యోగాల కోత పరంగా గురువారం స్పష్టమైన ప్రకటన చేస్తామని తెలిపింది.

# ఎగవేతదారులను వదలొద్దు

- నిజాయతీగా పన్నులు కట్టేవారికి తగిన గౌరవమివ్వాలి
- ఆదాయపు పన్ను శాఖ అధికారులకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచన



**న్యూఢిల్లీ:** వ్యవస్థలో లొసుగులను అడ్డం పెట్టుకుని పన్నులను ఎగవేయాలనుకునే వారితో కఠినంగా వ్యవహరించాలని ఆదాయ పన్ను శాఖ అధికారులకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. అయితే, నిజాయతీగా కట్టాలనుకునేవారికి అవసరమైన తోడ్పాటునిచ్చి, తగిన విధంగా గౌరవించాలని పేర్కొన్నారు. 159వ ఆదాయపు పన్ను దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆమె ఈ విషయాలు చెప్పారు. ఎగవేతదారులను పట్టుకునేందుకు రెవెన్యూ శాఖలోని మూడు కీలక విభాగాలు (ఆదాయపు పన్ను, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్) పరస్పరం సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవాలని సూచించారు. 'తప్పు ఎక్కడ జరుగుతోందో తెలుసుకునేందుకు మీ దగ్గర డేటా మైనింగ్, బిగ్ డేటా విశ్లేషణ వంటి సాధనాలు ఉన్నాయి. ఎగవేయాలనుకునే వారితో కఠినంగా వ్యవహరించండి. అలాంటి విషయాల్లో మీకు నా పూర్తి మద్దతు ఉంటుంది' అని నిర్మలా సీతారామన్ చెప్పారు. సంపన్నులపై అధిక పన్ను భారం అంశాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ.. పన్నులు చెల్లించడాన్ని ప్రజలు జాతి నిర్మాణంలో తమ వంతు కర్తవ్యంగా భావించాలే తప్ప జరిమానాగా అనుకోరాదని మంత్రి చెప్పారు. 'ఎక్కువ సంపాదిస్తున్న వారిని శిక్షించాలన్నది మా ఉద్దేశం కాదు. ఆదాయాలు, వనరులను మరింత మెరుగ్గా పంచడానికి ఈ పన్నులు అవసరం. అత్యధికంగా ఆదాయాలు ఆర్జించే వర్గాలు కొంత మేర సామాన్యుల అభ్యున్నతికి కూడా తోడ్పాటు అందించాలన్నదే లక్ష్యం. ఈ భావాన్ని అర్థం చేసుకుంటే చాలు.. ఇన్‌కం ట్యాక్స్ విభాగమంటే భయం ఉండదు' అని ఆమె తెలిపారు.

### సులభసాధ్యమైన లక్ష్యం..


2019–20లో నిర్దేశించుకున్న రూ. 13.35 లక్షల కోట్ల ప్రత్యక్ష పన్ను వసూళ్ల లక్ష్యం సులభసాధ్యమైనదేనని నిర్మలా సీతారామన్ చెప్పారు.'గడిచిన అయిదేళ్లలో పన్ను చెల్లింపుదారుల సంఖ్యను రెట్టింపు స్థాయికి చేర్చగలిగాం. అలాంటప్పుడు పన్ను వసూళ్లను రూ. 11.8 లక్షల కోట్ల నుంచి కాస్త ఎక్కువగా రూ. 13 లక్షల కోట్లకు పెంచుకోవడం పెద్ద కష్టం కానే కాదు. సాధించతగిన లక్ష్యాన్నే మీకు నిర్దేశించడం జరిగింది' అని ఆమె వివరించారు. ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యించినట్లుగా పన్ను చెల్లింపుదారుల సంఖ్యను ప్రస్తుతమున్న 7 కోట్ల నుంచి 8 కోట్లకు పెంచే దిశగా కృషి చేయాలని చెప్పారు.

### ఆహ్లాదకర వ్యవహారంగా ఉండాలి..

పన్ను చెల్లింపు ప్రక్రియ అంటే భయం కోల్పేదిగా కాకుండా ఆహ్లాదకరమైన వ్యవహారంగా ఉండే పరిస్థితులు కల్పించాలని ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రీయ ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) చైర్మన్ ప్రమోద్ చంద్ర మోదీ చెప్పారు. పన్ను వసూళ్ల పారదర్శకమైన, సముచిత రీతిలో జరిగేట్లు ఆదాయపు పన్ను శాఖ అధికారులు చూడాలని ఆయన సూచించారు. 1960–61 ఆర్థిక సంవత్సరంలో కేవలం రూ. 13 లక్షలుగా ఉన్న ప్రత్యక్ష పన్ను వసూళ్లను గత ఆర్థిక సంవత్సరం (2018–19)లో రూ.11.37 లక్షల కోట్ల స్థాయికి చేర్చడంలో ఆదాయపు పన్ను శాఖ సిబ్బంది చేసిన కృషి అభినందనీయమని మోదీ చెప్పారు.

## రూ.199కే నెట్‌ఫ్లిక్స్ మొబైల్ ప్లాన్

**న్యూఢిల్లీ:** అమెరికాకు చెందిన ప్రీమియం వీడియో స్ట్రీమింగ్ కంపెనీ నెట్‌ఫ్లిక్స్.. భారత మొబైల్ వినియోగదారుల కోసం అత్యంత చౌక ప్లాన్‌ను బుధవారం అందుబాటులోకి తెచ్చింది. కేవలం రూ.199కే నెలవారీ మొబైల్ ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. ఈ నూతన ప్లాన్‌లో భాగంగా ఎటువంటి ప్రకటనలు




లేనటువంటి స్టాండర్డ్ డెఫినిషన్ (ఎస్‌డీ) వీడియోలను ప్రేక్షకులు వీక్షించవచ్చని వివరించింది. స్మార్ట్‌ఫోన్, ట్యాబ్లెట్లకు మాత్రమే వర్తించే ఈ చౌక ప్లాన్ కేవలం భారత కస్టమర్లకు మాత్రమే అందుబాటులో ఉందని సంస్థ ప్రొడక్ట్ ఇన్నోవేషన్ డైరెక్టర్ అజయ్ అరోరా తెలియజేశారు. ఇతర ఏదేశంలోనూ లేని విధంగా ఇక్కడ మొబైల్ ఫోన్ సైన్ అప్స్ తమకు ఉన్నట్లు వెల్లడించారు. హాత్‌వే, భారతి ఎయిర్ టెల్, యాక్ట్ ఫైబర్‌నెట్‌తో ఇండియాలో భాగస్వామ్యం ఉండగా.. ప్రపంచవ్యాప్తంగా 190 దేశాల్లో 14.8 కోట్ల చందాదారులు ఉన్నట్లు సంస్థ వెల్లడించింది.

# 10 లక్షల ఉద్యోగాలకు ఎసరు..

- మందగమనంలో వాహన రంగం
- కోలుకోవడానికి తోడ్పాటు అందించాలి
- కేంద్ర ప్రభుత్వానికి ఆటోమొబైల్ పరికరాల తయారీ సంస్థల విన్నపం

**న్యూఢిల్లీ:** ఆటోమొబైల్ పరిశ్రమలో మందగమనం మరింత కాలం కొనసాగితే 10 లక్షల పైచిలుకు ఉద్యోగాలకు కోత పడే ముప్పు పొంచి ఉందని ఆటోమోటివ్ పరికరాల తయారీ సంస్థల సమాఖ్య (ఏసీఎంఏ) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో డిమాండ్‌ను పెంచే దిశగా జీఎస్‌టీ రేటు తగ్గింపు తదితర చర్యలతో ఆటోమొబైల్ రంగం కోలుకునేందుకు తోడ్పాటు అందించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. గత పది నెలలుగా అమ్మకాలు క్షీణిస్తూనే ఉండటంతో ఆటోమొబైల్ పరిశ్రమ సంక్షోభ పరిస్థితులు ఎదుర్కొంటోందని పేర్కొంది. 'గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని విభాగాల వాహనాల విక్రయాలు చాలా నెలలుగా పడిపోతున్నాయి. దీంతో పరికరాల తయారీ విభాగంపైనా ప్రతికూల ప్రభావం పడుతోంది. వాహనాల రంగంపైనే పరికరాల తయారీ విభాగం కూడా ఆధారపడి ఉంటుంది. వాహనాల తయారీ 15–20 శాతం పడిపోవడంతో సంక్షోభ పరిస్థితులు నెలకొన్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే సిబ్బందిని తొలగించక తప్పదు.




కనీసం 10 లక్షల మంది పైగా ఉద్యోగాలు కోల్పోయే అవకాశాలు ఉన్నాయని అంచనా' అని ఏసీఎంఏ అధ్యక్షుడు రామ్ వెంకటరమణి పేర్కొన్నారు. ఇప్పటికే ఉద్వాసనలు మొదలయ్యాయని చెప్పారు. పరికరాల తయారీ రంగంలో దాదాపు 70 శాతం మంది కాంట్రాక్టు వర్కర్లే ఉంటారని, డిమాండ్ లేకపోతే సిబ్బంది సంఖ్యను తగ్గించుకోవడం జరుగుతుందని ఆయన వివరించారు. 50 లక్షల మందికి ఉపాధి కల్పిస్తూ స్థూల దేశీయోత్పత్తిలో 2.3 శాతం వాటాతో ఆటోమోటివ్ పరికరాల తయారీ పరిశ్రమ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.

### జీఎస్‌టీ రేటు తగ్గించాలి..

డిమాండ్ లేకపోవడం, బీఎస్ సిక్స్ స్థాయి ఉద్గార ప్రమాణాల వాహనాల తయారీపై భారీగా పెట్టుబడులు పెట్టాల్సి రావడం, విద్యుత్ వాహనాల విధానంపై స్పష్టత కొరవడటం తదితర అంశాలు ఆటోమొబైల్ పరిశ్రమ భవిష్యత్‌కు ప్రశ్నార్థకంగా మారాయని రామ్ చెప్పారు. దీంతో భవిష్యత్ పెట్టుబడులన్నీ నిల్చిపోయాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో డిమాండ్‌కి ఎంతో కొంత ఊతమిచ్చేలా జీఎస్‌టీ రేటు తగ్గించాలని పేర్కొన్నారు. ఆటోమొబైల్, ఆటో పరికరాలన్నింటికీ ఒకే రకంగా 18 శాతం జీఎస్‌టీ రేటు పరిధిలోకే చేర్చాలని కోరారు. ప్రస్తుతం దాదాపు 70 శాతం ఆటో పరికరాలు 18 శాతం జీఎస్‌టీ శ్లాబ్‌లోనే ఉన్నప్పటికీ.. మిగతా 30 శాతం మాత్రం గరిష్ట శ్లాబ్ అయిన 28 శాతం విభాగంలో ఉన్నాయి. పైగా వాహనాల పొడవు, ఇంజిన్ సామర్థ్యం తదితర అంశాలను బట్టి 28 శాతం జీఎస్‌టీకి అదనంగా 1–15 శాతం దాకా అదనపు సెస్సు భారం కూడా ఉంటోందని రామ్ తెలిపారు. ఎలక్ట్రిక్ వాహనాల విధానంపై కేంద్రం స్పష్టతనివ్వాలన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలకు మళ్లే క్రమంలో నీతి ఆయోగ్ నిర్దేశించిన లక్ష్యాలు.. ఆటో పరిశ్రమను ఆందోళనకు గురిచేసేవిగా ఉన్నాయని ఏసీఎంఏ డైరెక్టర్ జనరల్ విన్నీ మెహతా చెప్పారు. 2018–19లో ఆటో పరికరాల వ్యాపార విభాగం 14.5 శాతం వృద్ధితో రూ. 3.95 లక్షల కోట్లుగా ఉందని తెలిపారు.

## చైనాకు అవకాశాలు ఇవ్వొద్దు

స్వేచ్ఛా వాణిజ్యానికి సంబంధించిన ప్రతిపాదిత ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (ఆర్‌సెప్)లో ఆటో పరికరాలను చేర్చకుండా ఉండటం మంచిదని మెహతా తెలిపారు. అలా చేస్తే భారత మార్కెట్లో చైనా దొడ్డిదారిన ప్రవేశించేందుకు అవకాశం కల్పించినట్లవుతుందన్నారు. ఇప్పటికే చైనా నుంచే భారత్ అత్యధికంగా పరికరాలు దిగుమతి చేసుకుంటోందని మెహతా వివరించారు. 2018–19లో చైనా నుంచి దిగుమతులు 4.6 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయని, మొత్తం ఆటోమోటివ్ పరికరాల దిగుమతుల్లో ఇది 27 శాతమని తెలిపారు. చైనాతో పాటు జపాన్, కొరియా వంటి దేశాలతో కూడా భారత వాణిజ్యం లోటులోనే ఉందని చెప్పారు.





# ఆమె కోసం.. ఆ రోజు కోసం!

## షీ నీడ్.. బటన్ నొక్కితే శానిటరీ ప్యాడ్

### నెలాఖరులో నగరంలో ప్రారంభం

**ఒక సంఘటన**

ఆపిల్ హోమ్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ నీలిమ ఆ మధ్య విమానంలో వెళ్తుండగా.. అకస్మాత్తుగా రుతుక్రమం వచ్చింది. శానిటరీ ప్యాడ్ కావాలి. విమాన సిబ్బందితో పాటు ప్రయాణికులనూ అడిగారు..అందరి నోట ఒకటే మాట... లేదని. ఆ సమయంలో ఆమె ఎదుర్కొన్న ఇబ్బంది అంతా ఇంతా కాదు.



**ఒక ఆలోచన..**

ఈ ఘటన డాక్టర్ నీలిమలో ఆలోచనను రేకెత్తించింది. ప్రకృతి సిద్ధంగా వచ్చే రుతు క్రమాన్ని బయటకు చెప్పుకోలేని, శానిటరీ ప్యాడ్ గురించి మాట్లాడలేని స్థితిలో చాలా మంది ఉన్నారని గ్రహించారు. 'పాఠశాలకు వెళ్లే విద్యార్థినులు ఎంతో మంది నెలసరి సమయంలో బడి మానేస్తున్నారు. అలాంటి పరిస్థితి నుంచి బయటకు రావాల్సిన అవసరం ఉంది. ప్రకృతి సిద్ధంగా వచ్చే నెలసరి గురించి మాట్లాడుకునేందుకు సిగ్గుపడాల్సిన పని లేదు' అని ఆమె భావించారు. పరిష్కారం ఏమిటని ఆలోచించారు..

**ఒక పరిష్కారం..**

షీ నీడ్.. యస్.. ఇదే సరైనదని నిర్ణయించుకున్నారు డాక్టర్ నీలిమ. నగరానికొచ్చేవారు, పేద విద్యార్థులు, యువతులు, మహిళలు శానిటరీ ప్యాడ్ కోసం ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో జీహెచ్ఎంసీతో కలిసి ' షీ నీడ్'ను ప్రారంభించి ఉచితంగా శానిటరీ ప్యాడ్‌లు అందించాలనుకున్నారు. జస్ట్.. బటన్ నొక్కితే చాలు.. ప్యాడ్ వచ్చేలా ఏర్పాటు చేశారు. ఇందు కోసం ఒక బాక్స్‌లో కియోస్క్ యంత్రాన్ని ఉంచుతారు. అవసరమైన వారు బటన్ నొక్కితే శానిటరీ ప్యాడ్ వస్తుంది. రోజూ బాక్సులో 50 ప్యాడ్స్ ఉంచుతారు. ప్రస్తుతానికి వెస్ట్‌జోన్ పరిధిలో పైలట్ ప్రాజెక్టుగా చేపడుతున్నారు. విజయవంతమైతే..ప్రధాన కూడళ్లు, రద్దీ ఉన్న ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. అంతే కాదు.. డాక్టర్ నీలిమ ఏం చెబుతున్నారంటే.. ''షీ నీడ్ నిర్వహణపై ఆసక్తి గల మహిళలకు అవగాహన కల్పించి.. ఫ్యాన్సీ స్టోర్, కుట్టు మిషన్ పెట్టుకునేందుకు అవకాశం కల్పిస్తాం. కరెంటు ఉచితంగా ఇస్తాం. షీ నీడ్‌కు వచ్చే వారి వివరాలను రిజిస్టర్‌లో పొందుపర్చాల్సి ఉంటుంది' అని ఆమె తెలిపారు. ఈ నెల చివరినాటికి శేరిలింగంపల్లి సర్కిల్‌లో షీ నీడ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వెస్ట్ జోనల్ కమిషనర్ హరిచందన దాసరి చెప్పారు. – హైదరాబాద్




# చెప్పేటోళ్లేరి..?

- వైద్య విద్యాసంవత్సరం ముంచుకొస్తున్నా భర్తీకాని అధ్యాపకుల పోస్టులు
- ఆగస్టు 1 నుంచే ఎంబీబీఎస్ క్లాసులు..
- ప్రభుత్వ కాలేజీల్లో 2 వేల పోస్టులు ఖాళీ
- నియామకాల బోర్డు జీవో వచ్చి 10 నెలలైనా జరిగింది శూన్యం

**సాక్షి, హైదరాబాద్:** మెడికల్ కాలేజీల్లో కొత్త విద్యాసంవత్సరం మొదలు కాబోతోంది. ఆగస్టు 1నుంచి ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే అందుకు సంబంధించి ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లకు రెండు విడతల కౌన్సెలింగ్ పూర్తయింది. కాలేజీలకు వచ్చేందుకు విద్యార్థులు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) నిబంధనల మేరకు ఎట్టి పరిస్థితుల్లో ఎంబీబీఎస్ తరగతులు కచ్చితంగా ఆగస్టు ఒకటో తేదీన ప్రారంభించాల్సిందే. ఇదంతా బాగానే ఉంది. కానీ ప్రభుత్వ మెడికల్ కాలేజీలను అధ్యాపకుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీంతో కొత్తగా కాలేజీలకు వెళ్లే విద్యార్థులకు చదువు చెప్పేదెవరనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మరీ ముఖ్యంగా నల్లగొండ, సూర్యాపేటల్లో ఈ విద్యాసంవత్సరం నుంచి కొత్తగా ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రారంభం కానున్నాయి. అయితే ఆ కాలేజీలకు సంబంధించి పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసిందే కానీ వాటిని భర్తీ చేయలేదు. మిగిలిన కాలేజీల్లో ఉన్న ఖాళీలను పూరించలేదు. కొత్త కాలేజీల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ జరగకుండా తరగతులు ఎలా నిర్వహిస్తారన్న ప్రశ్నలకు సమాధానాలు లభించడం లేదు.

**నల్లగొండ, సూర్యాపేటల్లోనే 1,036 పోస్టులు**

తెలంగాణలో ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో 2019–20 వైద్య విద్యా సంవత్సరానికి మొత్తంగా 4,600 సీట్లు అందుబాటులో ఉన్నాయి. 10 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 1,500 ఎంబీబీఎస్ సీట్లు, 21 ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో 3,100 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. ఇవిగాక 10 ప్రైవేటు, ఒక ఆర్మీ, మరో ప్రభుత్వ డెంటల్ కాలేజీల్లో 1,106 డెంటల్ సీట్లున్నాయి. గతేడాది కంటే ఈసారి ఏకంగా వెయ్యి ఎంబీబీఎస్ సీట్లు పెరగడం గమనార్హం. ప్రభుత్వంలోని అన్ని సీట్లు, ప్రైవేటు కాలేజీల్లోని 50% సీట్లు కన్వీనర్ కోటాలో భర్తీ చేస్తున్నారు. ఇప్పటికే రెండు విడతల కౌన్సెలింగ్ పూర్తయింది. మూడో విడతలో కన్వీనర్ కోటాలో మిగిలిన సీట్లతో పాటు అగ్రవర్ణ పేదల (ఈడబ్ల్యూఎస్) కోసం ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు కేటాయించిన 190 సీట్లను భర్తీ చేస్తారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియపై నీలినీడలు అలుముకున్నాయి.



సూర్యాపేట, నల్లగొండల్లో కొత్తగా ఏర్పాటైన మెడికల్ కాలేజీలకు ప్రభుత్వం ఇటీవల 1,036 పోస్టులను మంజూరు చేసింది. ఇందులో 132 అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉండగా, 904 పారామెడికల్, నాన్–మెడికల్ గెజిటెడ్ పోస్టులున్నాయి. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పద్ధతిలో వైద్య విద్య సంచాలకులు వీటిని భర్తీ చేయాల్సిఉంది. కానీ ఇప్పటికీ ఆ ప్రక్రియ మొదలే కాలేదు. దీంతో ఆయా కాలేజీల్లో తరగతులను ఎలా నిర్వహిస్తారన్న దానిపై ఆందోళన నెలకొంది.

**మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఉనికిలోకే..**

2017లో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ద్వారా సుమారు 500 డాక్టర్ పోస్టులు, 3,300 స్టాఫ్ నర్సు పోస్టులు, మరో 1,000 పారా మెడికల్ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. అయినా ఆ భర్తీ ప్రక్రియ పూర్తికాకపోవడం గమనార్హం. దీంతో లాభం లేదనుకొని తమిళనాడు తరహాలో రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ నియామకాలను వేగంగా పూర్తి చేసేందుకు 'మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎంహెచ్‌ఆర్‌బీ)'ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనిపై గతేడాది సెప్టెంబర్‌లోనే జీవో జారీచేశారు. 10 నెలలు కావస్తున్నా.. ఇప్పటిదాకా ఇది పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చలేదు. మరోవైపు ఖాళీలు పెరిగిపోతున్నాయి. సరిపడా డాక్టర్లు, ఇతర సిబ్బంది లేకపోవడంతో ఉన్న సిబ్బందిపైనే పని భారం పెరుగుతోంది. వేగంగా పోస్టులను భర్తీ చేయాలన్న ఉద్దేశంతోనే ఎంహెచ్‌ఆర్‌బీని ఏర్పాటు చేసినా.. ఆలస్యం తప్పడంలేదు. బోర్డు చైర్మన్‌గా వైద్యారోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ మెంబర్ సెక్రటరీగా, జాయింట్ డైరెక్టర్ హోదా ఉన్న అధికారి సభ్యులుగా ఉంటారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బోర్డులో డిప్యూటీ డైరెక్టర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, అకౌంట్స్ ఆఫీసర్, లీగల్ ఆఫీసర్ నుంచి జూనియర్ అసిస్టెంట్ వరకూ అందరినీ డిప్యుటేషన్‌పై ఇతర శాఖల నుంచి తీసుకోవాలని జీవో సూచించింది. అయినా ఇంతవరకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. మరో నాలుగు నెలల వరకు భర్తీ ప్రక్రియ జరిపే అవకాశాలు కనిపించడంలేదని వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు చెబుతున్నాయంటే అధికార యంత్రాంగ నిర్లక్ష్యం కనిపిస్తుంది. ఇదే జరిగితే మెడికల్ కాలేజీలు అధ్యాపకులు లేక వైద్య విద్యా వ్యవస్థ కుంటుపడే ప్రమాదముంది. దీనిపై వైద్య విద్యా సంచాలకులు (డీఎంఈ) డాక్టర్ రమేశ్‌రెడ్డి వివరణ కోరగా, బోర్డు ద్వారానే భర్తీల ప్రక్రియ చేపట్టాల్సి ఉందన్నారు. అంతకుమించి సమాధానం ఇచ్చేందుకు ఆయన ఇష్టపడలేదు.



## ఇక్కత్‌లో మిస్ వరల్డ్ ఆస్ట్రేలియా

యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం కనుముకుల పరిధిలోని పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్క్‌లో బుధవారం ఆస్ట్రేలియన్ నటి, ప్రముఖ మోడల్, మిస్ వరల్డ్ ఆస్ట్రేలియా–2017 'ఎస్మా వోలోదర్' సందడి చేశారు. మూడు రోజుల భారత పర్యటనకు వచ్చిన ఆమె ప్రపంచ ప్రసిద్ధి గాంచిన పోచంపల్లి ఇక్కత్ వస్త్రాల తయారీ తీరుతెన్నులను తెలుసుకోవడానికి హ్యాండ్లూమ్ పార్క్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా చేనేత వస్త్రాలను కొనుగోలు చేశారు. తర్వాత ఇక్కత్ చీరను ధరించి ఇలా ఫొటోలకు పోజులిచ్చారు.

– భూదాన్‌పోచంపల్లి

## ఇంధన సమస్యతో ఆగిన డీజీపీ హెలికాప్టర్

**హన్మకొండలోని ఆర్ట్స్ కళాశాలలో ల్యాండింగ్**

**వరంగల్ క్రైం:** తీవ్రవాద ప్రాబల్య జిల్లాల్లో పర్యటిస్తున్న డీజీపీ మహేందర్‌రెడ్డి హెలికాప్టర్‌లో ఇంధనం అయిపోవడంతో అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. డీజీపీ మంగళవారం ములుగు జిల్లాలో పర్యటించగా.. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్యటించారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో హైదరాబాద్ వెళ్లాల్సి ఉండగా మార్గమధ్యలో ఇంధనం అయిపోయింది. దీంతో బుధవారం సాయంత్రం హన్మకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. ఈ మేరకు సమాచారం అందడంతో అప్పటికే ఇంధనం సిద్ధం చేసిన అధికారులు హెలికాప్టర్‌లో నింపాక డీజీపీ తిరిగి బయలుదేరారు. ఆ సమయంలో డీజీపీ వెంట అదనపు డీజీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, ఐజీలు వై.నాగిరెడ్డి, ప్రభాకర్‌రావు ఉండగా.. వరంగల్ పోలీసు కమిషనర్ డాక్టర్ విశ్వనాథ రవీందర్, వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ వారిని కలిశారు. ఈ సందర్భంగా వరంగల్ కమిషనరేట్ పరిధిలో పరిపాలన, శాంతి భద్రతలకు సంబంధించిన విషయాలపై అధికారులతో చర్చించారు.



## వచ్చే ఏడాది ఆన్‌లైన్ ఇంటర్ అడ్మిషన్లు!

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో ఇంటర్మీడియట్‌లో వచ్చే ఏడాది నుంచి ఆన్‌లైన్ ప్రవేశాలు చేపట్టే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి అశోక్ తెలిపారు. ఇంటర్ ఫలితాల వెల్లడి అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆన్‌లైన్ ప్రవేశాలతో పాటు ఆన్ స్క్రీన్ వాల్యుయేషన్‌ను అమలు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే ఖర్చుతో కూడుకున్నది అయినందున ఫీజులు పెంచితే ఎలా ఉంటుందన్న అంశాన్ని పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు.

# ఆడుకుంటూ మృత్యుఒడిలోకి..

- కారు డోర్ లాక్ పడి ఊపిరాడక ఇద్దరు చిన్నారుల మృతి
- మృతులిద్దరూ అక్కాచెల్లెళ్ల కుమారులు
- నిజామాబాద్‌లో విషాదం

**నిజామాబాద్ అర్బన్:** కారులో కూర్చుని సరదాగా ఆడుకుందామనుకున్నారు ఆ చిన్నారులు., కానీ ఆ కారే తమ పాలిట మృత్యుపాశం అవుతుందని గ్రహించుకోలేకపోయారు. ఇంటి పక్కనే నిలిపి ఉన్న కారులో ఎక్కిన ఇద్దరు చిన్నారులు కార్ డోర్ లాక్ అయి.. ఊపిరాడక మృత్యువాత పడ్డారు. ఈ ఘటన నిజామాబాద్ నగరంలోని ముజాహిద్‌నగర్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సయ్యద్ రియాజ్ (10) మంగళవారం మధ్యాహ్నం భోజనం చేసి ఆడుకునేందుకు బయటకు వెళ్లాడు. ఇతనికి మహమ్మద్ బద్రుద్దీన్ (5) జత కలిశాడు. సమీపంలో ఉన్న పార్కులో కలసి ఆడుకున్నారు.



ప్రమాదానికి కారణమైన కారు (ఇన్‌సెట్‌లో) సయ్యద్ రియాజ్, బద్రుద్దీన్

ఈ క్రమంలో అక్కడే పార్క్ చేసిన ఓ కారులోకి సరదా కోసం ఎక్కారు. వెంటనే కారు డోర్ లాక్ కావడంతో అందులోనే ఉండిపోయారు. ఊపిరాడక మృత్యువాత పడ్డారు. సాయంత్రం ఆరైనా చిన్నారులిద్దరూ కనిపించకపోవడంతో తల్లిదండ్రులు సమీపంలోని అన్ని చోట్లా వెతికారు. బుధవారం తెల్లవారు జామున 3.30 గంటలకు కారు యజమాని అబ్దుల్ రహమాన్, తన కారును తెరిచి చూడగా వెనుక సీట్లో ఇద్దరు బాలుర మృతదేహాలు కనిపించాయి. వెంటనే రియాజ్ తండ్రికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఆడుకునేందుకు వెళ్లిన తమ పిల్లలు విగత జీవులుగా కనిపించడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు.

**సీసీ కెమెరాలు పరిశీలించగా..**

ఘటనాస్థలానికి చేరుకున్న ఒకటో టౌన్ పోలీసులు విచారణ చేపట్టారు. సమీపంలో సీసీ కెమెరాలను పరిశీలించగా బాలురు ఆడుకుంటూ కారులోకి వెళ్లినట్లు తేలింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. కాగా, చనిపోయిన ఇద్దరు పిల్లలు అక్కా చెల్లెళ్ల కొడుకులు. తన కలల రూపం కళ్ల ముందే మృత్యువాత పడటంతో ఆ రెండు కుటుంబాలు విషాదంలో మునిగిపోయాయి.













Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792